



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★



నీట్ లీక్‌పై 'ప్రధానమంత్రి', 'మంత్రి ప్రధాన్' బాధ్యత వహించాలి

బంగ్లాదేశ్ బోర్డర్ వెంబడి 'స్మార్ట్ సరిహద్దు' ప్రాజెక్టు

ట్విషా శర్మ మృతి కేసు... కోర్టులో లొంగిపోయిన భర్త 07



సంపుటి 09, సంచిక: 173 | శనివారం | 23-05-2026 | కరీంనగర్ Published from: Karimnagar, Hyderabad, Khammam, Mahabubnagar పేజీలు: 12+8 | వెల రూ. 5.00


## విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి రాజీనామా

ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి తన చైర్మన్ పదవికి రాజీనామా చేశారు. ఈ మేరకు ఆయన రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి శుక్రవారం రాజీనామా లేఖను పంపించారు. విద్యా రంగానికి చెందిన పలు సిఫార్సులను సమర్పించామని, తనకు అప్పగించిన బాధ్యత పూర్తయినందున, తన పదవికి రాజీనామా చేస్తున్నట్టు ఆకునూరి మురళీ ఆ లేఖలో పేర్కొన్నారు. ఆయన పదవీ కాలం ముగియడానికి మరో నాలుగు నెలల సమయం ఉన్నప్పటికీ ముందుగానే ఆకునూరి మురళి చైర్మన్ పదవికి రాజీనామా చేయడం చర్చనీయాంశంగా మారింది.



## నేడు మంత్రివర్గ సమావేశం



ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ఈ నెల 23వ తేదీన సాయంత్రం 4 గంటలకు డాక్టర్ బిఆర్.అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో జరగనుంది. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగే మంత్రివర్గ సమావేశం జరగనుంది. ఈ నెల 21వ తేదీన జరగాల్సిన మంత్రివర్గ సమావేశం సరస్వతి పుష్కరాల ప్రారంభోత్సవం వల్ల ప్రభుత్వం ఈ నెల 23వ తేదీకి వాయిదా వేసిన విషయం తెలిసిందే. మంత్రివర్గ సమావేశంలో చర్చించే ఎజెండాను రూపొందించేందుకు ప్రాధాన్యత గల తరువాయి 8లో

# రూ.100 కోట్ల ఆస్తులు పోగు





- మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా డిప్యూటీ కలెక్టర్‌కు ఆదాయానికి మించిన ఆస్తులు
- వంశీ మోహన్‌ను అరెస్టు చేసిన ఎసిబి
- డిప్యూటీ కలెక్టర్ కార్యాలయం సహా 11 ప్రాంతాల్లో సోదాలు
- తనిఖీల్లో కోట్లాది రూపాయల విలువైన 19 ఓపెన్ ప్లాట్లు, రూ. 1.12 కోట్ల విలువగల మూడు ఇళ్లు గుర్తింపు
- ఇబ్రహీంపట్నం పరిధిలోని నారపల్లి వద్ద 2 ఎకరాల్లో ఫాంహౌస్

ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజ్‌గిరి

అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రభుత్వ అధికారులపై ఎసిబి వేట కొనసాగుతుంది. మొన్న జలమండలి జిఎం అనంతలక్ష్మి కుమార్ ఎసిబికి చిక్కగా, తాజాగా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా డిప్యూటీ కలెక్టర్ వంశీ మోహన్ ఆదాయానికి మించిన ఆస్తులకేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. సుమారు రూ.100 కోట్లకుపైగా ఆస్తులు పోగుచేసినట్లుగా ఆరోపణలున్నాయి. కాగా, శుక్రవారం ఉదయం నుంచి ఆయన కార్యాలయం సహా మరో 11 ప్రాంతాల్లో తనిఖీలు చేశారు. బంధువులు, స్నేహితులు, బినామీల ఇళ్లలో సోదాలు నిర్వహించారు. వంశీమోహన్‌కు సంబంధించిన భారీ ఆస్తులను గుర్తించారు. తనిఖీల్లో రూ.4.46 కోట్ల విలువైన 19 ఓపెన్ ప్లాట్లు, తరువాయి 8లో


# విద్యా రుణాలు యువతపై భవిష్యత్ పెట్టుబడి

- విద్యార్థులకు రుణాలిచ్చేందుకు బ్యాంకులు సానుకూల దృక్పథంతో ముందుకు రావాలి
- సూక్ష్మ, చిన్నతరహా పరిశ్రమలు, మహిళ, దళిత, గిరిజన యువ పారిశ్రామికవేత్తలకు రుణాల పంపిణీపై మరింత దృష్టి పెట్టాలి
- సంక్షేమ పథకాలు, ఆర్థిక స్వావలంబన, ఫ్యూచర్ సిటీ నిర్మాణం, మూసీ పునరుజ్జీవనానికి ప్రథమ ప్రాధాన్యత
- సమగ్రాభివృద్ధి, రైతు సంక్షేమం, మహిళా సాధికారతకు ప్రభుత్వం కట్టుబడి ఉంది
- 494వ రాష్ట్రస్థాయి బ్యాంకర్ల సమావేశంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క




ప్రజాపక్షం/హైదరాబాద్

సంక్షేమ పథకాలు, ఆర్థిక స్వావలంబన, ఫ్యూచర్ సిటీ నిర్మాణం, మహిళా సాధికారత, మూసీ పునరుజ్జీవంపై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రథమ ప్రాధాన్యతలను ఇస్తోందని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్రం పారిశ్రామిక రంగంలో దేశంలోనే అత్యంత వేగవంతంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాల్లో ఒకటని డిప్యూటీ సిఎం చెప్పారు. ఈ నేపథ్యంలో బ్యాంకులు సూక్ష్మ, చిన్నతరహా పరిశ్రమలు, మహిళ, దళిత, గిరిజన యువ పారిశ్రామికవేత్తలకు రుణాల పంపిణీపై బ్యాంకులు మరింత దృష్టి పెట్టాలని అన్నారు. విద్యార్థులకు ఇచ్చే రుణాల విషయంలో బ్యాంకులు మరింత సానుకూల దృక్పథంతో ముందుకు రావాలని ఆయన చెప్పారు. విద్యార్థులకు ఇచ్చే రుణాలు యువతపై మనం పెట్టే భవిష్యత్ పెట్టుబడి అని ఆయన చెప్పారు. సంక్షేమం, అభివృద్ధి రెండింటిని జోడెడ్లుగా పరుగులు తీయగలవని తరువాయి 8లో



## 24 రాజ్యసభ స్థానాలకు షెడ్యూల్

- జూన్ 18న ఎన్నికలు, నామిషన్లకు చివరి తేదీ జూన్ 8
- షెడ్యూల్ విడుదల చేసిన ఎన్నికల సంఘం

**న్యూఢిల్లీ :** జూన్, జులైలో 24 రాజ్యసభ స్థానాలు ఖాళీ కానున్నాయి. ఈ నేపథ్యంలో పది రాష్ట్రాల్లోని 24 స్థానాలకు ఎన్నికల సంఘం శుక్రవారం షెడ్యూల్ విడుదల చేసింది. జూన్ 18న 24 స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు పేర్కొంది. మాజీ ప్రధాని హెచ్.డి. దేవెగౌడ, కాంగ్రెస్ నాయకులు మల్లికార్జున ఖర్గే, దిగ్విజయ్ సింగ్‌లతో సహా పలువురు ప్రస్తుత సభ్యుల పదవీ విరమణ చేయనున్నారు. జూన్ 21 నుండి జులై 19 మధ్య వివిధ తేదీలలో ప్రస్తుత సభ్యులు పదవీ విరమణ చేయనున్న 10 రాష్ట్రాల్లో ఈ రాజ్యసభ ఎన్నికలు జరగనున్నట్లు తరువాయి 8లో



# అవినీతి పుట్టలు పెగులుతున్నాయ్

- అక్రమార్జనతో రూ.కోట్లల్లో డబ్బు కూడబెట్టుకున్న అధికారులు
- ఎసిబి దాడుల్లో బట్టబయలవుతున్న అక్రమాలు
- విశ్వసనీయత కోల్పోతున్న ప్రభుత్వ యంత్రాంగం

ప్రజాపక్షం/ఖమ్మం

అవినీతి పుట్టలు ఒక్కొక్కటిగా పెగులుతున్నాయి. దశాబ్దాల పాటు అధికార పీఠాల్లో కూర్చుని అక్రమంగా సంపాదించినదంతా బయటపడుతున్నది. ఒక్కొక్కరు అవినీతి నిరోధక శాఖాధికారులకు పట్టుబడుతుండటం, కరెన్సీ నోట్లను యంత్రాల ద్వారా లెక్కేసే పరిస్థితి కండ్ల ముందు కనిపిస్తుండడంతో ప్రజలు అవాక్కవుతున్నారు. క్షేత్రస్థాయిలో చిరుద్యోగులు రూ.100కు రూ.500లకు కక్కుర్తి పడ్డారంటే ఒక అర్థముంది. ఉన్నతమైన స్థానాల్లో ఉండి కోట్లాది రూపాయలు వెనకేసుకుని ఇప్పుడు ప్రజల ముందు దోషిగా నిలబడి వారు ఉన్న స్థానాలకే మచ్చ తెస్తున్నారు. ఐఎఎస్ అధికారులు, ఆర్డీవోలు, తహసీల్దార్లు ఈ స్థితిలో తరువాయి 8లో



కార్మికులకు కనీస వేతనాలు

# పెంపు కాదు... తగ్గాయ్

- కార్మిక సంఘాలతో ప్రభుత్వం వెంటనే సమావేశం నిర్వహించాలి
- కనీస వేతనాలు పెంచాలి
- మొండివైఖరి అవలంబిస్తే పోరాటాలే శరణ్యం : ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షుడు యూసుఫ్

ప్రజాపక్షం/హైదరాబాద్

కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం కనీస వేతనాలను తగ్గించిందని రాష్ట్ర కనీస వేతన సలహా మండలి సభ్యులు, ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు మహ్మద్ యూసుఫ్ విమర్శించారు. కార్మిక సంఘాలతో వెంటనే సమావేశాన్ని నిర్వహించి, కనీస వేతనాలను పెంచాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వం మొండి వైఖరిని అవలంబిస్తే పోరాటాలే శరణ్యమని తరువాయి 12లో

# భగ్గుమంటున్న భారతావని



- ప్రపంచంలోనే టాప్-50 హీట్ నగరాలు మొత్తం భారత్‌లోనే
- మధ్యాహ్నానికి ముందే ఉష్ణోగ్రతలు 40 డిగ్రీల పైనే..
- వేడి తాళలేక ప్రజలు ఉక్కిరిబిక్కిరి
- పలు రాష్ట్రాలకు రెడ్ అలర్ట్ జారీ చేసిన ఐఎండి

**న్యూఢిల్లీ :** భారత్‌లో భానుడి ఉగ్రరూపం ప్రదర్శిస్తున్నాడు. వేడి తాళలేక ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. సూర్యుడి భగభగలకు రోడ్ల మీదకు రావాలంటేనే భయపడిపోతున్నారు. శుక్రవారం ఉదయం ఉష్ణోగ్రతలను పరిశీలిస్తే.. ప్రపంచంలోనే టాప్50 హీట్ నగరాలు మొత్తం భారత్‌లోనే ఉన్నాయి. వడగాలుల కారణంగా మధ్యాహ్నానికి ముందే ఉష్ణోగ్రతలు 40 డిగ్రీల పైనే ఉన్నాయి. ఒడిశాలోని బాలన్‌గిర్‌లో అత్యధికంగా 45 డిగ్రీల ఉష్ణోగ్రత తరువాయి 8లో

### వడ దెబ్బకు మరో ముగ్గురు మృతి

భానుడి సెగలకు తెలంగాణ అల్లాడిపోతోంది. ఆరు బయట కాలు పెట్టడానికి ప్రజలు వణుకుతున్న పరిస్థితి నెలకొనగా, రాష్ట్రవ్యాప్తంగా వడదెబ్బతో గురువారం ఒక్కరోజే 22 మంది మరణించారు. మృతుల్లో ఉమ్మడి వరంగల్ జిల్లాలోనే 9 మంది ఉన్నారు. శుక్రవారం కూడా రాష్ట్రంలో మరో ముగ్గురు వడ దెబ్బ కారణంగా ప్రాణాలు కోల్పోయారు. మంచిర్యాల జిల్లా ఉట్నూరు మండలం ఘన్పూర్ గ్రామానికి చెందిన కోవా కిరణ్ (27) మృతి చెందాడు. వరంగల్ జిల్లాలోని ఖిలా వరంగల్ మండలం రంగశాయిపేటకు చెందిన విండ్ల సంతోష్ కుమార్ (49) ప్రాణాలు కోల్పోయాడు. అదే విధంగా మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం మచ్చర్ల గ్రామానికి చెందిన కొట్టెం భద్రమ్మ (60) మృతి చెందింది. ఎండ వేడిమికి జనం భయాందోళనకు గురవుతున్నారు. పలు ప్రాంతాల్లో వడగాలులు వీచే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ హెచ్చరించింది. పలు జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేసింది.

## తల్లిదండ్రులిద్దరూ ఐఎఎస్‌లైతే రిజర్వేషన్లు ఎందుకు?



- వారి పిల్లలకు ఆ అవసరం ఏమిటి?
- రిజర్వేషన్ల ద్వారా తల్లిదండ్రులు ఉన్నత స్థాయికి చేరుకున్నాక మళ్లీ వారి పిల్లల కోసం కోటాను ఆశించడం సరికాదు
- ఇలాగైతే రిజర్వేషన్ల వ్యవస్థ నుంచి ఎప్పటికీ బయటపడలేం
- సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు

**న్యూఢిల్లీ :** దేశంలో రిజర్వేషన్ల ఫలాలు అందుకొని సామాజికంగా, ఆర్థికంగా ఉన్నత స్థాయికి చేరిన కుటుంబాలు.. తరతరాలుగా అదే కోటాను కోరుకోవడంపై సుప్రీంకోర్టు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. తల్లిదండ్రులు ఇద్దరూ ఐఎఎస్ అధికారులై, ప్రభుత్వ సర్వీసుల్లో ఉంటూ పూర్తి స్థాయిలో స్థిరపడినప్పుడు, ఇక వారి పిల్లలకు రిజర్వేషన్ల కోటా ఎందుకు? అని అత్యున్నత న్యాయస్థానం సంచలన ప్రశ్నలు సంధించింది. వెనుకబడిన వర్గాల్లోని 'క్రీమీలేయర్' (ధనిక, ఉన్నత శ్రేణి) తరువాయి 12లో






## మాస్కోలో అంతర్జాతీయ ఉగ్రవాద వ్యతిరేక సదస్సుకు డి.రాజా, రామకృష్ణ పాండా

**న్యూఢిల్లీ :** రష్యాలోని మాస్కో లో ఈ నెల 23 నుండి 27 (నేటి నుంచి బుధవారం) వరకు నిర్వహించనున్న అంతర్జాతీయ ఉగ్రవాద వ్యతిరేక ఫోరంలో పాల్గొనేందుకు భారతదేశ సిపిఐ తరపున సిపిఐ ప్రధానకార్యదర్శి డి.రాజా, సిపిఐ జాతీయ కార్యదర్శి, అంతర్జాతీయ విభాగాధిపతి రామ కృష్ణ పాండా బృందం రష్యాను సందర్శించనుంది. ఈ విషయాన్ని శుక్రవారం సిపిఐ ఒక ప్రకటనలో వెల్లడించింది. ఈ ఫోరమ్ అంతర్జాతీయ ఉగ్రవాదం, నిరంకుశత్వం, దురాక్రమణకు వ్యతిరేకంగా పోరాటం, శాంతి, భద్రత కోసం అనే అంశాలపై సుదీర్ఘంగా ఐదురోజులపాటు చర్చించనుంది. అంతేకాకుండా ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రగతిశీల, వామపక్ష, సామ్రాజ్యవాద వ్యతిరేకశక్తులను ఒకచోట చేర్చనుంది. '21వ శతాబ్దంలో సామ్రాజ్యవాదం, అంతర్జాతీయ తరువాయి 8లో

## యాదాద్రిలో మౌలిక వసతులకు రూ.100 కోట్లు



- అభివృద్ధి పనులకు నేడు సిఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపన
- పనుల ప్రారంభోత్సవానికి హాజరు కానున్న కంచి పీఠాధిపతి, రాష్ట్ర మంత్రులు
- ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య చొరవతో నెరవేరుతున్న భక్తుల దశాబ్దాల కల

ప్రజాపక్షం/యాదాద్రి

ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామి దివ్యక్షేత్రంలో నెరవేరబోతోంది. క్షేత్ర పరిధిలో భక్తుల సౌకర్యార్థం, మౌలిక వసతుల కల్పన కోసం రూ.99.55 కోట్ల (సుమారు రూ. 100 కోట్లు) భారీ అంచనా వ్యయంతో చేపట్టనున్న పలు ప్రతిపాదిత పనులకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి శనివారం ఘనంగా శంకుస్థాపన చేయనున్నారు. క్షేత్రాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దడంతో పాటు గతంలో భక్తులు ఎదుర్కొన్న ప్రధాన సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా 'ప్రజా ప్రభుత్వం' ఈ బృహత్తర ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టింది. గత ప్రభుత్వం దాదాపు 1200 కోట్ల రూపాయల భారీ వ్యయంతో యాదాద్రి ఆలయ పునరుద్ధరణ పనులు చేపట్టినప్పటికీ.. క్షేత్రస్థాయిలో భక్తుల ప్రాథమిక అవసరాలను విస్మరించిందనే విమర్శలు ఉన్నాయి. కొండపైన భక్తులు రాత్రి వేళల్లో నిద్రించడానికి కనీసం ఒక్క గదిని గానీ, డార్మిటరీ హాళ్లను గానీ నిర్మించకపోవడంతో గత కొన్నేళ్లుగా సామాన్య భక్తులు కొండపై తరువాయి 8లో

# ఇదేనా ప్రజాస్వామ్యం, మీడియా స్వేచ్ఛ ?

మనది ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామిక దేశంగా, ప్రాథమిక హక్కులు గ్యారంటీ చేసిన రాజ్యాంగం, అందులో భాగంగా వాక్ స్వాతంత్ర్యం, పత్రికా స్వేచ్ఛవున్న గొప్పదేశంగా మన నాయకులు గొప్పలు చెబుతుంటారు. అయితే పాలకవర్గాలనుంచి రాజ్యాంగం ఒత్తిడికి గురికావటం, వాక్, పత్రికా స్వేచ్ఛలు అణచివేతలకు గురవుతున్న సందర్భాలు దేశ ప్రజలకు అనుభవమే. కాగా బిజెపి – నరేంద్రమోదీ పన్నెండేళ్ల పరిపాలనలో అవి మరీ దాడికి గురవుతున్నాయి. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈ కాలంలో ఒక్కసారంటే ఒక్కసారైనా మీడియా సమావేశం నిర్వహించకపోవటం, విలేకరుల ప్రశ్నలకు సమాధానం చెప్పకపోవటం ప్రపంచంలోనే అరుదైన సంఘటన. ఇక సమాచార సాంకేతిక విజ్ఞాన (ఐటి) చట్టం ద్వారా వాక్, పత్రికా స్వేచ్ఛలను అణచివేసే చర్యలు నిరంకుశ పాలనను తలపిస్తున్నాయి. రెండు తాజా ఉదాహరణలు ఈ విషయాలను ప్రస్ఫుటం చేస్తున్నాయి. ఒకటి, ప్రధాని ఈ వారంలో నోర్డిక్ దేశాల్లో పర్యటన సందర్భంలో విలేకరుల ప్రశ్నలకు అవకాశమివ్వకపోవటం ఆ ప్రజాస్వామిక దేశాల ముందు మన ప్రజాస్వామిక స్వేచ్ఛ అపహాస్య భాజనమైంది. పోయిన శనివారం (16వ తేదీ) నెదర్లాండ్స్‌లో, ఉన్నతస్థాయి చర్చల అనంతరం ఇరుదేశాధినేతలు జరిపిన సాంప్రదాయక మీడియా సమావేశంలో ప్రశ్నలకు అవకాశం ఇవ్వనందుకు పాత్రికేయులు అభ్యంతరం తెలిపారు. మంగళవారం నాడు ఓస్లోలో ఇండియా – నోర్డిక్ అగ్రనాయక సమావేశం (సమ్మిట్) తదుపరి మీడియా సమావేశంలో కూడా మోదీ ప్రశ్నలు స్వీకరించలేదు. డగ్‌సావిసన్ అనే ఓస్లో పత్రికకు పనిచేస్తున్న నార్వేజియన్ జర్నలిస్ట్ హెల్లీ లింగ్ స్వెండ్స్, ఐరోపా దేశాల్లో సాంప్రదాయం ప్రకారం మీడియా ప్రశ్నలకు జవాబు చెప్పాలిందిగా నరేంద్రమోదీని కోరారు. ప్రపంచంలోనే అత్యంత స్వేచ్ఛాయుతమైన ప్రెస్ నుంచి మీరెందుకు ప్రశ్నలు తీసుకోరు అని ఆమె ప్రధాని వెళుతుండగా ఆయన్ను అనుసరించి మరీ ప్రశ్నించా రు. నార్వే ప్రధాన మంత్రి జోనస్ గార్ స్టోర్, 'వారి సాంప్రదాయం భిన్నంగా ఉండవచ్చు, మనం దాన్ని గౌరవించాలి' అని అనునయింపు మాటలు చెప్పారు. ఈ నష్టాన్ని పూడ్చుకునే ప్రయత్నంలో మన విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ అధికారి, భారతదేశ రాజ్యాంగం గొప్పదనం, ప్రాథమిక హక్కులు, మహిళా స్వేచ్ఛలు వగైరా ఏకరువుపెట్టి దేశంలో ప్రజాస్వామ్యం మూడుపువ్వులు ఆరుకాయలుగా వర్ధిల్లుతున్నదని సెలవిచ్చారు. నోర్డిక్ దేశాల ప్రజాస్వామిక స్వేచ్ఛల ముందు ఈ స్వోత్కర్ష అరణ్యరోదనే.

ప్రధాని నరేంద్రమోదీని ప్రశ్నించినందుకు ఆ నార్వేజియన్ జర్నలిస్టు మూల్యం చెల్లించుకున్నారు. ఆమె ఇన్‌స్టాగ్రాం, ఫేస్‌బుక్ అకౌంట్లు సస్పెండ్ చేయబడినాయి! ఇలాంటిదే ప్రజాస్వామ్యం, వాక్ స్వాతంత్ర్యం గొంతునొక్కిన మరో ఘటన. సోషల్ మీడియా ప్లాట్‌ఫాం 'ఎక్స్'లో కనిపించిన వెబ్‌సైట్ పోస్ట్ 'కాక్‌రోచెస్' (బొద్దింకలు) మోదీ ప్రభుత్వాన్ని భయపెట్టాయా? ఏమో. భారత దేశంలో దాన్ని నిషేధింపజేసింది ప్రభుత్వం.

అసలు ఈ బొద్దింకలు ఎక్కడ నుంచి వచ్చాయి? సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ మే 15న తన బెంచిముందు వాదన సందర్భంలో కొందరిని బొద్దింకలతో పోల్చారు. ఆ వ్యాఖ్య దేశ యువతను ఉద్దేశించినట్లుగా మీడియాలో వచ్చింది. తన వ్యాఖ్యను వక్రీకరించారని, తాను ఈ దేశ ప్రస్తుత, భవిష్యత్ మానవ వనరులను చూచి గర్విస్తున్నానని ఆయన వివరణ ఇచ్చారు. కొందరు నకిలీ, బోగస్ డిగ్రీలతో లీగల్ వృత్తిలో, మీడియాలో, సోషల్ మీడియాలో ప్రవేశించి అందర్నీ విమర్శిస్తుంటారని, వారిని ఉద్దేశించి పరాన్నభుక్కులని, బొద్దింకలని తాను అన్నట్లు ఆయన వివరణ ఇచ్చారు. బొద్దింకలు శాస్త్రీయంగా చాలా గట్టిపిండాలు – అణుయుద్ధంలో కూడా బతుకుతాయని శాస్త్రవేత్తలు చెబుతారు. ప్రధాన న్యాయమూర్తి వ్యాఖ్యను వ్యంగ్యంగా చిత్రిస్తూ ఒక పెద్దమనిషి 'బొద్దింకల జనతాపార్టీ' (సిజెపి) స్థాపించినట్లు సోషల్ మీడియా ద్వారా ప్రకటించాడు. నాలుగు రోజుల్లోనే దానికి 2లక్షలమంది ఫాలోయింగ్ వచ్చింది. ఎవరు వీరు? దేశంలోని పరిస్థితులపట్ల కుతకుతమంటున్న యువత. మోదీ ప్రభుత్వ లీగల్ డిమాండ్‌ను అనుసరించి ఒరిజినల్ హాండిల్ సిజెపి_2029 తొలగించబడింది. అయితే అన్ని రకాల బొద్దింకలను చంపుతామన్న పోస్టులపై నిషేధం లేదు. సిజెపి వ్యవస్థాపకుడు అభిజిత్ దిప్కే, అతన్ని అనేకమంది నీచమైన భాషలో ట్రోల్ చేస్తున్నారు. వారి భాషను బట్టి వారు బిజెపి–ఆర్ఎస్ఎస్ వారని వేరుగా చెప్పనవసరం లేదు. ఎవరో ఒకరు అభిజిత్ కులం ఏమిటని అడగ్గా, తాను మహారాష్ట్రకు చెందిన దళితుడినని అతను వెల్లడించాడు – దళిత బొద్దింక అన్నమాట. అతను దేశంలో ఉంటే భౌతికంగా దాడులకు గురయ్యేవాడు. దేశంలో బొద్దింక ఉద్యమంపట్ల మోదీ ప్రభుత్వం, ఆయన పార్టీ ఆందోళన చెంది ఉంటాయి.

రానున్న ఉత్తరప్రదేశ్ ఎన్నికల్లో ''బిజెపి వర్సెస్ సిజెపి'' అని సమాజ్‌వాది పార్టీ నాయకుడు అఖిలేశ్ యాదవ్ తన ఎక్స్ ఖాతాలో పోస్టు పెట్టాడు. అందుకే ఆ బొద్దింకలను ఆదిలోనే అణచివేయాలని మోదీ ప్రభుత్వం భావించి ఉండవచ్చు. ఇదీ మోదీ మార్క్ ప్రజాస్వామ్య భారతం!



## ఎబోలా వైరస్ వేగంగా విస్తరిస్తోంది

**కాంగోలో ఎబోలా వైరస్ వేగంగా విస్తరిస్తోంది. ప్రాంతీయంగా ఈ వైరస్ వ్యాప్తిచెందే అవకాశం అధికంగానే ఉంది. ప్రపంచస్థాయిలో మాత్రం తక్కువగానే ఉంది. ప్రస్తుతం కాంగోలో దాదాపు 750 ఎబోలా అనుమానిత కేసులు ఉన్నాయి. ఈ వైరస్ కారణంగా 177 మంది ప్రాణాలు విడిచారు. ధ్రువీకరించిన గణాంకాల కంటే ఈ మహమ్మారి తీవ్రత చాలా ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. కాంగో పొరుగు దేశమైన ఉగాండాలో పరిస్థితి స్థిరంగా ఉంది. అక్కడ ఈ వ్యాధితో ఒకరు మరణించారు. మరో రెండు కేసులు నిర్ధారణ అయ్యాయి.**

- డబ్ల్యుహెచ్‌ఒ చీఫ్ టెడ్రోస్ అధనోమ్

## రాచకొండకు వెళ్లే పూర్వపు బాటను బాగు చేయండి

లేఖ

తెలంగాణ రాష్ట్రంలోనే పేరుగాంచిన చరిత్రక నేపథ్యం కలిగిన, ప్రకృతి రమణీయతకు మారుపేరుగా ఉన్న రాచకొండ. యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల పరిధిలో ఉంటుంది. పూర్వపు 20 ఏళ్ల కిందటి వరకు రాచకొండ కు వెళ్లాలంటే సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రం నుండి కాలినడకన కొచ్చేరువు రోడ్డు నుండి ప్రభుత్వ నక్షబాట కాచబండల మీదుగా గన్నేర్ల, మోకాళ్ళ కురుమ, వీరన్న పాల్లు( కోనేరు) మీదుగా రాచకొండ కు చేరుకునేది, ఇటువైపుగా రవాణా సౌకర్యం అప్పట్లో అంత లేకపోవడంతో ఇదే మార్గం గుండా ఆరుట్ల, మంచాల, గున్‌గల్, రాయపోలు, ఇబ్రహీంపట్నం ప్రాంతాలకు కాలినడకన వెళ్లేవాళ్లు ప్రజలు. రోడ్డుమార్గం లేనంతవరకు ఇక్కడి నుండే ప్రయాణం సాగించేవారు అందరూ. ఎప్పుడైతే సంస్థాన్ నారాయణపురం నుండి వెంకబావితండా,అల్లాపురం మీదుగా రాచకొండకు ఆర్ అండ్ బి రోడ్డు మార్గం ఏర్పడిందో నాటి నుండి కాలినడకన ప్రయాణించే రోడ్డు బాట మరుగున పడింది. అటువైపుగా వ్యవసాయ దారులు, భూములు ఉన్న రైతులు తప్ప పెద్దగా ప్రజలు నడిచిన పరిస్థితులు లేవు. సంస్థాన్ నారాయణపురం నుండి రోడ్డు మార్గం ద్వారా చుట్టూ తిరిగి రాచకొండకు చేరుకుంటే 15 కిలోమీటర్లు వస్తుంది. అదే పూర్వపు మట్టి రోడ్డు నుండి వెళ్తే 5 కిలోమీటర్లు వస్తుంది దాదాపు 10 కిలోమీటర్ల వ్యత్యాసం కనిపిస్తున్న తరుణంలో పూర్వపు కాలినడకన మట్టిబాటని అటువైపు భూములు ఉన్న రైతులు కొంతమేరకు చదును చేసుకుని వాహనాల రాకపోకలు సాగే విధంగా కొంతమేరకు వారి సొంత నిధులతో బాగుచేసే ప్రయత్నం చేశారు. కానీ పూర్తిస్థాయిలో జరగలేదు. కాబట్టి ప్రభుత్వం ఇట్టి బాటను కాచబండ మీదుగా గన్నేర్ల వరకు బాటకు ఇరువైపులా ఏపుగా పెరిగిన పిచ్చి చెట్లను తొలగించి రాకపోకలకు అసౌకర్యం కలిగించే రాళ్లను తొలగించాలె.

జాతీయ ఉపాధి హామీ పథకం కింద ముందుగా ఇరువైపుగా పెరిగిన పిచ్చి చెట్లను బాటలో అడ్డంగా ఉన్న రాళ్లను తీసి చదును చేయాలి. బాట మధ్యలో పడిన పెద్ద పెద్ద రాళ్లను తొలగించి రాకపోకలు , దిచక్ర వాహనాలు, ట్రాక్టర్లు వెళ్లే విధంగా చేసినట్లయితే ఎంతోమందికి రైతులకు,ప్రజలకు,రాచకొండ కు వెళ్లే ప్రకృతి ప్రేమికులకు ఇటువైపుగా వెళ్లేందుకు చాలా సులువుగా ఉంటుంది. ఆరుట్ల, గున్ గల్, రాయాపోల్, మంచాల ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు కూడా ఇటువైపుగా వెళ్తే అతి తక్కువ సమయంలో గమ్యాన్ని చేరుకునే వెసులుబాటు ఉంటుంది. ఆధ్యాత్మికంగా ప్రశాంతతని కోరుకునే భక్తులు కాలినడకన రాచకొండకు ఈ మార్గాన వెళితే చాలా దగ్గరవుతుంది.

మంచి ప్రకృతి వాతావరణంలో ప్రయాణిస్తే మనసుకు మంచి ప్రశాంతత కూడా లభిస్తుంది.నేటి విద్యార్థిని, విద్యార్థులు రాచకొండ ప్రకృతి అందాలను, రాజుల కాలం నాటి చారిత్రక కట్టడాలను చరిత్రను తెలుసుకునేందుకు ఇటువైపుగా వెళితే పూర్వపు విషయాలను చరిత్రను లోతుగా తెలుసుకునే అవకాశం ఉంటుంది. కాబట్టి ప్రభుత్వం వెంటనే కాచబండల నుండి గన్నేర్ల మధ్య మిగిలిపోయిన కొంత భాగాన్ని ప్రభుత్వం ఉపాధి హామీ పథకంలో భాగంగా బాగుచేసి రాకపోకలకు సౌకర్యంగా ఉండే విధంగా చేయాలని కోరుతున్నాను.

**గుండమల్ల సతీష్ కుమార్,**
9494155522

# ప్రాంతీయ శక్తులను పిప్పిచేస్తున్న కమలం



జుర్రు నారాయణ యాదవ్
9494019270

భారతీయ జనతా పార్టీ (బిజెపి) ఎదుగుదల భారత రాజకీయ చరిత్రలో ఒక అసాధారణ పరిణామం. 1984లో కేవలం రెండు పార్లమెంటు స్థానాలతో ప్రారంభమైన ఈ పార్టీ, నేడు ప్రపంచంలోనే అతిపెద్ద రాజకీయ శక్తిగా అవతరించింది. భావజాల బలం, పటిష్టమైన సంస్థాగత నిర్మాణం మరియు క్షేత్రస్థాయి కార్యకర్తల నెట్‌వర్క్ దీని విజయానికి ప్రధాన పునాదులు. ఉత్తరాదితో పాటు ఈశాన్య రాష్ట్రాల్లో జైత్రయాత్ర కొనసాగిస్తూ, పశ్చిమ తీరం వరకు తన ఉనికిని చాటుకుంది. ప్రస్తుతం దక్షిణాదిలోనూ పాగా వేసేందుకు పటిష్టమైన వ్యూహాలతో దూసుకుపోతోంది. ఈ క్రమంలో కొన్ని చోట్ల సొంతంగాను, మరికొన్ని చోట్ల ఎన్డీఏ మిత్రపక్షాలతో కలిసి అధికార పీఠాన్ని అధిష్ఠిస్తోంది.

గణాంకాల ప్రకారం, బిజెపి, దాని మిత్రపక్షాలు సుమారు 22 రాష్ట్రాల్లో/ కేంద్ర పాలిత ప్రాంతాల్లో అధికారంలో ఉన్నాయి (దీనిలో 14 రాష్ట్రాల్లో బిజెపి ప్రత్యక్షంగా అధికారాన్ని కలిగి ఉండగా, 6 రాష్ట్రాల్లో 2 కేంద్రపాలిత ప్రాంతాలలో మిత్రపక్షాలతో అధికారాన్ని పంచుకుంది).

ఈ విధంగా దేశంలోని సుమారు 75 శాతం జనాభా ప్రస్తుతం బిజెపి లేదా దాని అనుబంధ కూటమి పాలనలో జీవిస్తున్నారు, ఇది ఆ పార్టీ సంస్థాగత ఎదుగుదలకు నిదర్శనం. భారతదేశంలో ప్రాంతీయ పార్టీలను బలహీనపరిచి, ఆయా రాష్ట్రాల్లో పాగా వేయడంలో భారతీయ జనతా పార్టీ (బిజెపి) ఒక వినూత్నమైన మరియు దూకుడుతో కూడిన వ్యూహాన్ని అనుసరిస్తోంది. ఈ వ్యూహం ప్రధానంగా 'కబళించడం లేదా విచ్ఛిన్నం చేయడం' అనే సూత్రంపై ఆధారపడి ఉంటుంది. మొదట ప్రాంతీయ పార్టీలతో పొత్తులు పెట్టుకుని, ఆ పార్టీల ఓటు బ్యాంకును మరియు కేడర్‌ను తనవైపు తిప్పుకోవడం ద్వారా బిజెపి తన ప్రాబల్యాన్ని పెంచుకుంటుంది. దీనికి ఉత్తమ ఉదాహరణ మహారాష్ట్ర. అక్కడ దశాబ్దాల కాలంపాటు శివసేనతో జూనియర్ భాగస్వామిగా ఉన్న బిజెపి, క్రమంగా ఆ పార్టీలోని అసంతృప్త నేతలను (ఏక్ నాథ్ షిండే వర్గం) ప్రోత్సహించి, ఏకంగా పార్టీనే రెండుగా చీల్చడం ద్వారా శివసేన ఉనికిని ప్రమాదంలోకి నెట్టింది. అలాగే బీహార్‌లో జనతాదళ్ (యునైటెడ్‌తో పొత్తులో ఉంటూనే, ఆ పార్టీ నేత నితీష్ కుమార్ ప్రాభవాన్ని తగ్గించేలా పావులు కదిపి, ఆ పార్టీని తనపై ఆధారపడేలా చేసింది.

మరోవైపు, పశ్చిమ బెంగాల్, ఒడిశా, పంజాబ్ వంటి రాష్ట్రాల్లో ప్రాంతీయ పార్టీల ముఖ్య నేతలపై అవినీతి ఆరోపణలు చేస్తూ, కేంద్ర దర్యాప్తు సంస్థలను (ED, CBI) రాజకీయ అస్త్రాలుగా వాడుతూ, ఆ పార్టీలను రక్షణాత్మక ధోరణిలోకి నెట్టడం బిజెపి శైలి. ఈశాన్య రాష్ట్రాల్లో అయితే, బలమైన నాయకులను నేరుగా బిజెపిలోకి చేర్చుకుని (ఉదాహరణకు అస్సాంలో హిమంత బిశ్వ శర్మ), ప్రాంతీయ పార్టీలను నామమాత్రం చేస్తోంది. కేవలం హిందుత్వ భావజాలం మాత్రమే కాకుండా, 'డబుల్ ఇంజిన్ సర్కార్' అనే నినాదంతో ప్రాంతీయ ఆకాంక్షల కంటే జాతీయవాదం గొప్పదని ప్రజలను నమ్మించడం ద్వారా బిజెపి ప్రాంతీయ శక్తులను బలహీనపరుస్తోంది. ఈ క్రమంలో ప్రాంతీయ పార్టీలు తమ సొంత అస్తిత్వాన్ని కాపాడుకోవడానికి సిద్ధాంతపరమైన పోరాటం కంటే, ఉనికి కోసం పోరాడాల్సి న పరిస్థితిని బిజెపి కల్పిస్తోంది.

భారతదేశం వంటి భిన్నత్వంతో కూడిన సమాఖ్య దేశంలో ప్రాంతీయ పార్టీలను బలహీనపరిచి, ఏకపక్ష ఆధిపత్యం కోసం ప్రయత్నించడం ప్రజాస్వామ్య సమతుల్యతకు పెద్ద ముప్పుగా పరిణమిస్తుంది. రాజ్యాంగం మన దేశాన్ని 'రాష్ట్రాల కూటమి'గా అభివర్ణించింది. అంటే రాష్ట్రాల అస్తిత్వం, వాటి స్వయంప్రతిపత్తి ప్రజాస్వామ్యానికి ప్రాణం. అయితే, కేంద్రంలోని అధికార పార్టీ ప్రాంతీయ శక్తులను అణచివేయడం వల్ల 'సమాఖ్య స్ఫూర్తి' తీవ్రంగా దెబ్బతింటుంది. ప్రాంతీయ పార్టీలు కేవలం రాజకీయ సంస్థలు మాత్రమే కాదు, అవి ఆయా ప్రాంతాల భాషా, సాంస్కృతిక మరియు ప్రత్యేక అవసరాలకు ప్రతినిధులు. వాటిని నిర్వీర్యం చేయడం అంటే ఆ ప్రాంత ప్రజల గొంతుకను నొక్కడమే అవుతుంది.

ముఖ్యంగా, ఎమ్మెల్యేల కొనుగోళ్లు, పార్టీల విచ్ఛిన్నం మరియు కేంద్ర దర్యాప్తు సంస్థల అతి జోక్యం వంటి చర్యలు రాజ్యాంగంలోని 10వ షెడ్యూల్ (పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం) యొక్క ఉద్దేశ్యా న్ని అపహాస్యం చేస్తున్నాయి. ప్రజాస్వామ్యంలో బలమైన ప్రతిపక్షం లేకపోతే పాలన నిరంకుశత్వంగా మారే ప్రమాదం ఉంది. ఒకే దేశం ఒకే పార్టీ అనే ధోరణి పెరిగితే, అది భిన్నత్వంలో ఏకత్వం అనే భారతీయ మూల సూత్రానికి విరుద్ధంగా మారుతుంది. గవర్నర్ వ్యవస్థను రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకోవడం ద్వారా ఎన్నికైన రాష్ట్ర ప్రభుత్వాలను అస్థిరపరచడం రాజ్యాంగ నైతికతకు తలవంపులు తెచ్చే అంశం. అధికారం కేంద్రీకృతమైతే, స్థానిక సమస్యలు నిర్లక్ష్యానికి గురవుతాయి, ప్రజల తీర్పుకు విలువ లేకుండా పోతుంది. ఇది దీర్ఘకాలంలో ఓటరుకు ప్రజాస్వామ్య ప్రక్రియపైనే నమ్మకం పోయే లా చేస్తుంది, ఇది రాజ్యాంగం కల్పించిన స్వేచ్ఛా యుత సమాజానికి తీరని నష్టం.

భారతదేశం వంటి భిన్నత్వంతో కూడిన దేశంలో ప్రాంతీయ పార్టీల ఉనికి ప్రజాస్వామ్య ఆరోగ్యానికి, సమాఖ్య వ్యవస్థ పటిష్టత కు అత్యంత అవసరం. మన దేశం వివిధ భాషలు, సంస్కృతులు, భౌగోళిక పరిస్థితుల సమాహారం. జాతీయ పార్టీలు తరచుగా దేశవ్యాప్త ప్రయోజనాలపై దృష్టి సారిస్తాయి, దీనివల్ల స్థానిక సమస్యలు, ప్రాంతీయ ఆకాంక్షలు తగిన గుర్తింపుకు నోచుకోవు. అటువంటి సందర్భాలలో, ప్రాంతీయ పార్టీలే ఆయా ప్రాంతాల ప్రజల గొంతుక గా మారి, వారి హక్కుల కోసం పోరాడుతాయి. రాజ్యాంగం నిర్దేశించిన సమాఖ్య స్ఫూర్తిని రక్షించడంలో ఇవి కీలక పాత్ర పోషిస్తాయి. కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీ నిరంకుశంగా వ్యవహరించకుండా అడ్డుకోవడానికి, అధికార కేంద్రీకరణను నిరోధించడానికి ప్రాంతీయ పార్టీలు ఒక రక్షణ కవచంలా పనిచేస్తాయి.

స్థానిక వనరుల వినియోగం, భాషా పరిరక్షణ, ప్రాంతీయ వెనుకబాటుతనాన్ని తొలగించడంలో ఈ పార్టీలకు ఉన్న అవగాహన జాతీయ పార్టీలకు ఉండదు. ఉదాహరణకు, నదీ జలాల పంపకాలు లేదా రాష్ట్ర హక్కుల విషయంలో ప్రాంతీయ పార్టీలు చూపే పట్టుదల స్థానిక ప్రజలకు భరోసానిస్తుంది. అలాగే, బలమైన ప్రాంతీయ పార్టీలు ఉన్నప్పుడు జాతీయ పార్టీలు కూడా రాష్ట్రాల డిమాండ్లను గౌరవించక తప్పని పరిస్థితి ఏర్పడుతుంది. ప్రజాస్వామ్యంలో అధికారం ఒకే చోట కేంద్రీకృతం కాకుండా, వికేంద్రీకరణ జరగాలంటే క్షేత్రస్థాయిలో బలంగా ఉండే ప్రాంతీయ శక్తులు ఉండాలి. భిన్నత్వం లో ఏకత్వం అనే సూత్రం వర్ధిల్లాలన్నా, అట్టడుగు వర్గాల ప్రాంతీయ సమస్యలకు పరిష్కారం దొరకాలన్నా ప్రాంతీయ పార్టీల మనుగడ రాజ్యాంగబద్ధంగా ఎంతో ముఖ్యం. ఇవి లేనినాడు భారతదేశ వైవిధ్యం దెబ్బతిని, దేశం ఒకే విధమైన మూస ధోరణిలోకి వెళ్లే ప్రమాదం ఉంది.

***ప్రజాస్వామ్యంలో అధికారం ఒకే చోట కేంద్రీకృతం కాకుండా, వికేంద్రీకరణ జరగాలంటే క్షేత్రస్థాయిలో బలంగా ఉండే ప్రాంతీయ శక్తులు ఉండాలి. 'భిన్నత్వంలో ఏకత్వం' అనే సూత్రం వర్ధిల్లాలన్నా, అట్టడుగు వర్గాల ప్రాంతీయ సమస్యలకు పరిష్కారం దొరకాలన్నా ప్రాంతీయ పార్టీల మనుగడ రాజ్యాంగబద్ధంగా ఎంతో ముఖ్యం. ఇవి లేనినాడు భారతదేశ వైవిధ్యం దెబ్బతిని, దేశం ఒకే విధమైన మూస ధోరణిలోకి వెళ్లే ప్రమాదం ఉంది.***

ప్రజాస్వామ్యం అనేది కేవలం అధికార మార్పిడి కాదు, అది భిన్న స్వరాల కలయిక. బిజెపి అనుసరిస్తున్న 'ఏకపార్టీ ఆధిపత్య' ధోరణి సమాఖ్య వ్యవస్థలోని వైవిధ్యానికి గొడ్డలి పెట్టు వంటిది. రాజ్యాంగం కల్పించిన స్వయంప్రతిపత్తిని గౌరవించకుండా, ప్రాంతీ య శక్తులను బలహీనపరిస్తే అది దేశ సమైక్యతకే నష్టం కలిగిస్తుంది.

ప్రాంతీయ పార్టీల ఉనికి ఉన్నప్పుడే స్థానిక ఆకాంక్షలకు గౌరవం లభిస్తుంది. భిన్నత్వంలో ఏకత్వం అనే భారతీయ ఆత్మ పరిరక్షించబడుతుంది. ఏకధ్రువ రాజకీయాల కంటే, బహుళ స్వరాలు వినిపించే ఆరోగ్యకరమైన ప్రజాస్వామ్యమే భారతదేశ ఉజ్వల భవిష్యత్తుకు అసలైన గ్యారెంటీ. పాలకులు రాజ్యాంగ నైతికతను పాటిస్తూ, ప్రాంతీయ అస్తిత్వాలను గుర్తించినప్పుడే భారత ప్రజాస్వామ్యం నిజమైన అర్థాన్ని సంతరించుకుంటుంది.

# అమలులోకి రెండు లేబర్ కోడ్‌లు

వేతనాలపై కోడ్ (2019), పారిశ్రామిక సంబంధాల కోడ్ (2020) కింద తుది రూల్స్‌ను కేంద్రప్రభుత్వం పశ్చిమ బెంగాల్ ఎన్నికల్లో బిజెపి విజయం అనంతరం, శుక్రవారం (మే8) ప్రచురించి వాటిని పూర్తిగా అమలులోకి తెచ్చింది. ఇవేగాక, గనులు (మైనింగ్), వస్తూత్పత్తి (మాన్యుఫాక్చరింగ్), సేవ(సర్వీసు) రంగాలకు సంబంధించి మోడల్ స్టాండింగ్ ఆర్డర్స్, 2026ను కూడా కేంద్ర కార్మిక, ఉపాధి మంత్రిత్వశాఖ ప్రకటించింది. నాలుగు లేబర్ కోడ్‌లలో మిగతా కోడ్‌లు – సామాజిక భద్రత కోడ్(2020), వృత్తిపరమైన భద్రత, ఆరోగ్యం, పని పరిస్థితులపై కోడ్ (2020)లకు సంబంధించి తుది రూల్స్‌ను కూడా త్వరలో ప్రచురిస్తామని కార్మిక శాఖ అధికారులు చెప్పారు.

వివాదాస్పదమైన నాలుగు లేబర్ కోడ్‌లను బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి కూటమి ఘనవిజయం సాధించాక – 2025 నవంబర్ 21న కేంద్రప్రభుత్వం నోటిఫై చేసింది. అయితే 10 కేంద్ర ట్రేడ్ యూనియన్‌ల ఐక్యవేదిక సమ్మె హెచ్చరికతో వాటిని అమలు చేయలేదు. ఆ తర్వాత, 2026–27 కొత్త ఆర్థిక సంవత్సరం ప్రారంభం నుంచి – 2026 ఏప్రిల్ 1 నుండి లేబర్ కోడ్‌లు పూర్తి అమలులోకి వస్తాయని కార్మికశాఖ ప్రకటించింది. తుది రూల్స్‌పై సంబంధితుల (స్టేక్‌హోల్డర్స్) నుంచి మరింతగా అభిప్రాయాలు అవసరమని తెలిపింది. పర్యవసానంగా, 2025 డిసెంబర్ 30న కేంద్ర రూల్స్ ముసాయిదా ప్రచురించారు. అభిప్రాయాల కోసం పారిశ్రామిక సంబంధాల కోడ్‌కు 30 రోజులు, మిగతా మూడు కోడ్‌లకు 45 రోజులు వ్యవధి ఇచ్చారు.

ఇదిలావుండగా, ఈ కార్మిక వ్యతిరేక కోడ్‌ల తక్షణ ఉపసంహరణను డిమాండ్ చేస్తూ కేంద్ర ట్రేడ్ యూనియన్‌లు, రైతు సంఘాలు, స్కీం వర్కర్స్, బ్యాంక్ అసోసియేషన్‌లు ఇతర స్వతంత్ర ఫెడరేషన్‌లు 2026 ఫిబ్రవరి 12న అపూర్వమైన అఖిల భారత సమ్మె నిర్వహించాయి. కోడ్‌లు అమలు చేయటానికి అంతిమ రూల్స్‌ను జారీ చేసినట్లయితే పెక్కురోజుల సమ్మెతోపాటు కనీవినీ ఎరుగని ప్రతిఘటనను చవిచూడాల్సి ఉంటుందని కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించాయి. అయినా ప్రభుత్వం మూర్ఖంగా రెండు కోడ్‌ల అంతిమ రూల్స్ ఇప్పుడు ప్రచురించింది. ఇది కార్మిక వర్గానికి సవాలు మాత్రమే గాక మరో విశేషం కూడా ఉంది. లేబర్‌కోడ్‌ల కింద తమ సొంత రూల్సు ప్రచురించని ఏకైక రాష్ట్రం పశ్చిమ బెంగాల్. కార్మిక వ్యవహారాలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉమ్మడి జాబితాలో ఉన్నందున రాష్ట్రం కూడా రూల్స్ ప్రచురించటం చట్టరీత్యా అవసరం. ప.బెంగాల్‌లో ప్రభుత్వ మార్పు తొలి పర్యవసానం కార్మికవర్గంపై పడనుంది. బిజెపిఅధికారంలోకి వచ్చిన ప్రత్యక్ష ఫలితం ఇది. సువేందు అధికారి ప్రభుత్వం లేబర్ కోడ్‌ల అమలు రూల్సు ప్రచురించటంతో అవి దేశవ్యాప్తంగా అమలులోకి వస్తాయి.

నాలుగు చట్టాలను కలిపి వేతనాలపై కోడ్ రూపొందించారు. అవి – కనీస వేతనాలు, వేతనాల చెల్లింపు, బోనస్ చెల్లింపు, సమాన వేతనం. పారిశ్రామిక సంబంధాల కోడ్‌లో 3 చట్టాలు కూర్చారు. అవి – పారిశ్రామిక వివాదాలు, పారిశ్రామిక ఉపాధి (స్టాండింగ్ ఆర్డర్స్), ట్రేడ్ యూనియన్‌లు. ఈ రెండు కోడ్‌ల అంతిమ రూల్స్ ప్రచురించారు.

సామాజిక భద్రత కోడ్‌లో 9 చట్టాలను గుదిగుచ్చారు. అవి– ఇపిఎఫ్. ఇఎస్ఐసి, ప్రశూతి సదుపాయం, గ్రాట్యుటీ, వగైరా.

వృత్తిపరమైన భద్రత, ఆరోగ్యం, పని పరిస్థితుల కోడ్‌లో 13 చట్టాల సారాన్ని పొందుపరిచారు. ఫ్యాక్టరీల చట్టం, గనుల చట్టం, కాంట్రాక్టు లేబర్ వగైరా వాటిలో ఉన్నాయి.

ఈ రెండు కోడ్‌ల తుది రూల్స్ ప్రచురించేవరకు పాత రూల్సు అమలులో ఉంటాయి.

ఈ కోడ్‌ల అమలును కార్మిక సంస్కరణకు ఎంతో అవసరమైన తదుపరి పరివర్తనాత్మక చర్యగా ప్రభుత్వం అభివర్ణిస్తుండగా, కార్మిక సంఘాలు మాత్రం వాటిని కార్మికులు పోరాడి సాధించుకున్న అనేక హక్కులను హరించే చర్యలుగా, కార్మికులను పెట్టుబడిదారుల దయాదాక్షిణ్యాలకు బలిపెట్టే చర్యలుగా, వాటి ఉపసంహరణ కొరకు గత ఐదు సంవత్సరాలుగా నిర్విరామంగా పోరాటాలు చేస్తున్నాయి.

# స్క్రీన్‌పై కాక్రోచ్.. సిస్టమ్‌లో కలకలం!



ఫిరోజ్ ఖాన్
9640466464

డిజిటల్ యుగంలో రాజకీయ, సామాజిక నిరసనలకు కొత్త రూపాలు పుడుతున్నాయి. ప్రజాస్వామ్య వ్యవస్థలపై పెరుగుతున్న విమర్శలు, భావ వ్యక్తీకరణ స్వేచ్ఛపై జరుగుతున్న చర్చల మధ్య సోషల్ మీడియా వేదికగా ఒక అపూర్వమైన, ఊహించని నవ నిరసన ఉద్భవించింది. ఇటీవల ఇన్‌స్టాగ్రామ్ వేదికగా వైరల్ అయిన కాక్రోచ్ జనతా పార్టీ అనే వ్యంగ్యాత్మక ఉద్యమం అందుకు తాజా ఉదాహరణగా నిలిచింది. దేశంలోని అత్యున్నత న్యాయస్థానానికి చెందిన చీఫ్ జస్టిస్ వ్యాఖ్యల నేపథ్యంలో, యువతను ఉద్దేశించి మీడియా ప్రచురించిన కొన్ని పదాలు వారి మనసుల్లో అసంతృప్తిని, ఆవేదన ను రేకెత్తించాయి. సమాజంలోని ఒక వర్గం తమ ఉనికిని కాపాడుకోవడానికి, ప్రశ్నించే హక్కును చాటడాని కి ఒక వినూత్న డిజిటల్ శైలిని ఎంచుకుంది. రాజకీయ ప్రక్రియల్లో తమ అభిప్రాయాలకు తగిన ప్రాధాన్యం లభించడం లేదని భావించే కొందరు యువతలో ఈ వేదిక చర్చకు దారితీసింది. సాంప్రదాయ రాజకీయ ప్రక్రియలపై అసంతృప్తిని వ్యక్తపరుస్తున్న యువతకు ఇది ఒక కొత్త డిజిటల్ వ్యక్తీకరణగా కొందరు విశ్లేషకులు అభివర్ణిస్తున్నారు.

వైరల్ ఉద్యమ విజయాన్ని కేవలం సోషల్ మీడియా వినోదంగా కొట్టిపారేయలేం. బోస్టన్ యూనివర్సిటీకి చెందిన విద్యార్థి, గతంలో ఆమ్ ఆద్మీ పార్టీతో సంబంధాలు ఉన్న అభిజీత్ దీప్కే ప్రారంభించిన ఈ 'కాక్రోచ్ జనతా పార్టీ' ఇన్‌స్టాగ్రామ్ ఖాతా, వివిధ మీడియా నివేదికల ప్రకారం, కేవలం ఐదు రోజుల్లోనే దాదాపు 15 మిలియన్ల (కోటిన్నర) ఫాలోవర్లను ఆకర్షించి సోషల్ మీడియా చరిత్రలో ఒక సంచలనంగా నిలిచింది. ప్రధాన అంతర్జాతీయ మీడియా కథనాల ప్రకారం, ఈ వేదిక నిరుద్యోగం, విద్యా వ్యవస్థ, పరీక్ష ల నిర్వహణపై వివాదాలు, యువతలో పెరుగుతున్న అసంతృప్తి, రాజకీయ వ్యవస్థలపై అవిశ్వాసం వంటి అంశాలను వ్యంగ్య శైలిలో ప్రస్తావించడం వల్ల విశేష ఆదరణ పొందింది. పశ్చిమ బెంగాల్ ఎన్నికల నిర్వహణపై ప్రతిపక్ష పార్టీలు, పౌర సంఘాలు కొన్ని అభ్యంతరాలు వ్యక్తం చేయడం, రాజస్థాన్‌లో నీట్ పరీక్ష పేపర్ లీకేజీల వంటి సంఘటనలు యువతలో ఆందోళనలను పెంచాయి. ఈ అంశాలపై సోషల్ మీడియా లో విస్తృత చర్చ జరగగా, సంప్రదాయ మీడియా కవరేజ్‌పై కూడా భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. అదే సమయం లో, ఈ ఉద్యమానికి సంబంధించిన X(ట్విట్టర్) ఖాతా భారతదేశంలో అందుబాటులో లేకపోవడం మరింత చర్చకు దారితీసింది.

### కాక్రోచ్ రూపకం వెనుక ప్రతీకాత్మకత

ఈ ఉద్యమానికి కాక్రోచ్ (బొద్దింక) అనే రూపకాన్ని ఎంచుకోవడంలోనూ ఒక బలమైన ప్రతీకాత్మకత కనిపిస్తుంది. శాస్త్రీయ అధ్యయనాల ప్రకారం బొద్దింక లు అత్యంత అనుకూలత సామర్థ్యం కలిగిన జీవుల్లో ఒకటి. అనేక రకాల కీటకనాశక మందులపై అవి అద్భుతమైన ప్రతిరోధకతను అభివృద్ధి చేసుకున్నాయ ని అంతర్జాతీయ పరిశోధనలు సూచిస్తున్నాయి. పరిస్థితులు ఎంత కఠినంగా మారినా మనుగడ కోసం మార్గాలు వెతుక్కునే ఈ జీవి, సమాజంలో అణగారిన లేదా నిర్లక్ష్యానికి గురైన వర్గాల భావోద్వేగాలకు ఒక రూపకంగా నిలవడం యాదృచ్ఛికం కాదు. అయితే ఈ పోలికను శాస్త్రీయ వాస్తవంగా కాకుండా సామాజి క సంకేతంగా చూడాలి. ఎందుకంటే ప్రజాస్వామ్యం లో ప్రశ్నించే స్వరం కూడా నిరోధాలను ఎదుర్కొన్నప్పుడు కొత్త రూపాల్లో వ్యక్తమవుతుందనే భావన ఇక్కడ ప్రధానంగా కనిపిస్తోంది. వివిధ నిరోధాలు, పరిమితులను ఎదుర్కొంటూ కూడా మనుగడ సాగించే ఈ జీవి లాగే, నేటి యువత కూడా తమ భావ వ్యక్తీకరణ స్వేచ్ఛను నిలబెట్టుకోవడానికి ఇదొక మార్గంగా ఎంచుకుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఏదైనా సామాజిక లేదా రాజకీయ ఉద్యమం ఊపందుకున్నప్పుడు, దాని వెనుక ఉన్న ఉద్దేశాలను, నిష్పాక్షికతను బేరీజు వేయడం బాధ్యతాయుతమైన పత్రికారంగం యొక్క కనీస ధర్మం. గతంలో 'ఇండియా అగైనెస్ట్ కరప్షన్' ఉద్యమం రాజకీయ పరిణామాలకు దారితీసినట్లే, ఈ డిజిటల్ ఉద్యమంపై కూడా భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఉద్యమం పూర్తిగా స్వతంత్ర పౌర చొరవా, లేక వివిధ రాజకీయ భావజాలాల ప్రభావం కూడా ఉందా అనే చర్చలు కొన్ని వర్గాల్లో వినిపిస్తున్నాయి. అయితే దీనిపై స్పష్టమైన ఆధారాలు ప్రస్తుతం అందుబాటులో లేవు. అదే సమయంలో, రాజస్థాన్‌లో పేపర్ లీకేజీలపై కాంగ్రెస్ పార్టీ రోడ్లపైకి వచ్చి విద్యాశాఖ మంత్రి రాజీనామా కోరుతూ చేపట్టిన ప్రత్యక్ష నిరసనలకు లభించని ప్రచారం, ఒక వర్చువల్ పార్టీకి లభించడం వెనుక ఉన్న వ్యత్యాసాన్ని కూడా గమనించాలి. రాజకీయ పోరాటం అంటే కేవలం డిజిటల్ తెరలపై రీల్స్, రాప్ సాంగ్స్ సృష్టించడం మాత్రమే కాదు, డిజిటల్ ప్రచా రం ఎంత ప్రభావవంతమైనదైనా, ప్రజల సమస్యలపై క్షేత్రస్థాయిలో జరిగే ఉద్యమాలకు అది పూర్తిస్థాయి ప్రత్యామ్నాయం కాదని కొందరు పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు.

### సంకేతాలను అర్థం చేసుకోవడమే ప్రజాస్వామ్య బలం!

సోషల్ మీడియా ఖాతాలను నిలిపివేయడం, ట్రెండ్లను నియంత్రించడం లేదా వ్యంగ్యాన్ని నిర్లక్ష్యం చేయడం ద్వారా అసలు సమస్యలు మాయమవ్వవు. సాంకేతికత ఎంతగా ఎదిగినా, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మానవ శ్రమను భర్తీ చేస్తున్నా, ప్రజాస్వామ్య స్ఫూర్తిని మాత్రం ఏ శక్తీ భర్తీ చేయలేదు. కొంతమంది విశ్లేషకుల అభిప్రాయం ప్రకారం, ప్రజల ఆందోళనల కు సరైన స్పందన లభించకపోతే కొత్త నిరసన రూపా లు ఉద్భవించే అవకాశం ఉంటుంది. యువత ఉపాధి అవకాశాలు, విద్యా వ్యవస్థపై నమ్మకం, పాలనా వ్యవస్థల పారదర్శకత, ప్రజా సేవల నాణ్యత వంటి అంశాలపై గంభీరమైన చర్చ జరగాలి. స్క్రీన్‌పై కాక్రోచ్ అనేది కేవలం ఒక వైరల్ చిహ్నం మాత్రమే కావచ్చు, కానీ సిస్టమ్‌లో కలకలం అనేది సమాజం తన భావాలను వ్యక్తపరచడానికి కొత్త మార్గాలను వెతుక్కుంటోందనే సూచన. ఆరోగ్యకరమైన ప్రజాస్వామ్యంలో ఈ సంకేతాలను అణచివేయడం కాదు; అర్థం చేసుకోవడం, చర్చించడం, పరిష్కార మార్గాలను అన్వేషించడమే నిజమైన బలమైన పాలనకు సూచిక. అంతిమంగా, ప్రజల ప్రశ్నలను వినగల సామర్థ్యం ఉన్న వ్యవస్థలే కాలపరీక్షను తట్టుకుని నిలుస్తాయి; ప్రజాస్వామ్య పౌరస్ఫూర్తియే వాటికి నిజమైన బలం.



## భూదాన్ భూముల్లో పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

తెలంగాణ సర్వోదయ మండలి డిమాండ్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** హైదరాబాద్ నగరంలో దశాబ్దాలుగా కూలీనాలి చేసుకుంటూ, సొంత ఇల్లు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్న నిరుపేదలకు భూదాన్ భూముల్లో ఇళ్ల స్థలాలు కేటాయించాలని తెలంగాణ రాష్ట్ర సర్వోదయ మండలి రాష్ట్ర అధ్యక్షులు ఆర్.శంకర్ నాయక్ డిమాండ్ చేశారు. రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని శుక్రవారం సచివాలయంలోని ఆయన కార్యాలయంలో సర్వోదయ మండలి ప్రతినిధుల బృందం కలిసి వినతిపత్రం సమర్పించారు. బాలాపూర్ పరిధిలోని సర్వే నెంబర్ 88, 89లో గల 32 ఎకరాల భూదాన్ భూముల్లో 893 మంది పేద ప్రజలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరుతూ అర్హులైన లబ్ధిదారుల జాబితాను మంత్రికి అందజేశారు.

**కబ్జాల బారిన పడకుండా రక్షించాలి : శంకర్ నాయక్**

ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు ఆర్. శంకర్ నాయక్ మాట్లాడుతూ మహాత్మా గాంధీజీ, ఆచార్య వినోబాభావే ఆశయాల సాధన కోసం సర్వోదయ మండలి నిరంతరం పనిచేస్తోందని తెలిపారు. రాష్ట్రంలో ఇప్పటికే లక్షల కోట్ల రూపాయల విలువైన భూదాన్ భూములు అక్రమార్కుల చేతుల్లోకి వెళ్లినా పట్టించుకునే వారు కరువయ్యారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. విలువైన భూదాన్ భూములు అన్యాక్రాంతం కాకుండా, కబ్జాలకు గురికాకుండా ప్రభుత్వపరంగా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. మంత్రిని కలిసిన వారిలో తెలంగాణ రాష్ట్ర సర్వోదయ మండలి ప్రధాన కార్యదర్శి వై.గిరిప్రసాద్, యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహేష్ కుమార్, జి.శ్యామ్ తదితరులు ఉన్నారు.

# అదనపు ఆదాయ వనరుల పెంపుపై దృష్టి

లీకేజీలను అరికట్టి, బడ్జెట్ లక్ష్యాలను అందుకోవాలి
ఆదాయ వనరుల సమీకరణ మంత్రివర్గ ఉపసంఘం సమావేశంలో డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర ఆర్థిక పురోగతి పరుగులు పెట్టించేందుకు, ఈ ఆర్థిక సంవత్సరం బడ్జెట్ అవసరాలకు అనుగుణంగా అదనపు ఆదాయ వనరులను సమకూర్చుకోవడంపై అన్ని శాఖల అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆదేశించారు. డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ సచివాలయంలో శుక్రవారం డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క మల్లు అధ్యక్షతన 'ఆదాయ వనరుల సమీకరణ మంత్రివర్గ ఉపసంఘం' (రిసోర్స్ మొబిలైజేషన్ క్యాబినెట్ సబ్ కమిటీ) ఉన్నత స్థాయి సమావేశం జరిగింది. సమావేశానికి ఉపసంఘం సభ్యులు, రాష్ట్ర మంత్రులు ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో అదనపు ఆదాయ మార్గాల అన్వేషణ, వివిధ శాఖల ప్రగతిపై మంత్రుల బృందం అధికారులతో కలిసి సమీక్షించింది. డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ 2026–27 ఆర్థిక సంవత్సరానికి ప్రతిపాదించిన బడ్జెట్ అంచనాలకు అనుగుణంగా నిధుల సమీకరణ జరగాలని స్పష్టం చేశారు. బడ్జెట్ లక్ష్యాలను చేరుకోవడానికి అధికారులు లీకేజీలను పూర్తిగా అరికట్టాలని, అందుబాటులో ఉన్న అన్ని రకాల ఆదాయ వనరులను పూర్తి స్థాయిలో అందిపుచ్చుకోవాలని ఆదేశించారు. ముందస్తుగా నిర్ధేశించుకున్న టైమ్ లైన్ (క్యాలెండర్) ప్రకారమే అన్ని శాఖల అధికారులు ఆదాయాన్ని పెంపొందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.

**ఖజానాకు గండి కొడుతున్న అక్రమార్కులపై కఠినంగా వ్యవహరించాలి**

రాష్ట్ర ఖజానాకు గండి కొడుతున్న అక్రమార్కులపై కఠినంగా వ్యవహరించాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. రాష్ట్ర క్యాబినెట్ గతంలో ఇచ్చిన ఆదేశాల మేరకు మే 28 నుంచి రాష్ట్రవ్యాప్తంగా సవరించిన (పెంచిన) భూముల మార్కెట్ విలువలు (రిజిస్ట్రేషన్ ధరలు) అమలులోకి రానున్నాయని అధికారులు ఈ సమావేశంలో మంత్రుల బృందానికి వివరించారు. దీని ద్వారా రిజిస్ట్రేషన్ల శాఖ ఆదాయం గణనీయంగా పెరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. అలాగే పర్యాటక శాఖకు సంబంధించిన 'హిల్ట్ పాలసీ గైడ్‌లైన్స్' సిద్ధమయ్యాయని, వీటికి సంబంధించిన ఉత్తర్వులు త్వరలోనే వెలువడనున్నాయని అధికారులు వెల్లడించారు. సమీక్షా సమావేశంలో మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్, హెచ్ఎండిఏ, పరిశ్రమలు, రిజిస్ట్రేషన్లు, మైనింగ్, రెవెన్యూ, రవాణా తదితర కీలక శాఖలలో ప్రస్తుత వనరుల పురోగతి, రానున్న రోజుల్లో సాధించాల్సిన ఆదాయ లక్ష్యాలపై మంత్రుల బృందం అధికారులకు దిశా నిర్దేశం చేసింది. సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, రోడ్లు, భవనాల స్పెషల్ చీఫ్ సెక్రెటరీ వికాస్ రాజ్, ఫైనాన్స్ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా, మైన్స్ ప్రిన్సిపల్ సెక్రెటరీ శ్రీధర్, రెవెన్యూ సెక్రటరీ లోకేష్ కుమార్, టిజిఐఐసి వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ శశాంక్ తదితరులు పాల్గొన్నారు.

## నిమ్స్‌లో కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్‌లో అరుదైన రికార్డ్

వైద్య బృందానికి సిఎం రేవంత్‌రెడ్డి అభినందనలు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్‌లో అరుదైన మైలురాయిని అందుకున్న నిమ్స్ వైద్య బృందానికి ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అభినందనలు తెలిపారు. హైదరాబాద్‌లోని నిజాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (నిమ్స్) కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్‌లో దేశంలోనే అరుదైన రికార్డు నమోదు చేసింది. నిమ్స్ యూరాలజీ విభాగం ఇప్పటివరకు 2,000 కిడ్నీ మార్పిడులు పూర్తి చేసింది. కిడ్నీ మార్పిడులలో దక్షిణ భారతదేశంలో నిమ్స్ నెంబర్ వన్‌గా నిలిచింది. దేశంలో కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్‌లో గుజరాత్‌లోని ఐకెడిఆర్‌సి మొదటి స్థానంలో ఉంది. రెండవ స్థానంలో లూథియానా క్రిస్టియన్ కాలేజీ ఉండగా, నిమ్స్ మూడో స్థానంలో ఉంది. ఈ అరుదైన మైలురాయిని సాధించి కిడ్నీ బాధితులకు విశేష సేవలు అందించిన నిమ్స్ వైద్య బృందానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందనలు తెలిపారు. ఈ 2,000 మందిలో 1,900 మంది అంటే 95 శాతం మంది రాజీవ్ ఆరోగ్యశ్రీ, ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఉచితంగా కిడ్నీ మార్పిడి చేయించుకోవటం విశేషం. 2023 జనవరి నుంచి గడిచిన మూడేళ్ల నాలుగు నెలల్లోనే 500 కిడ్నీ మార్పిడులు చేసి రికార్డు నెలకొల్పింది.

## నేడు రోజ్‌గార్ మేళా

51 వేలకుపైగా యువతకు నియామక పత్రాలు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న ఉపాధి కల్పన కార్యక్రమాల్లో భాగంగా నిర్వహిస్తున్న 19వ రోజ్‌గార్ మేళా ద్వారా దేశవ్యాప్తంగా కొత్తగా ఎంపికైన 51 వేలకుపైగా యువతకు నియామక పత్రాలు అందజేయనున్నారు. శనివారం ఉదయం 11 గంటలకు ప్రధాని నరేంద్రమోదీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నియామక పత్రాలను పంపిణీ చేసి అభ్యర్థులను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. ఉపాధి కల్పనకు ప్రాధాన్యత ఇస్తామన్న కేంద్ర ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా రోజ్‌గార్ మేళా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వం తెలిపింది. ఇప్పటివరకు దేశవ్యాప్తంగా నిర్వహించిన 18 రోజ్‌గార్ మేళాల ద్వారా సుమారు 12 లక్షల మందికి నియామక పత్రాలు అందించినట్లు వెల్లడించింది. దేశంలోని 47 ప్రాంతాల్లో ఒకేసారి నిర్వహించనున్న 19వ రోజ్‌గార్ మేళాలో వివిధ ప్రాంతాల నుంచి ఎంపికైన అభ్యర్థులు పాల్గొననున్నారు. వీరికి కేంద్ర ప్రభుత్వంలోని పలు శాఖలు, విభాగాల్లో ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. నియామకాలు పొందనున్న అభ్యర్థుల్లో రైల్వే శాఖ, హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ, ఆరోగ్య & కుటుంబ సంక్షేమ శాఖ, ఆర్థిక సేవల విభాగం, ఉన్నత విద్యా శాఖ తదితర విభాగాలకు ఎంపికైన యువత ఉన్నారు. యువతకు మరిన్ని ఉపాధి అవకాశాలు కల్పించడం, ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ ప్రక్రియను వేగవంతం చేయడం రోజ్‌గార్ మేళా ప్రధాన లక్ష్యమని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది.

## డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్‌లో తెలంగాణ రోల్ మోడల్




మంత్రి శ్రీధర్ బాబు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ రంగంలో తెలంగాణను దేశంలోని ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిపే దిశగా రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతోందని ఐటి శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. ప్రభుత్వ పౌర సేవలను మరింత సమర్థవంతంగా, పారదర్శకంగా ప్రజలకు చేరువ చేసే లక్ష్యంతో సమగ్ర రోడ్‌మ్యాప్‌ను రూపొందిస్తున్నామని వెల్లడించారు. ది ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఛార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా(ఐసిఎఐ) ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో శుక్రవారం నిర్వహించిన 'డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ ఫైనాన్స్ సమ్మిట్ 2026'లో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ వేగంగా డిజిటల్ దిశగా మారుతోందని, ఈ మార్పులను అందిపుచ్చుకునే దేశాలే భవిష్యత్తులో ముందంజలో ఉంటాయని అన్నారు. ప్రపంచంలో అతిపెద్ద డిజిటల్ ఆర్థిక వ్యవస్థల్లో భారత్ ఒకటిగా ఎదిగిందని, డిజిటల్ చెల్లింపులు నుంచి డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వరకు దేశం సాధిస్తున్న పురోగతిని ప్రపంచం గమనిస్తోందని పేర్కొన్నారు. ఈ డిజిటల్ పరివర్తనలో తెలంగాణ కీలక పాత్ర పోషిస్తూ దేశ ఆర్థికాభివృద్ధికి గ్రోత్ ఇంజిన్‌గా మారుతోందన్నారు. భావితరాల అవసరాలకు అనుగుణంగా నెక్స్ట్ జనరేషన్ ఇన్నోవేషన్స్, టాలెంట్, ఆర్థిక వృద్ధిని అనుసంధానించే బలమైన ఎకోసిస్టంను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. 2047 నాటికి దేశ జిడిపిలో తెలంగాణ వాటాను 10 శాతానికి చేర్చే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని చెప్పారు. ఈ నేపథ్యంలో సీఏలు కేవలం ఫైనాన్షియల్ ఆడిటింగ్‌కే పరిమితం కాకుండా 'సైబర్ అష్యూరెన్స్' పైనా దృష్టి పెట్టాలని సూచించారు. స్కిల్లింగ్, అప్ స్కిల్లింగ్, రీస్కిల్లింగ్ అంశాల్లో రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వివిధ కేంద్ర సంస్థలు, నియంత్రణ సంస్థలు, సైబర్ భద్రతా రంగానికి చెందిన ప్రముఖులు పాల్గొన్నారు.

## నాగేశ్వర్‌పై కేసు ఉపసంహరించుకోవాలి

సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివ రావు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాజకీయ, సామాజిక, ఆర్థిక ప్రముఖ విశ్లేషకులు ప్రొఫెసర్ నాగేశ్వర్‌పై ఆంధ్రప్రదేశ్‌లో కేసులు పెట్టడాన్ని సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివ రావు ఖండించారు. ప్రొఫెసర్ నాగేశ్వర్‌పైన రాజకీయ పార్టీల కార్యకర్తలు పెట్టిన కేసులను తక్షణమే ఉపసంహరించుకునేలా చూడాలని ఆయా రాజకీయ పార్టీలకు కూనంనేని విజ్ఞప్తి చేశారు. దశాబ్దాలుగా సామాజిక, ఆర్థిక, రాజకీయ అంశాలను విశ్లేషిస్తూ ప్రజలను చైతన్య పరుస్తున్న నాగేశ్వర్‌ను ప్రజామేధావిగా చూడాలి తప్ప, రాజకీయాలతో ముడి పెట్టకూడదని కూనంనేని సాంబశివ రావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇటీవల ప్రొఫెసర్ నాగేశ్వర్ చేసిన వ్యాఖ్యలను కొన్ని రాజకీయ పక్షాలు తప్పుగా అన్వయించుకున్న నేపథ్యంలో ఆయన తన వ్యాఖ్యలను ఉపసంహరించుకుంటున్నానని స్వయంగా చెప్పినప్పటికీ, నాగేశ్వర్‌పై కేసులు పెట్టడం సమంజసం కాదన్నారు. వ్యక్తుల వ్యాఖ్యల్లో నొప్పించే అంశాలు ఉంటే ప్రజాస్వామ్య పద్ధతిలో వివిధ వేదికల ద్వారా నేరుగా ప్రస్తావించాలని, వారిపై కానీ కేసులు పెట్టి, చట్టాలను బూచిగా చూపడం సమాజానికి మేలు చేయబోదని కూనంనేని అభిప్రాయపడ్డారు.

**కేసు నమోదు సరైంది కాదు : కె.రామకృష్ణ**



రాజకీయ విశ్లేషకుడు, మాజీ ఎంఎల్‌సి ప్రొఫెసర్ నాగేశ్వర్ పై కేసు నమోదు చేయడం సరైంది కాదని సిపిఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. నాగేశ్వర్ తనకు ఉన్న సమాచారం ఆధారంగా మాట్లాడితే, దానిని ఖండించాలని, కానీ, వ్యక్తిగతంగా తీసుకుని కేసులు పెట్టడం మంచిది కాదని రామకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రొఫెసర్ నాగేశ్వర్ అమ్ముడుపోయే వ్యక్తి కాదన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని ఎన్‌డిఎ కూటమిలో ఉన్న టిడిపి, జనసేనతో పాటు వైసిపి కూడా కేంద్రంలోని మోదీ ప్రభుత్వానికి అండగా నిలబడ్డాయన్నారు. మోదీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రతి బిల్లుకూ, ఈ మూడు ప్రాంతీయ పార్టీ ఏకోన్ముఖంగా మద్దతునిచ్చాయని తెలిపారు.

**అరెస్ట్ చేస్తే సిఎం అభ్యర్థిగా బయటికి వస్తారు.. కె.నారాయణ**



రాజకీయ విశ్లేషకులు, మాజీ ఎంఎల్‌సి ప్రొఫెసర్ నాగేశ్వర్‌ను అరెస్ట్ చేస్తే ఆయన ముఖ్యమంత్రి అభ్యర్థిగా బయటికి వస్తారని, కాక్రోచ్ ఉద్యమం పెరిగి, కాక్రోచ్‌లన్నీ బయటికి వస్తాయని సిపిఐ జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ డాక్టర్ కె.నారాయణ అన్నారు. నాగేశ్వర్‌పైన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా కేసు పెట్టాలని జనసేన పార్టీ చెప్పినట్టుగా తెలుస్తుందని, మరోసారి ఇలాగే చేస్తే కేసులు పెడుతామనే తరహా బ్లాక్ మెయిలింగ్‌కు ప్రయత్నించడం మంచిది కాదని ఆయన శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సోషల్‌మీడియాలో ఎవరి వాదనలు వారికి ఉంటాయని, అవసరమైతే వివరణ ఇచ్చుకోవాలని, కానీ వాటిని చిలవలు, పలువలు చేసి, వ్యతిరేక వాదనలను ఆపేందుకు ప్రయత్నిస్తూ, ప్రశ్నించే గొంతు నొక్కడాన్ని మానుకోవాలని నారాయణ సూచించారు. కానీ ఇలా బ్లాక్ మెయిలింగ్‌కు పాల్పడడం మంచిది కాదని ఆయన పేర్కొన్నారు.

## జాతీయస్థాయిలో తెలంగాణ పోలీసుల సత్తా

విజేతలను అభినందించిన డిజిపి సివి ఆనంద్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఉత్తరప్రదేశ్‌లోని లక్నోలో ఈ నెల 9 నుంచి 13 వరకు నిర్వహించిన '2వ ఆల్ ఇండియా పోలీస్ బ్యాడ్మింటన్, టెన్నిస్ క్లస్టర్ ఛాంపియన్‌షిప్ 2025–26'లో తెలంగాణ పోలీస్ క్రీడాకారులు విశేష ప్రతిభ కనబరిచారు. ఒక స్వర్ణం, నాలుగు రజతాలు, ఏడు కాంస్యాలతో కలిపి మొత్తం 12 పతకాలను సాధించి రాష్ట్రానికి కీర్తి తీసుకువచ్చారు. ఈ నేపథ్యంలో విజేతల బృందం శుక్రవారం డిజిపి సివి ఆనంద్‌ను ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా డిజిపి క్రీడాకారులను ప్రత్యేకంగా అభినందించి, శాలువాలతో ఘనంగా సత్కరించారు..ఈ కార్యక్రమంలో ఐజిపి డాక్టర్ గజరావు భూపాల్, డిసిపి జి.నరసింహారెడ్డి, పోలీస్ స్పోర్ట్స్ ఆఫీసర్ డాక్టర్ ఆర్.వి. రామారావు, టెన్నిస్ కోచ్ ఎ.అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## కొనుగోళ్లు 80 శాతం పూర్తయినట్టు నిరూపిస్తే ఏ శిక్షకైనా సిద్ధం: కెటిఆర్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలో పంట కొనుగోళ్లు 80 శాతం పూర్తయినట్టు నిరూపిస్తే తాను ఏ శిక్షకైనా సిద్ధమని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు సవాల్ విసిరారు. పంటల వారీగా పంట కొనుగోళ్లపైన లెక్కలతో కూడిన ఒక శ్వేతపత్రం విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కెటిఆర్ మాట్లాడుతూ రాష్ట్రంలో పంట కొనుగోళ్ళ సంక్షోభం తీవ్రంగా ఉన్నప్పటికీ సిఎం రేవంత్ రెడ్డి, మంత్రులు అవాస్తవాలు చెబుతున్నారని మండిపడ్డారు. పంట కొనుగోళ్లపైన సిఎం, మంత్రి అబద్ధాలు చెబుతూ అటెన్షన్ డైవర్షన్ ముచ్చట్లు చెబుతున్నారని ఆరోపించారు. మంత్రివర్గ సమావేశంలోనైనా అత్యంత కీలకమైన పంట కొనుగోళ్ళ సంక్షోభంపైన చర్చించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా రైతులు స్వచ్ఛందంగా రోడ్లెక్కి ఆందోళనలు చేస్తున్నారని, ఆరుగాలం పండించి తీసుకొచ్చిన పంటను కొనుగోలు కేంద్రాలకి తరలిస్తే, నీసం వాటిని కాంటా కూడా పెట్టడం లేదని కెటిఆర్ తెలిపారు. ముఖ్యమంత్రి సొంత నియోజకవర్గమైన కొడంగల్ నియోజకవర్గంలో కూడా రైతులు నిరసన వ్యక్తం చేశారన్నారు. క్షేత్రస్థాయిలో కనీసం 30 శాతం పంట కొనుగోళ్ళు కూడా పూర్తి కాలేదన్నారు. ఇప్పటికైనా తగిన చర్యలు తీసుకోకుంటే కాంగ్రెస్ ప్రభు త్వాన్ని ఎక్కడికక్కడ నిలదీస్తామని కెటిఆర్ హెచ్చరించారు.

## రైతులను పట్టించుకోని ప్రభుత్వం : కవిత



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో రైతులు ఇబ్బందులు పడుతున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని తెలంగాణ రక్షణ సేన (టిఆర్ఎస్) అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆరోపించారు. పంటల కొనుగోలు విషయంలో రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించాలని, లేదంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. టిఆర్ఎస్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని సచివాలయం వద్ద కల్వకుంట్ల కవిత శుక్రవారం ధర్నా నిర్వహించారు. వరికంకులు, ప్ల కార్డులతో రోడ్డుపై బైఠాయించారు. దీంతో కవితతో పాటు టిఆర్ఎస్ నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అంతకుముందు కవిత మాట్లాడుతూ రెండున్నరేళ్లుగా సిఎం రేవంత్ రెడ్డి వ్యవసాయ శాఖపై సమీక్ష చేయకపోవడం దారుణమన్నారు. ధాన్యం, మక్కలు, జొన్నలు, పొద్దు తిరుగుడు పంటలు కొనక పోవటంతో రైతులు ఆవేదనతో ఉన్నారన్నారు. తేమ శాతం ఎక్కువ ఉందంటూ ధాన్యం కొనుగోలుకు మిల్లర్లు కొర్రీలు పెడుతున్నారని, తరుగు పేరుతో మోసం చేస్తున్నప్పటికీ పట్టించుకునే వారే లేరన్నారు. 45 , 46 డిగ్రీల టెంపరేచర్‌లోనూ కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు పడిగాపులు కాస్తున్నారని, కొనుగోలు కేంద్రాల్లో కనీసం తాగేందుకు నీళ్ళు కూడా లేవని, టెంట్లను కూడా వేయలేదని కవిత ఆరోపించారు. రాష్ట్ర వ్యాప్తంగా రైతులు వరి కుప్పలపై చనిపోతుంటే ప్రభుత్వం ఏం చేస్తోందని కవిత ప్రశ్నించారు.

# తెలంగాణ పోలీసింగ్‌కు పునాది వేసిన శిక్షణాలయం

ఆర్‌బివిఆర్‌ఆర్ తెలంగాణ పోలీస్ అకాడమీ
40 ఏళ్ల ప్రస్థానం పూర్తి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** నేరాల స్వరూపం మారుతోంది, సాంకేతికత కొత్త సవాళ్లు విసురుతోంది, చట్ట అమలు వ్యవస్థ మరింత నైపుణ్యం కోరుతోంది. ఇలాంటి మారుతున్న కాలానికి తగిన పోలీసు బలగాలను తీర్చిదిద్దడంలో తెలంగాణకు వెన్నెముకగా నిలిచిన సంస్థ ఆర్‌బివిఆర్‌ఆర్ తెలంగాణ పోలీస్ అకాడమీ. నాలుగు దశాబ్దాల సేవా ప్రస్థానాన్ని పూర్తి చేసుకున్న ఈ అకాడమీ శుక్రవారం తన 40వ రైజింగ్ డే వేడుకలను జరుపుకుంది.

1986లో అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అంబర్‌పేట్‌లోని సిపిఎల్‌లో ఆంధ్రప్రదేశ్ పోలీస్ అకాడమీ (అప్పా)గా ఈ సంస్థ ఆవిర్భవించింది. పోలీసింగ్‌ను కేవలం ఉద్యోగంగా కాకుండా ప్రజా సేవగా మలచాలనే ఆలోచనతో దీనికి పునాది పడింది. అనంతరం పెరుగుతున్న అవసరాలకు అనుగుణంగా 1993లో ప్రస్తుతం ఉన్న హిమాయత్ సాగర్ పరిసర ప్రాంతంలోని విశాలమైన క్యాంపస్‌కు మార్చారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత 2015 ఫిబ్రవరిలో ఈ సంస్థకు రాజా బహదూర్ వెంకట రామారెడ్డి తెలంగాణ పోలీస్ అకాడమీగా పేరు మారింది. తెలంగాణ పోలీసింగ్‌కు ప్రత్యేక దిశానిర్దేశం చేసే శిక్షణా కేంద్రంగా కొత్త అధ్యాయం ప్రారంభమైంది. హైదరాబాద్ సంస్థాన చరిత్రలో ప్రజానుకూల పరిపాలనకు గుర్తుగా నిలిచిన ప్రముఖ పరిపాలనా అధికారి రాజా బహదూర్ వెంకట రామారెడ్డి పేరును అకాడమీకి పెట్టారు. సమాజానికి బాధ్యతాయుత సేవ అందించే పోలీసింగ్ భావనకు ప్రతీకగా ఈ పేరును ఎంచుకున్నారు.



**శిక్షణతో పాటు నాయకత్వ నిర్మాణం**

ఈ అకాడమీ కేవలం పోలీసు కానిస్టేబుళ్లు లేదా ఎస్ఐలకు మాత్రమే కాదు డిఎస్‌పిలు, గెజిటెడ్ అధికారులు, ఫోరెన్సిక్ నిపుణులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, ఇతర శాఖల అధికారులకు కూడా శిక్షణ అందిస్తోంది. చట్టాలు, దర్యాప్తు, ఫోరెన్సిక్ సైన్స్, ఆయుధ వినియోగం, సైబర్ నేరాల నియంత్రణ, మానవ హక్కులు, నాయకత్వ నైపుణ్యాలు వంటి విభాగాల్లో ప్రత్యేక కోర్సులు నిర్వహిస్తోంది. గత మూడు దశాబ్దాల్లో లక్షకు పైగా పోలీసు, ఇతర శాఖల సిబ్బంది ఇక్కడ శిక్షణ పొందినట్లు అకాడమీ రికార్డులు చెబుతున్నాయి. ఇటీవలి కాలంలో ఈ అకాడమీ కేవలం శిక్షణా కేంద్రంగానే కాకుండా, విధాన చర్చలు, పోలీస్ రిట్రీట్స్, మహిళా పోలీసు సదస్సులు, సాంకేతిక నవీకరణలకు వేదికగా నిలుస్తోంది. 2026లో నిర్వహించిన పోలీస్ ఆఫీసర్స్ రిట్రీట్‌లో భవిష్యత్ పోలీసింగ్‌పై చర్చలు జరగడం ఇందుకు ఉదాహరణ. నేరస్థులను వెంబడించే ముందు సమాజాన్ని అర్థం చేసుకునే పోలీసింగ్, అధికారం కంటే బాధ్యతకు ప్రాధాన్యం, చట్ట అమలుతో పాటు ప్రజల విశ్వాసాన్ని గెలుచుకోవడం, ఇదే ఆర్‌బివిఆర్‌ఆర్ తెలంగాణ పోలీస్ అకాడమీ నాలుగు దశాబ్దాల సందేశం.

# రెవెన్యూ శాఖలో బదిలీలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రభుత్వం రెవెన్యూ శాఖలో పలువురు అదనపు కలెక్టర్లు, స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్లు, డిప్యూటీ కలెక్టర్ల బదిలీ చేస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. వరంగల్ అదనపు కలెక్టర్ (రెవెన్యూ)గా పనిచేస్తున్న గట్టు సంధ్యారాణిని నిర్మల్ అదనపు కలెక్టర్ (రెవెన్యూ)గా బదిలీ చేయగా, నిర్మల్లో పనిచేస్తున్న ఎల్.కిశోర్ కుమార్ను వరంగల్‌కు నియమించారు. సిద్ధిపేటలో ఎస్‌డిసి (ఎల్‌ఏ)గా ఉన్న డి.నాగరాజమ్మను సిద్ధిపేట డిఆర్‌ఓగా, చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ కార్యాలయంలో డిప్యుటేషన్‌పై ఉన్న ఆర్.దశరథ్‌ను నల్లగొండ డిఆర్‌ఓగా నియమించారు. మెద్చల్ మల్కాజిగిరి జిల్లాలో ఎస్‌డిసి (ఎల్‌ఏ)గా ఉన్న మాలతి సముద్రాలను అదే జిల్లాకు డిఆర్‌ఓగా పోస్టింగ్ ఇచ్చారు. మైనార్టీ వెల్ఫేర్ శాఖలో డిప్యుటేష్ప పనిచేస్తున్న టిఎవి నాగలక్ష్మి ని మహబూబాబాద్ డిఆర్‌ఓగా నియమించారు. రవాణా శాఖలో డిప్యుటేషన్‌పై ఉన్న ఎం.వి.రవీంద్రనాథ్‌ను భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలోని ఎస్‌డిసి (ఎల్‌ఏ)గా బదిలీ చేశారు. మహబూబాబాద్ డిఆర్‌ఓగా పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్న జుబేదున్నీసా బేగంను తెలంగాణ రాష్ట్ర వక్ఫ్ ట్రైబ్యునల్‌లో మెంబర్ (రెవెన్యూ)గా డిప్యుటేషన్‌పై నియమించారు. హనుమకొండ ఆర్‌డిఓగా ఉన్న రాథోడ్ రమేష్‌ను నిర్మల్ డిఆర్‌ఓగా, ప్రోటోకాల్ విభాగంలో అదనపు డైరెక్టర్‌గా ఉన్న డి. ప్రేమ్‌రాజును సూర్యాపేట డిఆర్‌ఓగా బదిలీ చేశారు. అధికార భాషా సంఘంలో పనిచేస్తున్న అల్లం నిర్మలను మహబూబ్‌నగర్ డిఆర్‌ఓగా, మహిళా అభివృద్ధి శాఖలో ఉన్న కనకం స్వర్ణలతను హైదరాబాద్ డిఆర్‌ఓగా నియమించారు. టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌లో అసిస్టెంట్ జనరల్ మేనేజర్‌గా ఉన్న రామమూర్తిని ఖమ్మం డిఆర్‌ఓగా పోస్టింగ్ ఇచ్చారు. పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్న ఆర్.వి. రాధాబాయిని స్టేషన్ ఘన్‌పూర్ ఆర్‌డిఓగా బదిలీ చేశారు. మైనార్టీ వెల్ఫేర్ శాఖలో పనిచేస్తున్న మోహన్ సింగ్‌ను ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ ఆర్‌డిఓగా, ఎంసిహెచ్‌ఆర్‌డిలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా ఉన్న ఎన్. నిర్మలను హనుమకొండ ఆర్‌డిఓగా బదిలీ చేశారు. ఈ అధికారుల రిలీవింగ్, జాయినింగ్ తేదీలను ప్రభుత్వానికి తెలియజేయాలని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు.

## పుష్కరాలకు ప్యాకేజ్ టూర్లు షురూ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పవిత్రమైన సరస్వతి అంత్య పుష్కరాలను దర్శించేందుకు కాళేశ్వరానికి వెళ్లే భక్తుల సౌకర్యార్థం తెలంగాణ టూరిజం హైదరాబాద్ నుండి ప్రత్యేక ప్యాకేజ్ టూర్లను ప్రకటించింది. భక్తులకు ఆధ్యాత్మికంగా స్ఫూర్తిదాయకమైన, సురక్షితమైన, సౌకర్యవంతమైన యాత్ర అనుభవాన్ని అందించడమే ఈ ప్యాకేజీల ప్రధాన ఉద్దేశ్యం. తెలంగాణలో అత్యంత పవిత్రమైన పుణ్యక్షేత్రాలలో ఒకటైన కాళేశ్వరంలో సరస్వతి అంత్య పుష్కరాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుగుతున్నాయి. రాష్ట్రం నలుమూలలతో పాటు పొరుగు రాష్ట్రాల నుంచి కూడా వేలాదిమంది భక్తులు తరలివస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆధునిక రవాణా సౌకర్యాలు, ఆలయ దర్శన సహాయం మరియు పర్యాటక ప్రదేశాల సందర్శనతో కూడిన ప్రత్యేక పుణ్యయాత్ర ప్యాకేజీలను తెలంగాణ టూరిజం రూపొందించింది. ఈ ప్యాకేజీలో కాళేశ్వరంలో పవిత్ర పుష్కరిణి స్నానం, శ్రీ ముక్తేశ్వర స్వామి దేవాలయం దర్శనం, అలాగే యునెస్కో ప్రపంచ వారసత్వ కట్టడంగా గుర్తింపు పొందిన రామప్ప దేవాలయం సందర్శనను పొందుపరిచారు.ఆసక్తిగల భక్తులు టోల్‌ఫ్రీ నెంబర్ 18004254545కు, తెలంగాణ టూరీజం అధికారిక వెబ్‌సైట్ ను సంప్రదించవచ్చు.

**సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**
మియాపూర్ సర్కిల్-48, SLP జోన్.
టెండర్ నోటీస్ ('ఇ'-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా)
Nit No.05/EE/ CMC/ CIR-48/2026-27 తేదీ : 22.05.2026
రూ.1.80లక్షల అంచనా వ్యయంతో కూడిన (01) పనుల కొరకు No. 05/EE/ CMC/CIR-48/2026-27 (ఐటెం నెం.01) తేదీ 22.05.2026 ద్వారా 'ఇ' ప్రొక్యూర్‌మెంట్ పద్ధతిలో టెండర్లు ఆహ్వానించబడ్డాయి. బిడ్ల అమ్మకం 23.05.2026 ఉదయం 11.30గంటల నుండి 'ఇ' ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ వెబ్‌సైట్‌లో తెరిచి ఉంటుంది. బిడ్లను సమర్పించడానికి చివరి తేదీ 26.05.2026 ఉదయం 11గంటలు. బిడ్ల అమ్మకం సమర్పణ సమయానికి ఒక గంట ముందు ముగుస్తుంది. మరిన్ని వివరాలను https://tender.telangana.gov.inవెబ్‌సైట్‌లో చూడవచ్చు.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, మియాపూర్ సర్కిల్-48
DIPR R.O. No. : 2854-PP/CL/ADVT/2026-27, Date: 22-05-2026 SLP జోన్ : CMC.

**మునిసిపల్ కౌన్సిల్ కార్యాలయం : జడ్చర్ల మునిసిపాలిటీ**
మహబూబ్‌నగర్ జిల్లా. (TS)
'ఇ' ప్రొక్యూర్‌మెంట్ షార్ట్ టెండర్ నోటీస్
2026-2027 సంవత్సరానికి గాను జనరల్ ఫండ్ కింద రూ.3.00 లక్షల మొత్తానికి 'ఇ' ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫామ్‌పై 01 పని కోసం టెండర్ పిలువబడింది. బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ ప్రారంభతేదీ తేదీ 22.05.2026 మధ్యాహ్నం 12 : 30గంటలు, బిడ్ డౌన్‌లోడ్ ముగింపు తేదీ తేదీ 25.05.2026, మధ్యాహ్నం ఒంటిగంటకు. మరిన్ని వివరాల కోసం @ e-procurement market place i.e.https://tender.telangana.gov.in లో చూడవచ్చు. బిడ్లను ఆహ్వానించే కార్యాలయం కమిషనర్, జడ్చర్ల మునిసిపాలిటీ, తెలంగాణ రాష్ట్రం, ఫోన్: 7337351867.
సం/- కమిషనర్ జడ్చర్ల మునిసిపాలిటీ.
DIPR R.O. No. : 2866-PP/CL/ADVT/2026-27, Date: 22-05-2026

**పోచంపల్లి మునిసిపాలిటీ : యాదాద్రి భువనగిరి జిల్లా.**
E-mail : mc.pochampally2018@gmail.com
Lr.No : E1/25/MCP/2026-27, 'ఇ' ప్రొక్యూర్‌మెంట్ టెండర్ నోటీస్ తేదీ : 22.05.2026
పోచంపల్లి మునిసిపాలిటీలోని హిందూ స్మశాన వాటికలో జనరల్ ఫండ్ /15వ ఫైనాన్స్ కార్పొరేషన్ (FC) /ఇతర నిధుల కింద ప్రాథమిక సౌకర్యాలు కల్పించడం కోసం రిజిస్టర్డ్ కాంట్రాక్టర్ల నుండి ఈ కింద సంతకం చేసిన వారిచే 'ఇ' ప్రొక్యూర్‌మెంట్ ద్వారా టెండర్లు ఆహ్వానించబడ్డాయి.

| క్ర.సం. | పనిపేరు | మొత్తం (రూ.లక్షల్లో) | ఫండ్స్ |
|---|---|---|---|
| 1 | పోచంపల్లి మునిసిపాలిటీలోని హిందూ స్మశాన వాటికలో మౌలిక వసతులు కల్పించడం | 6.00 | జనరల్ ఫండ్ / 15వ FC/ ఇతర |

1) బిడ్ సమర్పణ ప్రారంభ తేదీ : 22.05.2026 సాయంత్రం 04 : 30
2) బిడ్ సమర్పణ ముగింపు తేదీ : 25.05.2026 సాయంత్రం 05 : 00
3) ధర బిడ్ ప్రారంభ తేదీ : 25.05.2026 సాయంత్రం 05 : 01
ఈ సైట్‌ను వెబ్‌లో యాక్సెస్ చేయవచ్చు. 22.05.2026. పని వివరాలను 'ఇ' ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ @ tender.telangana.gov.inలో చూడవచ్చు. మరిన్ని వివరాలకు మరియు వివరణల కోసం అన్ని పనిదినాలలో కార్యాలయ వేళల్లో పోచంపల్లి మునిసిపాలిటీ కమిషనర్ లేదా మునిసిపల్ ఇంజినీర్‌ను సంప్రదించవచ్చు.
కమిషనర్ : 7893557983, ఇంజినీర్ : 8897526426.
సం/- కమిషనర్ పోచంపల్లి మునిసిపాలిటీ.
DIPR R.O. No. : 2875-PP/CL/ADVT/2026-27, Date: 22-05-2026

## కోనరావుపేట గ్రామంలో ఈతవనం దగ్ధం



**ప్రజాపక్షం /మెట్‌పల్లి :** మెట్‌పల్లి మండలం కోనరావుపేట గ్రామంలో భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. గ్రామంలోని మాలిక్ సాహెబ్ గుట్ట వెనుక ఉన్న 5 ఎకరాల్లో, అలాగే కోనరావుపేట శివారులోని సిరికొండ తోవ సమీపంలో ఉన్న మరో 6 ఎకరాల ఈతవనంలో మంటలు చెలరేగి సుమారు 2000 ఈత చెట్లు కాలిబూడిదయ్యాయి.స్థానిక రైతులు పొలాల్లో కొయ్యలకు నిప్పంటించడం వల్ల ఈ ప్రమాదం సంభవించి ఉండొచ్చని గ్రామస్థులు తెలిపారు. ఈ ఘటనతో గీతాకార్మికులు తీవ్రంగా నష్టపోయారు. “రెక్కాడితే గానీ డొక్కాడని పరిస్థితిలో ఉన్న మాకు ఈ ప్రమాదం తీవ్ర దెబ్బ తగిలింది. ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలి” అని బాధిత గీతా కార్మికులు వేడుకుంటున్నారు.ఈ ఘటనపై సమాచారం అందుకున్న కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు జువ్వాడి కృష్ణారావు సంఘటన స్థలాన్ని సందర్శించి కాలిపోయిన ఈతవనాన్ని పరిశీలించారు. ప్రభుత్వం నుండి సహాయం అందేలా చూస్తానని హామీ ఇచ్చారు. గ్రామ సర్పంచ్ మారు గంగారెడ్డి, ఉపసర్పంచ్ జక్కని పరందాములు, మిట్టపెల్లి భూమేష్, ఎక్సైజ్ శాఖసిఐ, గ్రామ పట్వారీ గంగారాం తదితర ప్రజాప్రతినిధులు,రాజకీయ నాయకులు ఘటన స్థలాన్ని సందర్శించి నష్టాన్ని పరిశీలించారు.

## అకాల వర్షాలకు నష్టం వాటిల్లని పంట ఆయిల్ పామ్: శ్యామ్ ప్రసాద్



**ప్రజాపక్షం /జగిత్యాల రూరల్ :** జగిత్యాల రూరల్ మండలంలోని అంతర్గాం గ్రామంలోని 2022– 23 సంవత్సరంలో నాటిన ఆయిల్ పామ్ తోటలను శుక్రవారం జిల్లా ఉద్యాన పట్టు పరిశ్రమ అధికారి గడ్డం శ్యామ్ ప్రసాద్ సందర్శించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఇప్పటివరకు జిల్లాలో 52 మంది రైతుల వద్ద నుండి 57 మెట్రిక్ టన్నుల ఆయిల్ పామ్ గెలలను కొనుగోలు చేయడం జరిగిందని అలాగే రూ.13.33 లక్షలు రైతుల ఖాతాలో జమ చేయడం జరిగిందని వారు తెలిపారు. 3 సంవత్సరాల పైబడిన తోటలలో వేసవిలో మొక్కలను నీటి ఎద్దడికి గురి చేయకుండా డ్రిప్ ద్వారా రోజుకు మొక్కకు 250,300 లీటర్ల నీటిని అందించాలని 3 నెలలకొకసారి ఎరువులను అందించాలని జిల్లా ఉద్యాన పట్టు పరిశ్రమ అధికారి రైతులకు సూచించారు. రైతులు వరికి ప్రత్యామ్నాయంగా ఆయిల్ పామ్ పంటను సాగు చేయాలని, కోతుల బెడద ఉండదు, అకాల వర్షాలకు నష్టం వాటిల్లని పంట ఆయిల్ పామ్ అని ప్రస్తుతం టన్ను గెలల ధర రూ.23,501/ గా ఉందని మొక్కలు, డ్రిప్ సదుపాయంపై సబ్సిడీ కలదు. ఎకరానికి సంవత్సరానికి రూ. 4200/ చొప్పున 4 సంవత్సరాల వరకు నిర్వహణ ఖర్చులు చెల్లించబడునని 1993 ఆయిల్ పామ్ చట్టం ప్రకారం గెలల కొనుగోలు చేపట్టబడునని రైతులు పక్వ దశకు వచ్చిన నారింజ రంగు గెలలనే కోయవలెను అని జిల్లా ఉద్యాన పట్టు పరిశ్రమ అధికారి గడ్డం శ్యామ్ ప్రసాద్ రైతులకు సూచించారు.ఈ కార్యక్రమంలో ఉద్యాన విస్తరణ అధికారి అన్వేష్, అనిల్, రైతులు,తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పనిని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి: ఎంపిడిఒ

**ప్రజాపక్షం/బెజ్జంకి:**ఉపాధి హామీ పనులను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడిఒ ప్రవీణ్ అన్నారు.శుక్రవారం మండల పరిధిలోని గూడెం గ్రామాన్ని సందర్శించగా స్థానిక సర్పంచ్ గూడెల్లి శ్రీకాంత్ వారిని శాలువాతో సన్మానించారు.ఈ సంధర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధి హామీ పనికి కూలీలు ఎక్కువ సంఖ్యలో హాజరయ్యే విధంగా గ్రామంలో అవగాహన కల్పించాని అన్నారు.ఎండ తీవ్రత ఉన్నందున కూలీలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.అనంతరం సర్పంచ్‌తో కలిసి కూలీలకు మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ఎంపిఒ రాములు,కార్యదర్శి యాదగిరి,గ్రామస్తులు పాల్గొన్నారు.

## ‘విజిట్ టు ది మ్యూజియం’ బస్సు ప్రారంభం




**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 డేస్ యాక్షన్ ప్లాన్ లో భాగంగా ఈ నెల 23 వ తేదీ వరకు యువజన, క్రీడ, టూరిజం వారోత్సవాలు కొనసాగుతున్నాయి . ఇందులో భాగంగా విజిట్ టు ద మ్యూజియం ఎట్ కరీంనగర్ లో బాగంగా రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని గీతానగర్ ఉన్నత పాఠశాల విద్యార్థులు తరలి వెళ్లే ఆర్టిసి బస్‌ను జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ జెండా ఊపి ప్రారంభించారు. జిల్లా విద్యాధికారి, జగన్ మోహన్ రెడ్డి, డీఆర్డీఓ లక్ష్మీ నారాయణ, జిల్లా యువజన, క్రీడల శాఖా అధికారి ఎ.రాందాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా భాగ్యరెడ్డి వర్మ జయంతి వేడుకలు



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** శ్రీ భాగ్యరెడ్డి వర్మ జయంతి వేడుకలను జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో శుక్రవారం వేడుకలు నిర్వహించారు. ఎస్సీ సంక్షేమ శాఖ ఆద్వర్యంలో శ్రీ భాగ్యరెడ్డి వర్మ జయంతి వేడుకలను నిర్వహించగా, ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరై ముందుగా జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా భాగ్యరెడ్డి వర్మ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి రవీందర్ రెడ్డి,సౌజన్య, జిల్లా అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సర్కారుకు అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు

### రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్






**ప్రజాపక్షం/జగిత్యాల:** అభివృద్ధి సంక్షేమం రెండు కళ్ళుగా ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతుందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక జగిత్యాల జిల్లా సమావేశం జిల్లా కేంద్రంలోని సుమంగళి గార్డెన్స్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ హాజరయ్యారు. ప్రజా సమస్యలే పరిష్కారంగా రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని మంత్రి అడ్లూరి అన్నారు. 99 రోజులపాటు పది అంశాలపై ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక గ్రామ, మండల, నియోజకవర్గ , జిల్లా స్థాయి సమీక్ష సమావేశాలు నిర్వహించినట్లు మంత్రి తెలిపారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలు నివేదికలను తయారుచేసి దశలవారీగా ప్రజల సమస్యలు పరిష్కరిస్తామని మంత్రి వివరించారు. ప్రభుత్వం ఎస్‌సి బిసిమైనారిటీవర్గాల విద్యకు ప్రాధాన్యమిస్తుందని ఇందులో భాగంగా ప్రతి నియోజకవర్గానికి యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణం చేయాలని నిర్ణయించినట్లు మంత్రి తెలిపారు. జగిత్యాల నియోజకవర్గానికి సంబంధించి యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూలుకు స్థలం కేటాయించామని మంత్రి తెలిపారు. జగిత్యాలలో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుపై నడుస్తున్న వివాదంపై మంత్రి స్పందించారు. కేంద్రీయ విద్యాలయానికి అవసరమైతే మరో మూడు ఎకరాల స్థలం కేటాయించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి తెలిపారు.జగిత్యాల జిల్లా కేంద్రంలో క్రీడా మైదానం ఏర్పాటుకు కృషి చేస్తున్నామని మంత్రి తెలిపారు. జిల్లాలో ఈ ఏడాది అధిక మొత్తంలో వరి, మొక్కజొన్న దిగుబడులు వచ్చాయని ఇప్పటి వరకు జగిత్యాల జిల్లాలో 35 వేల మెట్రిక్ టన్నుల మొక్కజొన్న కొనుగోలు చేశామని 2.60 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు మంత్రి వివరించారు. ప్రజా సంక్షేమ ధ్యేయంగా పనిచేస్తున్న ప్రజా ప్రభుత్వానికి ప్రజల మద్దతు ఈ సందర్భంగా మంత్రి కోరారు. ఈకార్యక్రమంలో జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ తో పాటు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సంగన భట్ల దినేష్, జగిత్యాల ధర్మపురి మున్సిపల్ చైర్మన్లు, వివిధ శాఖల ప్రభుత్వ అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.జగిత్యాల జిల్లాలో నిర్వహించిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో మంత్రి అడ్లూరి శుక్రవారం పాల్గొన్నారు.ఈ సందర్భంగా విలేకరులు అడిగిన ప్రశ్నకు సమాధానం ఇస్తూ కెటిఆర్ కుటుంబంలో కవిత ఒకవైపు, కుర్చీ లాక్కునే ప్రయత్నించడంతో కెటిఆర్ నిత్యం అసహనానికి గురవుతున్నారని మంత్రి అడ్లూరి అన్నారు. రాజ్యాంగ ప్రకారం ఎన్నికైన ముఖ్యమంత్రి ని ఏకవచనంతో మాట్లాడడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. బిఆర్‌ఎస్ పార్టీని రాష్ట్రంలో ప్రజలు విశ్వసించే పరిస్థితి లేదని ఆయన అన్నారు. మరో 20 ఏళ్లు రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంటుందని మం త్రి అడ్లూరి అన్నారు. ముఖ్యమంత్రిపై మాట్లాడితే గొప్ప వాడివి కావని మంత్రి అడ్లూరి అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత పెండింగ్ లో ఉన్న ఎస్‌సి, బిసి మైనారిటీల బిల్లులు రూ. వెయ్యి కోట్లు చెల్లించిందని మంత్రి తెలిపారు.

## గంజాయి మత్తు పదార్థాలు సేవించినా, విక్రయించినా కఠిన చర్యలు

### బస్టాండ్, రైస్ మిల్లులు, ఇటుక బట్టీలను డాగ్స్ స్క్వాడ్‌తో తనిఖీలు: సిఐ



**ప్రజాపక్షం/సుల్తానాబాద్ :** గంజాయి మత్తు పదార్థాలు సేవించిన, విక్రయించిన ఇతర సాంఘిక కార్యక్రమాలకు పూనుకున్న కఠిన చర్యలు తప్పవని సుల్తానాబాద్ సిఐ రంజిత్ రావు అన్నారు.శుక్రవారం సుల్తానాబాద్ పోలీసుల ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని బస్టాండ్, రైస్ మిల్లులు, ఇటుక బట్టీలలో తోపాటు రద్దీగా ఉండే ప్రదేశాలలో నార్కోటిక్ బృందం సుల్తానాబాద్ పోలీసులు సంయుక్తంగా యాంటీ నార్కోటిక్స్ డాగ్ స్కాడ్‌తో క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించారు. ప్రజలు రద్దీగా ఉండే ప్రాంతాలలో తనిఖీలు నిర్వహించిన అనంతరం సీఐ మాట్లాడుతూ గంజాయి , ఇతర మత్తు పదార్థాలు సేవించిన విక్రయించిన రవాణా చేపట్టిన తీవ్ర పరిణామాలు ఉంటాయని వాటిని ఎవరు సేవించవద్దని వాటికి దూరంగా ఉండాలని కాదని ఎవరైనా విక్రయించిన సేవించిన వివిధ పరీక్షల ద్వారా వారిని గుర్తించి కేసులు నమోదు చేస్తామని ఎట్టి పరిస్థితిలో ఎవరిని ఉపేక్షించేది లేదని పేర్కొన్నారు. రైస్ మిల్లు ఇటుక బట్టి యజమానులు పరిసర ప్రాంతాలను క్షుణ్ణంగా పరిశీలించాలని ఎవరైనా గంజాయి మొక్కలను పెంచితే ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని చట్టపరంగా కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.ప్రజలందరూ శాంతియుత వాతావరణానికి సహకరించాలని కోరారు.తనిఖీలలో ఎస్ఐ చంద్రకుమార్,అదనపు ఎస్సై అశోక్ రెడ్డి,నార్కోటిక్, డాగ్ స్క్వాడ్ బృందం తోపాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోళ్లు త్వరగా పూర్తి

### అదనపు కలెక్టర్ బి.ఎస్.లత



**ప్రజాపక్షం /పెగడపల్లి :** రైతుల నుండి సేకరించిన ధాన్యం కొనుగోలు ప్రక్రియను త్వరగా పూర్తి చేసి, కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెనువెంటనే మిల్లులకు తరలించాలని జగిత్యాల జిల్లా అదనపు కలెక్టర్ బి.ఎస్.లత అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆమె పెగడపల్లి మండల కేంద్రంతో పాటు మండలంలోని బతికెపల్లి,ఆరవెల్లి గ్రామాల్లోని ఐకెపి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా పరిశీలించారు.ఈ సందర్భంగా కేంద్రాలలో జరుగుతున్న తూకాలు, ధాన్యం కొనుగోలు ప్రక్రియను ఆమె ప్రత్యక్షంగా పరిశీలించారు.అనంతరం అదనపు కలెక్టర్ బి.ఎస్.లత మాట్లాడుతూ కేంద్రాలలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వేగంగా కొనుగోలు ప్రక్రియను కొనసాగించాలని సూచించారు.కొనుగోలు కేంద్రాలలో హమాలీలను తగిన సంఖ్యలో అందుబాటులో ఉంచాలని, ధాన్యం లోడింగ్ ప్రక్రియను వేగవంతం చేసి లారీలను ఆలస్యం లేకుండా రైస్ మిల్లులకు తరలించాలని స్పష్టం చేశారు. ట్రక్ షీట్ నమోదు, ట్యాబ్ ఎంట్రీలు వంటి పనులను సమయానికి పూర్తి చేయాలని, ఎలాంటి పెండింగ్ లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ధాన్యం కొనుగోలు సమయంలో తేమ శాతం, నాణ్యత ప్రమాణాలను ఖచ్చితంగా పరిశీలించాలని, రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఎటువంటి అవకతవకలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల అధికారి జితేందర్ రెడ్డి,పెగడపల్లి తహసీల్దార్ సయ్యద్ నిజామొద్దీన్,ఐకెపి ఎపిఎం ఎ. రవి వర్మ,రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాస్,జమున,సిసి తిరుపతి, జిపిఒఅజీముద్దీన్, కేంద్రాల నిర్వాహకులు,రైతులు, రెవె న్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## కార్పొరేట్ కళాశాలల్లో ప్రవేశానికి దరఖాస్తులు

**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :**పెద్దపల్లి జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ద్వారా కార్పొరేట్ కళాశాలల్లో ప్రవేశం పొందేందుకు అర్హులైన విద్యార్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి ఎం. రవీందర్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు.మార్చి 2026 లో జరిగిన 10వ తరగతి పరీక్షల్లో 7.0 జి.పి.ఏ, అంతకంటే ఎక్కువ మార్కులు సాధించిన గ్రామీణ ప్రాంతానికి చెందిన ఎస్.సి, ఎస్.టి, బి.సి, మైనారిటీ విద్యార్థిని, విద్యార్థులు దీనికి అర్హులని, విద్యార్థులు మే 22 నుండి జూన్ 05 లోపు www.telanganaepass.cgg.gov.in వెబ్ సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.ప్రభుత్వ, ప్రభుత్వ ఎయిడెడ్, ఆశ్రమ, ప్రభుత్వ వసతి గృహాలు, ప్రభుత్వ గురుకుల పాఠశాలలు, కే.జి.బి.వి పాఠశాలలు, నవోదయ,కేంద్రీయ విద్యాలయాల్లో చదివిన విద్యార్థులు మాత్రమే ఈ ప్రవేశానికి అర్హులు,విద్యార్థులు తప్పనిసరిగా గత ఐదు సంవత్సరాల స్టడీ సర్టిఫికేట్లను అప్‌లోడ్ చేయాల్సి ఉంటుందని, బెస్ట్ అవైలబుల్ స్కూల్ పథకం క్రింద చదివిన వారు, సీబీఎస్ఈ, కేంద్రీయ,నవోదయ విద్యాలయాల్లో చదివిన విద్యార్థులు తమ ఎస్.ఎస్.సి వివరాలను పెద్దపల్లి సమీకృత జిల్లా కలెక్టరేట్ కార్యాలయం మొదటి అంతస్తులో గల రూమ్ నెం. 232 లోని షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ కార్యాలయంలో సంప్రదించి, ఆ వివరాలను ఈపాస్ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని, దరఖాస్తుకు కావలసిన ధృవీకరణ పత్రాలు 10వ తరగతి ధృవీకరణ పత్రం.మీ సేవా ద్వారా పొందిన కుల ధృవీకరణ పత్రం.మీ సేవా ద్వారా పొందిన ఆదాయ ధృవీకరణ పత్రం,వసతి గృహ విద్యార్థి అయితే సంబంధిత సంక్షేమ అధికారి ధృవీకరణ పత్రం,ఆధార్ కార్డు.విద్యార్థి బ్యాంక్ పాస్ బుక్, ఫిజికల్లీ ఛాలెంజ్డ్ సర్టిఫికేట్ (వర్తించే వారికి మాత్రమే),ఇతర పూర్తి వివరాల కొరకు కార్యాలయ పని దినములలో పెద్దపల్లి కలెక్టరేట్ లోని మొదటి అంతస్తు, రూమ్ నెం. 232 లోని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి కార్యాలయాన్ని సంప్రదించవచ్చని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## అన్ని వర్గాలకు ప్రయోజనం చేకూర్చడమే లక్ష్యం

### వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** అన్ని వర్గాలకు ప్రయోజనం చేకూర్చడమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం సంక్షేమ, అభివృద్ధి పథకాలు అమలు చేస్తుందని ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు. ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా సిరిసిల్ల పట్టణ పరిధిలోని సాయి మణికంఠ ఫంక్షన్‌హాల్‌లో జిల్లాస్థాయి సభ జిల్లా అధికార యం త్రాంగం శుక్రవారం నిర్వహించగా, ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్‌పిమహేష్ బిగితె తదితరు లు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, వే ములవాడ శాసనసభ్యుడుఆది శ్రీనివాస్ మాట్లాడుతూ సిఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం ఇప్ప టి వరకు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రజలకు తెలియజేయడం, చైతన్యపర్చడం, భవిష్యత్ ప్రణాళికలు సిద్ధం చేసే కార్యక్రమాల్లో ప్రజలను భాగస్వామ్యులను చేసేందుకు ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక అమలు చేస్తున్నదని తెలిపారు.రాష్ట్రంలో 27 నెలలుగా ప్రజా పాలన సాగుతున్నదని, అన్ని వర్గాల ప్రజలకు సహాయం అందుతుందని తెలిపారు. అన్ని గ్రామాలు, మున్సిపాలిటీల్లో కార్యక్రమాలు నిర్వహించామని, అభివృద్ధి పనుల్లో ప్రజలను భాగస్వామ్యులు చేసేందుకు ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక ప్రభుత్వం అమలు చేస్తుందని తెలిపారు.త్వరలో అమలు చేయనున్న ఇందిరమ్మ భీమా పథకం దేశంలో, ప్రపంచంలో ఎక్కడా లేద ని చెప్పారు. సిరిసిల్ల మరమగ్గాల పరిశ్రమకు కోటి చీరల ఉత్పత్తి ఆర్డర్ ఇచ్చామని, గతంలో కూడా ఇచ్చామని దీంతో కార్మికులకు 6 నుంచి 7 నెలల పాటు ఉపాధి దొ రుకుతుందని వెల్లడించారు. వస్త్ర పరిశ్రమకు బకాయిలు చెల్లించామని గుర్తు చేశారు.వేములవాడ రాజన్న ఆల య విస్తరణ, అభివృద్ధి పనులు రూ.150 కోట్లతో కొనసాగుతున్నాయని,సిఎం రేవంత్ రెడ్డి, మంత్రులు శంకు స్థా పన చేశారని గుర్తు చేశారు. మరో వెయ్యి ఏండ్ల పాటు ఆలయం ఉండేలా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. ఇం దిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు ఊపు అందుకున్నాయని, దేశానికి రోల్ మోడల్ ఈ పథకమని పేర్కొన్నారు. జిల్లా అభివృద్ధి ఆగదని స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మార్చి 6వ తేదీన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని తెలిపారు. ఎస్‌పి మహేష్ బి గితే మాట్లాడుతూ ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కింద పోలీస్ శాఖ ఆద్వర్యంలో రోడ్డు భద్రత నియమాలు, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించామని తెలిపారు. దీంతో రోడ్డు ప్రమాదాలు చాలా వరకు తగ్గాయని వివరించారు.జిల్లా కేంద్రంలో డీ అడిక్షన్ కౌన్సెలింగ్ కేంద్రం ఏర్పాటు చేసి.. చికిత్స, కౌన్సెలింగ్ ఇస్తున్నారని వెల్లడించారు. జిల్లాలో గంజాయి నిర్మూలనకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. సైబర్ క్రైమ్ జరిగినప్పుడు వెంటనే పోలీస్‌లకు సమాచారం ఇవ్వాలని తె లిపారు. మున్సిపల్ చైర్మన్లు పుల్కం రాజు, జిందం కళ, వైస్ చైర్మన్లు నరాల శేఖర్, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, మార్కెట్ కమిటీ చైర్మన్లు స్వరూప, రాజు, సబేరా బేగం, విజయ, ఆత్మ వేములవాడ డివిజన్ చైర్మన్ ముకుంద రెడ్డి, ఆర్‌డిఒలు రాజేందర్ రెడ్డి, కెవెస్ బికుమారి, డిఎస్‌పినాగేంద్రచారిసిపిఒ శ్రీనివాసాచారి, ప్రజా ప్రతినిధులు,వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## డంపింగ్ యార్డ్‌తో ప్రజల ప్రాణాలకు హాని

### రౌండ్ టేబుల్ సమావేశంలో రాజకీయ పార్టీల నేతలు వెల్లడి




**ప్రజాపక్షం/కరీంనగర్:**కరీంనగర్ నగరంలోని డంపింగ్ యార్డుతో నగర ప్రజలకు ప్రాణహాని ఉందని, డంపింగ్ యార్డు శాశ్వత పరిష్కారం చూ పాలని దశల వారిగా ఐక్య ఉద్యమాలు నిర్వహిస్తామని సిపిఐ, సిపిఎం ,సిపిఐఎం.ఎల్.మాస్ లైన్,బిఆర్ఎస్,ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పా ర్టీల నాయకులు కసిరెడ్డి సురేందర్ రెడ్డి,గుడికందుల సత్యం,జంగిలి ఐలెందర్ యాదవ్, జిందం ప్రసాద్,కొక్కిరాల సత్యారావు వెల్లడించారు. కరీంనగర్ లోని బద్దం ఎల్లారెడ్డి భవన్ లో శుక్రవారం డంపింగ్ యార్డు సమస్యతో ప్రజలెదుర్కొంటున్న ఇబ్బందులు – శాశ్వత పరిష్కారం కోసం భవిష్యత్ కార్యాచరణ పై సిపిఐ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్ రెడ్డి అధ్యక్షతన రౌండ్ టేబ్ల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ బిజెపి పార్టీకి నగరంలో అధికారం అప్పగిస్తే నెల రోజుల్లో డం పింగ్ యార్డ్ సమస్య పరిష్కరిస్తామని బిజెపికి చెందిన కేంద్ర మంత్రులు ప్రగల్బాలు పలికి, సమస్యను గాలికి వదిలేసారని, నగరానికి చెందిన కేం ద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ హుజరాబాద్‌లో డంపింగ్ యార్డ్‌పై ఉద్యమం చేస్తున్నారు తప్ప కరీంనగర్‌లో ఎందుకు డంపింగ్ యార్డ్ తొలగించడం లేదో సమాధానం చెప్పాలన్నారు. కరీంనగర్‌కు చెందిన రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్, కేంద్ర మంత్రి బండి సంజయ్ ఇద్దరు కరీంనగ ర్‌కు చెందినవారు ఉన్నప్పటికీ ప్రజల ఆరోగ్య పరిస్థితులను పట్టించుకోవ డం లేదని ఆరోపించారు. రోజు డంపింగ్ యార్డ్ వద్ద రావణకాష్టంలా మండుతూ దట్టమైన పొగ,మంటలు వ్యాపిస్తున్న చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని అన్నారు. ఈ ప్రాంత ప్రజల ఆరోగ్యాల గురించి పట్టించుకోవడంలేదని, ప్రధానంగా కోతి రాంపూర్ అల్కాపురి, లక్ష్మీ నగర్, కట్టారాంపూర్, హనుమాన్ నగర్, గణేష్ నగర్, హౌసింగ్ బోర్డ్ కాలనీ ప్రాం తాలలో నివసిస్తున్న ప్రజలకు శ్వాసకోశ వ్యాధులు వస్తున్నాయని, వృద్ధు లు చిన్న పిల్లలు చాలా ఇబ్బందులకు గురవుతున్నారని, అస్తమా ఉన్న వా రి పరిస్థితి అత్యంత దారుణంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. డంప్ యా ర్డ్ తరలింపుకై దీర్ఘ కాలిక పరిష్కారం కోసం, ప్రజల ఆరోగ్యాలను కాపాడడం కోసం ఐక్యంగా ప్రజల భాగస్వామ్యంతో పోరాటాలు నిర్వహిస్తామని, త్వరలో డంపింగ్ యార్డ్ సమస్య పరిష్కారం కోసం కలిసి వచ్చే రాజకీయ పార్టీలు,ప్రజా సంఘాలు, స్వచ్ఛంద సంస్థలతో జాయింట్ యాక్షన్ కమిటీ ఏర్పాటు చేయనున్నట్లు సురేందర్ రెడ్డి, సత్యం,ఐలేందర్ యాదవ్,ప్రసాద్,సత్యారావులు తెలిపారు.ఈరౌండ్‌టేబుల్ సమావేశం లోసిపిఐ , సిపిఎం నగర కార్యదర్శులు కసిరెడ్డి సురేందర్ రెడ్డి,గుడికందుల సత్యం,బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు,మాజీ కార్పొరేటర్ జంగిలి ఐలేందర్ యాదవ్, సిపిఐ ఎం.ఎల్.మాస్ లైన్ జిల్లా నాయకులు జిందం ప్రసాద్,ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ నగర అధ్యక్షులు కొక్కిరాల సత్యారావు,సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు న్యాలపట్ల రాజు, సమ్మయ్య,కౌన్సిల్ సభ్యులు కటికరెడ్డి బుచ్చన్న యాదవ్,బీర్ల పద్మ, కొట్టె అంజలి,బూడిద సదాశివ,నాయకులు బాకం ఆంజనేయులు,నాయిని సురేష్ పాల్గొన్నారు.

## యూరియా సప్లయ్,ధాన్యం అన్‌లోడింగ్, పనులు వేగవంతం: కలెక్టర్



**ప్రజాపక్షం/పెద్దపల్లి:**పెద్దపల్లిలోని రైల్వే స్టేషన్ వద్ద ఏర్పాటు చేసిన రాక్ పాయింట్ నుంచి యూరియా సప్లై , స్థానిక వ్యవసాయ మార్కెట్ లోని ధాన్యం అన్‌లోడింగ్, పనులను వేగవంతం చేయాలనిజిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. శుక్రవారం పెద్దపల్లిలోని రైల్వే స్టేషన్ వద్దగల యూరియా రాక్ పాయింట్ ను,వ్యవసాయ మార్కెట్ ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో వ్యవసాయ అవసరాలకు తగ్గట్టుగా రాక్ పాయింట్ వద్ద ఉన్న యూరియాను లారీలు,హమాలీ కార్మికులను సమకూర్చుకొని త్వరగా జిల్లా వ్యాప్తంగా సప్లయి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అధికారులను ఆదేశించారు.పెద్దపల్లి మార్కెట్ యార్డుకు రైతులు తీసుకొస్తున్న ధాన్యం అన్‌లోడింగ్ పనులను ఎలాంటి ఆలస్యం లేకుండా వెంటనే చేపట్టాలని సూచించారు. లారీల కొరత రాకుండా చూసుకోవడంతో పాటు, పనులకు ఆటంకం కలగకుండా తగినంత మంది హమాలీ కార్మికులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించాలన్నారు.ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాస్,జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రవీణ్ రెడ్డి, సంబంధిత అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

## నష్టపోయిన రైతులను ఆదుకుంటాం

### పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణా రావు



**ప్రజాపక్షం/పెద్దపల్లి :** రైతుల పట్ల ప్రజా ప్రభుత్వం చిత్త శుద్ధితో ఉందని ప్రభుత్వ విప్, పెద్దపెల్లి ఎమ్మెల్యే చింత కుంట విజయ రమణారావు అన్నారు. శుక్రవారం రోజున పెద్దపల్లి మున్సిపల్ పరిధిలోని చందపల్లి గాంధీనగర్‌లో గురువారం రోజున ప్రమాదవశాత్తు ధాన్యం , కొంత పంట పొలం దగ్ధమైన సందర్భంగా నష్టపోయిన తోట రామకృష్ణ, తోట రాకేష్ రైతుల ధాన్యం కుప్పలను , ఘటన స్థలాన్ని పరిశీలించి తన వంతు బాధితులకు కొంత నగదు సహాయం అందించిన అనంతరంమాట్లాడుతూ పెద్దపల్లి మున్సిపల్ పరిధిలోని చందపల్లి గాంధీనగర్లో రైతు సోదరులైన తోట రాకేష్ కొంత ధాన్యం , రామకృష్ణ రైతుది కొంత పంట పొలం దగ్ధం అవడం బాధాకరం అని ఆ ఇద్దరి రైతులను ప్రభుత్వం ద్వారా ఆదుకుంటామని ధాన్యం కాలిపోయిన రైతు సోదరులు అధైర్య పడవద్దని నష్టపరిహారం సంబంధించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి నష్టపరిహారం అందించేలా కృషి చేస్తానని అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పట్ల చిత్తశుద్ధితో ఉందని ప్రతీ ధాన్యం గింజ కొనుగోలు చేసే బాధ్యత ప్రభుత్వం ,మేము తీసుకుంటున్నామని గుర్తు చేశారు. గాంధీనగర్ లో నష్టపోయిన రైతులకు అండగా నిలిచి వారికి తోడుగా ఉంటామని అన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నూగిళ్ల మల్లయ్య, స్థానిక కౌన్సిలర్లు ,ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు,రైతులు,తదితరులు పాల్గొన్నారు.

## దళిత వర్గాల అభ్యున్నతికి పాటుపడిన గొప్ప వ్యక్తి భాగ్యారెడ్డి వర్మ

కలెక్టర్ భవేశ్ మిశ్రా



**ప్రజాపక్షం / నిర్మల్ టౌన్ :** శుక్రవారం ఉదయం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో భాగ్యరెడ్డి వర్మ 138 వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.భాగంగా కలెక్టర్, పలువురు అధికారులతో కలిసి భాగ్యారెడ్డి వర్మ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు.సమాజంలోని అసమానతలను తొలగించేందుకు జీవితాంతం పాటుపడిన గొప్ప వ్యక్తి భాగ్యారెడ్డి వర్మ అని అన్నారు. దళిత బాలికల కోసం నాటి నిజాం కాలంలోనే 26వ దళిత బాలికల పాఠశాలలను స్థాపించారని గుర్తు చేశారు. కుల వివక్షత నిర్మూలన మూఢనమ్మకాలపై చైతన్యం, దేవదాసి వ్యవస్థ నిర్మూలన, మద్యపాన నిషేదం, బాలిక విద్యా అనేక విషయాల్లో ప్రజలను చైతన్యం చేశారని గుర్తు చేశారు. అది హిందూ సోషల్ లీగ్ సంస్థను ఏర్పరిచి జాతుల మధ్య అంతరాలు తొలగించారని తెలిపారు. భాగ్యారెడ్డి వర్మ ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. నేటి యువత భాగ్యారెడ్డి వర్మను మార్గదర్శకంగా తీసుకోవాలని సూచించారు. సమాజంలో విశిష్ట మార్పులకు కృషిచేసిన మహనీయుల జయంతి, వర్ధంతి వేడుకలు ప్రభుత్వాలు అధికారికంగా నిర్వహించడం గొప్ప విషయం అని చెప్పారు. ఇటువంటి కార్యక్రమాల ద్వారా గొప్ప వ్యక్తుల విశేషాలను నేటి తరాలకు అందించిన వారము అవుతామని తెలిపారు. ఈ జయంతి వేడుకల్లో జిల్లా ఎస్‌పి సంక్షేమ అధికారి దయానంద్, ఈడి, ఎస్‌పి కార్పొరేషన్ శంకర్, బిసి, ఎస్‌టి మైనారిటీ సంక్షేమ శాఖ అధికారులు శ్రీనివాస్, అంబాజీ, మోహన్‌సింగ్, సిపిఓ జీవరత్నం, ఉపాది కల్పన అధికారి విజయలక్ష్మి జిల్లా పౌర సంబంధాల అధికారి విష్ణువర్ధన్, ఇతర అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి జూపల్లి పర్యటన.. అభివృద్ధి పనులకు శంకుస్థాపన



**ప్రజాపక్షం / నిర్మల్ టౌన్ :** రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు , ఎక్సైజ్ శాఖామంత్రి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు మే 24న ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల్లో విస్తృతంగా పర్యటించనున్నారు. మంత్రి తన పర్యటనలో భాగంగా ముందుగా ఆదిలాబాద్ జిల్లా గుడిహత్నూర్ వద్ద నూతనంగా ఏర్పాటు చేయనున్న మోడల్ వెజిటబుల్ మార్కెట్ స్థలాన్ని పరిశీలిస్తారు. మావలలో రూ. 1.43 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించిన ప్రాథమిక ఆరో గ్య కేం ద్రాన్ని రూ. 47 లక్షల వ్యయంతో నిర్మించిన సెంట్రల్ లైబ్రరీ మొదటి అం తస్తు భ వనాన్ని ప్రారంభిస్తారు. అక్కడి నుండి గాయత్రీ పంక్షన్ హాలులో ఏ ర్పాటు చేసిన కార్యక్రమానికి చేరుకుని , జాబ్ మేళాలలో ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలను అందజేస్తారు. అదే వేదికపై దివ్యాంగులకు బ్యాటరీ, ట్రైసైకిళ్ళు, చక్రాల కుర్చీలు, మోటరైజ్డ్ వాహనాలను పంపిణీ చేయడంతో పాటు వరద నియంత్రణ మరియు విపత్తుల సమయంలో సహాయక చర్యల కోసం ఎన్డీర్ఎఫ్ బృందానికి అ వసరమైన పరికరాలను అందజేస్తారు. ఆ తర్వాత రూ. 2.90 కోట్ల అంచనా వ్య యంతో చేపట్టనున్న బేలాగూడ వంతెన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసి, బేలాలలో రూ. 2.30 కోట్ల వ్యయంతో నిర్మించిన కేజీబీవీ భవనాన్ని ప్రారంభిస్తారు. చివరగా నిర్మల్ జిల్లా కేంద్రానికి చేరుకుని, అక్కడ ఏర్పాటు చేసిన మాజీ మంత్రి మాజీ పిసిసి అధ్యక్షులు పి.నర్సారెడ్డి విగ్రహాన్ని మంత్రి జూపల్లి కృష్ణారావు ఆవిష్కరిస్తారు. ఈ భారీ పర్యటన నేపథ్యంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా యంత్రాంగం ఇప్పటికే అన్ని ఏర్పాట్లను పూర్తి చేసింది.

## కార్మికులకు కనీస వేతనాల పెంపు

సిఎం రేవంత్, మంత్రి వివేక్ చిత్రపటాలకు క్షీరాభిషేకం



**ప్రజాపక్షం / మందమర్రి:** రాష్ట్రంలోని కార్మికులకు కనీస వేతనాలను మూడు జోన్ల విధానంలో పెంచిన నేపథ్యంలో మందమర్రి పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి చిత్రపటాలకు ఘనంగా క్షీరాభిషేకం నిర్వహించారు. పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు మంద తిరుమల్ రెడ్డి నాయకత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు సైతం పాల్గొని పాలాభిషేకం చేస్తూ ఆనందాన్ని వ్యక్తం చేశారు. కార్మికుల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయం తీసుకుందని కొనియాడారు.స్వర్గీయ గడ్డం వెంకటస్వామి (కాకా) నుంచి నేటి మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి, ఎంపీ గడ్డం వంశీకృష్ణ వరకు వారి కుటుంబం ఎల్లప్పుడూ కార్మికుల పక్షాన నిలిచి పోరాడుతోందని గుర్తుచేశారు. తక్కువ వేతనాలతో ఇబ్బందులు పడుతున్న కార్మిక కుటుంబాల పరిస్థితిని గుర్తించిన మంత్రి వివేక్ వెంకటస్వామి ముఖ్యమంత్రితో చర్చించి కనీస వేతనాల పెంపును సాధించారని పేర్కొన్నారు. ప్రభుత్వ నిర్ణయంతో రాష్ట్రంలోని కోటి పదకొండు లక్షల కార్మిక కుటుంబాలకు ఆర్థిక భరోసా లభించిందని తెలిపారు. కార్మికుల సంక్షేమమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం పని చేస్తోందని స్పష్టం చేశారు.జిల్లా ప్రధాన కార్యదర్శి పుల్లూరి లక్ష్మ ణ్, జిల్లా కార్యదర్శి ఆకారం రమేష్, సీనియర్ నాయకుడు సొత్కు సుదర్శన్, పట్టణ కాంగ్రెస్ కమిటీ ప్రతినిధులు, మహిళా, మైనార్టీ నాయకులు, యూత్ కాంగ్రెస్ ప్రతినిధులు, వార్డుల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రగతి ప్రణాళికలో పురాతన.. కట్టడాల సంరక్షణకూ శ్రమదానం

**ప్రజాపక్షం/నిజాంపేట్:** ప్రజా పాలన ప్రగతి ప్రణళికలో భగంగా శుక్రవారం రోజున నిజాంపేట మండలంలోని నస్కల్ గ్రామంలో పాలకవర్గ ఆధ్వర్యంలో పురాతన గుడి ఆయినా శివుని గుడి ఆలయం శ్రమదాన కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. గ్రామ సర్పంచ్ అంజమ్మ లక్ష్మౌ గౌడ్ ఆద్వర్యంలో పురాతన శివుని గుడిలో పిచ్చి మొక్కలు తోలగిస్తూ పరిశుభ్రంగా తీర్చిదిద్దడం జరిగింది.ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి మమత,గ్రామ ఉపసర్పంచ్ దేవరాజ్, వార్డు మెంబర్ రహీం, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బక్కన్న గారి లింగం గౌడ్, ఎండి సలీం, దేవ రాజ్, రామ గౌడ్, డి శ్రీనివాస్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



# అట్టహాసంగా ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక

- సమష్టి కృషితో సత్వర ప్రగతికి ఎమ్మెల్యేల పిలుపు
- స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులకు విధులు
- అధికారాలపై కలెక్టర్ దిశానిర్దేశం




**ప్రజాపక్షం/నిజామాబాద్ :** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా శుక్రవారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో జిల్లాస్థాయి సమావేశాన్ని అట్టహాసంగా నిర్వహించారు. ప్రభుత్వ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, రూరల్ ఎమ్మెల్యేభూపతిరెడ్డి, నగర మేయర్ ఉమారాణి, కలెక్టర్ ఇలా త్రిపాఠి, తాహెర్‌బిన్ హందాన్, అదనపు కలెక్టర్లు కిరణ్‌కుమార్, దిలీప్‌కుమార్, డీఆర్‌ఓ గీత, అన్ని శాఖల అధికారులు, సర్పంచ్‌లు, కార్పోరేటర్లు, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. రాష్ట్ర గీతం జయజయహే తెలంగాణ గేయలాపనతో సమావేశానికి శ్రీకారం చుట్టి సిఎం రేవంత్‌రెడ్డి సందేశాన్ని చదివి వినిపించారు. వివిధ శాఖల అధికారులు తమతమ శాఖల ద్వారా అమలవుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై నివేదిక చదివి వినిపించారు. పంట రుణాల మాఫీ, రైతుభరోసా, రైతుబీమా, సన్నాలకు బోనస్ చెల్లింపు, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు, కళ్యాణలక్ష్మీ, షాదీముబారక్, రేషన్ కార్డుల పంపిణీ, గృహజ్యోతి, చేయూత పెన్షన్లు, స్వయం సహాయక సంఘాలకు వడ్డీ లేని రుణాలు తదితర పథకాల అమలుతో జిల్లాలో ప్రయోజనం పొందుతున్న లబ్ధిదారుల వివరాలను వెల్లడించారు. వచ్చే విద్యా సంవత్సరం జూన్ 12 నుండి ప్రభుత్వం నూతనంగా అమలు చేయనున్న అల్పాహారం పథకం ఇంటర్మీడియట్ కాలేజీలలో సైతం మధ్యాహ్న భోజనం అమలు, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్సియల్ పాఠశాలలు, తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటు అంశాలపై తెలిపారు. ప్రజలకు ఉపయుక్తంగా నిలిచే పనులను చేపట్టి సకాలంలో అవి పూర్తయ్యేలా చొరవ చూపాలని, నిధులను పూర్తిస్థాయిలో సక్రమంగా వినియోగమయ్యేలా చూడాలన్నారు.ప్రభుత్వం అమలు చేస్తున్న చేయూత పెన్షన్లు, రేషన్ కార్డులు, బీమా పథకాలతో అర్హులైన వారు లబ్ధి పొందేలా చొరవ చూపాలన్నారు. నిజామాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, డిప్యూటీ మేయర్ సల్మా తహసీన్, ఆర్డీఓ రాజేంద్రకుమార్ అధికారులు పాల్గొన్నారు.

## అర్హులైన ప్రతి జర్నలిస్టుకూ అక్రిడిటేషన్ కార్డుల పంపిణీ

టియుడబ్ల్యూజె జిల్లా కమిటీ



**ప్రజాపక్షం / నిర్మల్ టౌన్ :** నిర్మల్ జిల్లాలో అర్హులైన వర్కింగ్ జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్ కార్డులు పంపిణీ చేయడం జరుగుతుందని ప్రభుత్వం, యూనియన్ యొక్క ముఖ్య ఆశయమని టిముడబ్ల్యూజె జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కొండూరి రవీందర్, వెంకగారి భూ మయ్య స్పష్టం చేశారు. జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి, డిపిఆర్ఓ విష్ణువర్ధన్ , యూనియన్ నాయకత్వ ఆధ్వర్యంలో జిల్లాలో అక్రిడిటేషన్ కా ర్డుల పంపిణీ కార్యక్రమం జరిగింది. మొదటి విడత జాబితాలో ఫస్ట్ లిస్టు కార్డులు రాని జర్నలిస్టులు ఎవరూ అధైర్యపడాల్సిన, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వారు పేర్కొన్నారు. ప్రత్యేకంగా మరో సమావేశాన్ని ఏర్పాటు చేసుకుని, మిగిలిన అర్హులైన వారికి రెండో విడత జాబితా సెకండ్ లిస్టు ద్వారా కార్డులు ఇప్పించడం జరుగుతుందన్నారు. కొం దరి కార్డులను సాంకేతిక కారణాల వల్ల ప్రస్తుతం పెండింగ్‌లో పెట్టడం జరిగిందని, అంతేకానీ ఎవరికీ అన్యాయం జరగదని తెలిపారు. ప్రభుత్వంపై యూనియన్ నిరంతరం ఒత్తిడి తీసుకు వచ్చి నిబంధనల్లో తగిన మార్పులు చేయిస్తూ అర్హులైన ప్రతీ వర్కింగ్ జర్నలిస్టుకు అక్రిడిటేషన్ కార్డు దక్కేలా విజయం సాధించిందని వా రు గుర్తు చేశారు. మొదటి జాబితాలో పేరు లేని మిత్రులు ఎవరూ ఆందోళన చెందవద్దని రెండో జాబితాలో ఖచ్చితంగా అర్హులైన వారికి కార్డుల పంపిణీ జరుగుతుందని జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కొండూరి రవీందర్, వెంకగారి భూమయ్య, జిల్లా ఉపాధ్యక్షులు, జల్లా మనోజ్, వరప్రసాద్ జర్నలిస్టులకు విజ్ఞప్తి చేశారు.

## విద్యుత్ ఉద్యోగుల.. ప్రాణం మీదకు తెచ్చిన నిర్లక్ష్యం



**ప్రజాపక్షం/నిజామాబాద్ :** విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతో నిండు ప్రాణం బలైందని గ్రామస్తులు నిరసన తెలిపిన ఘటన జిల్లాలో చోటు చేసుకుంది. వివరాల ప్రకారం ధర్పల్లి మండలం గోవింద్‌పల్లి గ్రామంలో గురువారం తీవ్ర విషాదం చోటు చేసుకుంది. విద్యుత్ మరమ్మతుల కోసం లైన్మెన్ ఎల్‌సి ఇచ్చాడని మరమ్మతులు చేపట్టగా ఇచ్చినట్లు ఇచ్చి వెంటనే విద్యుత్ సరఫరాను కొనసాగించటంతో విద్యుత్ స్తంభంపైకి వెళ్లి పనులు చేస్తున్న నాగేష్ యువకుడు కుప్పకూలి కింద పడిపోయాడు. దీంతో అక్కడే ఉన్న శ్రీనివాస్ హుటాహుటిన జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమించటంతో అక్కడి నుంచి హైదరాబాద్ యశోధ ఆస్పత్రికి తరలించినట్లు కుటుంబీకులు తెలిపారు. లైన్‌మెన్ ప్రవీన్‌ను అందుబాటులో లేకపోవటంతో ప్రైవేట్ వ్యక్తికి ఎల్‌సి ఇవ్వటం జరిగిందని చె ప్పడం నిర్లక్ష్యానికి నిదర్శనంగా చెప్పవచ్చు. సబ్‌స్టేషన్‌లో వాచ్‌మెన్‌గా కొనసాగుతున్న కిరణ్‌ను ఆపరేటర్‌గా విధులు నిర్వర్తించటానికి కావల్సిన అర్హతలు లే కుండానే ఆపరేటర్‌గా కొనసాగించడంపై గ్రామస్తులు మండిపడ్డారు. నిర్లక్ష్యం వహించిన విద్యుత్ అధికారులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## ఎసిబి వలలో చిక్కిన విద్యుత్ శాఖ ఎడిఇ



**ప్రజాపక్షం/నర్సాపూర్:** కాంట్రాక్టర్ నుండి లంచం తీసుకుంటుండగా విద్యుత్ శాఖ ఎడిఇ శుక్రవారం ఎసిబి అధికారులకు చిక్కారు. ఎసిబి డిఎస్‌పి కె.సుదర్శన్ తెలిపిన వివరాల ప్రకారం 2023 నుండి 2025 వరకు ఓ కాంట్రాక్టర్ 11 ఎలక్ట్రిసిటీ డిపార్ట్మెంట్లకు సంబంధించిన రూ.3 ల క్షల 15 వేల పనులు పూర్తి చేయడం జరిగింది. వీటి బిల్లులు ఫార్వర్డ్ చేయడానికి సదరు కాంట్రాక్టర్‌ను నర్సాపూర్ ఎడిఇ రమణారెడ్డి 30,000 లంచం డిమాండ్ చేశారు.ఈనెల 20వ తేదీన కాంట్రాక్టర్ మెదక్ ఎసిబి అధికారులను ఆశ్రయించారు. ఇది నిజమా కాదా అని తెలుసుకోవడానికి కాంట్రాక్టర్ ను ఎడిఇ దగ్గరకు పంపగా 20 లేదా 25 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. కాంట్రాక్టర్ తో డబ్బులు పంపించగా ఎడిఇ రమణారెడ్డి తీసుకోగా రెడ్ హ్యాండెడ్ గా పట్టుకోవడం జరిగింది. ఇంకా ఇలాంటి అవినీతికి పాల్పడ్డాడని అనుమానంతో అతని ఇంటిని సెర్చ్ చేయడం జరిగింది. లంచం తీసుకుంటూ పట్టుబడ్డ ఏడిఈ రమణారెడ్డిని కోర్టులో ప్రొడ్యూస్ చేస్తామని ఎసిబి డిఎస్‌పి సుదర్శన్ వెల్లడించారు. ఎక్కడైనా ప్రభుత్వ అధికారులు లంచం అడిగితే 1064 టోల్ ఫ్రీ నెంబర్ ను సంప్రదించాలని సూచించారు.ఇన్‌స్పెక్టర్లు వెంకటేష్, రమేష్ సిబ్బంది పాల్గొన్నారు.

## గడి పెద్దాపూర్‌లో అక్రమ మట్టి తవ్వకాలు



**ప్రజాపక్షం/అల్లాదుర్గం:** గత కొన్ని నెలలుగా జోరుగా అక్రమ మట్టి తవ్వకాలు జరుగుతున్న సంబంధిత అధికారులు పట్టించుకోవడంలేదని విమర్శలువెల్లువెత్తుతున్నాయి. మండల పరిధిలోని గడి పెద్దాపూర్, గోరుగుట్ట, పెద్ద చెరువు ప్రాంతాల్లో పగలు రాత్రి అని తేడా లేకుండా ట్రిప్పర్ల, టాక్టర్ల ద్వారా మట్టిని తరలిస్తూ ప్రభుత్వ ఆదాయానికి అక్రమార్కులు గండి కొడుతున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం మట్టి తీయాలంటే ప్రభుత్వానికి రుసుం చెల్లించవలసి ఉంటుంది. ప్రభుత్వానికి రుసుము చెల్లించిన ఉదయం 8 నుండి సాయంత్రం 5 గంటల వరకే మట్టి తరలించవలసి ఉంటుంది. కానీ మట్టి తవ్వకాలు నిర్వహించే అక్రమార్కులు గత కొన్ని నెలలుగా నిత్యం 10, 20 ట్రాక్టర్లతో అక్రమ మట్టి తరలింపు జరుగుతున్న దీనిపై ఏ అధికారి అటువైపు కన్నెత్తి చూసిన దాఖలు లేవని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.


## ప్రజా ప్రగతి ప్రణాళికతోనే జిల్లాల సమగ్ర అభివృద్ధి



**ప్రజాపక్షం/ఆదిలాబాద్ రూరల్:** ప్రభుత్వం చేపట్టిన ప్రజా ప్రగతి ప్రణాళిక ద్వారానే గ్రామాలు, పట్టణాల సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని జిల్లా కలెక్టర్ రాజర్షి షా స్పష్టం చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఎస్‌టియు భవన్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి సమావేశానికి ఎస్పీ అఖిల్ మహాజన్‌తో కలిసి ఆయన హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో ప్రజల అవసరాలను గుర్తించి నిధులు కేటాయించడమే ఈ ప్రణాళిక ముఖ్య ఉద్దేశమన్నారు. అధికారులు సమన్వయంతో పని చేసి గ్రామాల్లో తాగునీరు, రోడ్లు, డ్రైనేజీ వసతులను మెరుగుపరచాలని, పాఠశాలలు, అంగన్‌వాడీలు, ఆరోగ్య కేంద్రాల బలోపేతానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. గ్రామ సభలు నిర్వహించి నివేదికలు రూపొందించాలని ఆదేశించారు. అనంతరం జాబ్ మేళా అభ్యర్థులకు నియామక పత్రాలు, పదో తరగతి టాపర్లకు ప్రశంసా పత్రాలు, బాల్య వివాహ రహిత పంచాయతీలకు అవార్డులను అందజేశారు.ఐటిడిఎ పిఓమకరంద్, మున్సిపల్ చైర్‌పర్సన్ అనూష, గ్రాంధాలయ సంస్థ చైర్మన్ మల్లెపూల నర్సయ్య, అదనపు కలెక్టర్ రాజేశ్వర్, మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, అధికారులు పాల్గొన్నారు.

## రూ.15.26 లక్షల ఇన్సూరెన్స్ చెక్కు పంపిణీ

తెలంగాణ గ్రామీణ బ్యాంక్ రీజనల్ మేనేజర్ ఉపేందర్ గౌడ్



**ప్రజాపక్షం/పెంచికలపేట్:** అనుకోని పరిస్థితుల్లో కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించేది ఇన్సూరెన్స్ పాలసీలేనని తెలంగాణ గ్రామీణ బ్యాంక్ రీజనల్ మేనేజర్ ఉపేందర్ గౌడ్ తెలిపారు. మండల కేంద్రంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంకులో శుక్రవారం ఎస్బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఇన్సూరెన్స్ చెక్కు పంపిణీ చేశారు. పెంచికల్‌పేట్ గ్రామానికి చెందిన కోడూరి వెంకటేష్ రెండు ఇన్సూరెన్స్ పాలసీలు తీసుకోగా, ఇటీవల ఆయన మృతి చెందడంతో పాలసీ నిబంధనల ప్రకారం ఆయన కుమారుడు కోడూరి అంజన్నకు రూ.15,26, 250 విలువైన ఇన్సూరెన్స్ చెక్కును రీజనల్ మేనేజర్ అందజేశారు. ప్రతి బ్యాంకు ఖాతాదారుడు తప్పనిసరిగా ఇన్సూరెన్స్ చేయించుకోవాలని సూచించారు. బ్యాంకుల ద్వారా అందిస్తున్న వివిధ సేవలు, ప్రభుత్వ సబ్సిడీ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రైతులు మంచి క్రెడిట్ చరిత్రను కొనసాగించాలని అన్నారు. ఇన్సూరెన్స్ పాలసీ ద్వారా కుటుంబ సభ్యులకు పెద్ద మొత్తంలో ఆర్థిక సహా యం అందడం, పాలసీల ప్రాధాన్యతను చాటిచెప్పే ఉదాహరణ అని ఆయన పేర్కొన్నారు. సీనియర్ మేనేజర్ రఘువీర్ శర్మ, తెలంగాణ గ్రామీణ మేనేజర్ గోపి కిషోర్, ఫీల్డ్ ఆఫీసర్ అనంత్, క్యాషియర్ అంజన్న, ఎస్‌బిఐ లైఫ్ బిడిఎం అనిల్ కుమార్ పాల్గొన్నారు.

## వడదెబ్బతో వ్యక్తి మృతి



**ప్రజాపక్షం/ జన్నారం:** జన్నారం బస్టాండ్ పరిధిలో వడదెబ్బ తగిలి ఓ యువకుడు మృతి చెందినట్లు జన్నారం ఎస్ఐ ఉదయ్ కిరణ్ తెలిపారు. ఎస్ ఐ తెలిపిన వివరాల ప్రకారం ఉట్నూరు మండలం ఘన్పూర్ గ్రామానికి చెందిన కోవా కిరణ్ కుమార్ (27) ఉపాధి హామీ కూలీగా పనిచేస్తున్నాడు. గురువారం ఉదయం పని ముగించుకుని ఇంటికి వచ్చిన తన సెల్ ఫోన్ పాడైందని,బాగు చేయించుకోవడానికి జన్నా రం వెళ్లి వస్తానని కుటుంబ సభ్యులకు చెప్పి బ యలుదేరా డు. సాయంత్రం వరకు అతను తిరిగి రాక పోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందారు. శుక్రవారం ఉదయం జన్నారం బ స్టాండ్ వద్ద ఒక వ్యక్తి మృతి చెంది ఉన్నట్లు వా ట్సాప్ గ్రూపుల ద్వా రా సమాచారం రావడంతో గమనించిన గ్రామస్తులు, కుటుంబ సభ్యులు అ క్కడికి చేరుకుని మృ తుడిని కోవా కిరణ్ కుమార్‌గా గుర్తించారు. వడదెబ్బ తగిలి బస్టాండ్‌లోనే మృతి చెందినట్లు నిర్ధారించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

## అంతర్ జిల్లా ట్రాన్స్‌ఫార్మర్ దొంగల అరెస్టు




**ప్రజాపక్షం/నిజామాబాద్ అర్బన్ :** మెదక్ జిల్లాకు చెందిన కొంతమంది ట్రాన్స్‌ఫార్మర్ దొంగల ముఠాగా ఏర్పడి నిజామాబాద్, కామారెడ్డి, మెదక్ జిల్లాలలో సుమారు 64 ట్రాన్స్‌ఫార్మర్ల కాయల్సిన్ కొల్లగొట్టడం జరిగిందని, ఇట్టి ముఠాను గురువారం రెంజల్ పోలీసులు సాఠాపూర్ బైపాస్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా ఐదుగురు వ్యక్తులు మూడు మోటార్ సైకిల్‌పై అనుమానాస్పదంగా వస్తు పోలీసులకు 80 కిలోల కాయిల్స్‌తో ఉన్న గన్ని బ్యాగుతో దొరికిపోవడం జరిగిందని, అనంతరం విచారించగా దొంగిలించిన కాయిల్స్‌ను నిజామాబాద్, బోధన్, మేడ్చల్ ప్రాంతాలలో అమ్ముతున్నట్టుగా వీరు తెలిపారని నిజామాబాద్ పోలీసు కమిషనర్ పి. సాయి చైతన్య తెలిపారు. శుక్రవారం కమాండ్ కంట్రోల్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పట్టుబడిన నిందితులను ఏ1 మెదక్ పట్టణానికి చెందిన వనం సాయిలు (38), ఏ2 మెదక్ టౌన్‌కు చెందిన జగన్నాథం సారయ్య అలియాస్ శ్రీనివాస్ (37), ఏ3 నందిపేట్, ప్రస్తుతం బోధన్‌కు చెందిన సుంకయ్య (54), ఏ4 మెదక్ పట్టణానికి చెందిన ధనశ్రీ కిరణ్ (37), ఏ5 మెదక్ జిల్లాకు చెందిన దాసరి పోచయ్య (37)గా గుర్తించారు. దొంగిలించబడిన ఆస్తి స్వీకర్తలు 1. బోధన్‌కు చెందిన స్క్రాబ్ వ్యాపారి సయ్యద్ అక్బర్ హుస్సేన్ (42), 2. నిజామాబాద్‌కు చెందిన స్క్రాబ్ వ్యాపారి షేక్ మహబూబ్ (58), 3. మేడ్చల్ జిల్లాకు చెందిన మాలప్ప మాస్టర్ (25) పరారీలో ఉన్నాడు. 4. మేడ్చల్ జిల్లాకు చెందిన తాయప్ప దంగల్ (33) పరారీలో ఉన్నాడు. మొత్తం ఏడుగురిని అరెస్టు చేయడం జరిగిందని వీరి నుంచి స్వాధీనం చేసుకున్న పదార్థాలు 80 కిలోల రాగి కాయిల్స్, మూడు మోటార్ సైకిళ్ళు, నాలుగు మొబైల్ ఫోన్‌లు జప్తు చేయడం జరిగిందన్నారు. బోధన్ ఏసిపి పి. శ్రీనివాస్, ఏసిపి ట్రా ఫిక్ నిజామాబాద్ మస్తాన్ అలీ, సిసిఎస్ ఇన్‌స్పెక్టర్ సాయినాథ్, రెంజల్ ఎస్ఐ చంద్రమోహన్, బోధన్ రూరల్ ఎస్ఐ మచ్చేందర్ రెడ్డి, సిసిఎస్ ఎస్ఐ విఠల్, సిసిఎస్ నిజామాబాద్ హెడ్ కానిస్టేబుల్ వెంకట్రామ్, హెచ్‌పిఎల్ రవి, కమిషనర్ పి. సాయి చైతన్య అభినందించి ప్రశంసించారు.


## భాగ్యరెడ్డి వర్మ జీవితం స్ఫూర్తిదాయకం

అదనపు కలెక్టర్ యువరాజ్ మర్మాట్

**ప్రజాపక్షం/ఆసిఫాబాద్:** సామాజిక సంస్కర్త, అసమానతలపై పోరాడిన స్ఫూర్తియుత భాగ్యరెడ్డి వర్మ జీవితం అందరికీ స్ఫూర్తిదాయకమని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్ అన్నారు. శుక్రవారం సమీకృత కలెక్టరేట్ భవన సముదాయంలోని సమావేశ మందిరంలో భాగ్యరెడ్డి వర్మ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి. డేవిడ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అనిల్, జిల్లా రెవెన్యూ అధికారి డేవిడ్, అదనపు కలెక్టర్ యువరాజ్ మర్మాట్ హాజరై భాగ్యరెడ్డి వర్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్లు మాట్లాడుతూ భాగ్యరెడ్డి వర్మ ఆది హిందూ సంస్థను స్థాపించి ఎన్నో సామాజిక మార్పులు తెచ్చారని కొనియాడారు. అనగారిన వర్గాల అభ్యున్నతి, మహిళల విముక్తి కోసం ఆయన చేసిన పోరాటం, నిర్వహించిన సామాజిక సేవా కార్యక్రమాలు, విద్యాభివృద్ధి కోసం పాఠశాలలు నెలకొల్పడం వంటి విషయాలను గుర్తుచేశారు. జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## మణుగూరు చెరువుల్లో వలస కొంగల సందడి



ప్రకృతి ప్రేమికులను ఆకట్టుకుంటున్న అరుదైన దృశ్యాలు

''ప్రకృతి అందాలకు కొత్త శోభ''

**ప్రజాపక్షం/మణుగూరు :** మణుగూరు పరిసర ప్రాంతాల్లోని చెరువులు, నీటి మడుగుల్లో ఇటీవల పెద్ద సంఖ్యలో కొంగలు కనిపిస్తూ స్థానికులను ఆకట్టుకుంటున్నాయి. నల్ల తెలుపు రంగులతో ప్రత్యేక ఆకర్షణగా కనిపించే ఈ పక్షులు ఎక్కువగా "ఏషియన్ ఓపెన్‌బిల్ స్టార్క్స్" జాతికి చెందినవిగా భావిస్తున్నారు. చెరువుల్లో నీరు నిల్వ ఉండటం, నత్తలు, చిన్న చేపలు సమృద్ధిగా లభించడం వల్ల ఈ పక్షులు మణుగూరు ప్రాంతానికి చేరుకున్నట్లు ప్రకృతి ప్రేమికులు చెబుతున్నారు. సాధారణంగా వర్షాకాలం తర్వాత లేదా నీరు ఎక్కువగా ఉండే కాలంలో ఇవి ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి సంచరిస్తూ ఉంటాయి. ప్రస్తుతం మణుగూరులో గుంపులుగా కనిపిస్తున్న ఈ కొంగలు ఉదయం మరియు సాయంత్రం సమయాల్లో చెరువుల వద్ద ఆహారం కోసం సంచరిస్తూ ప్రత్యేక దృశ్యాన్ని సృష్టిస్తున్నాయి. కొన్ని పక్షులు గాల్లో గుంపులుగా ఎగురుతూ కనిపించడం స్థానికులను ఆకట్టుకుంటోంది. పర్యావరణ నిపుణుల అభిప్రాయం ప్రకారం, ఇటువంటి పక్షులు ఒక ప్రాంతంలో కనిపించడం అక్కడి జీవవైవిధ్యం ఇంకా నిలిచి ఉందనే సంకేతం. అయితే వేసవి తీవ్రత పెరగడం, చెరువులు ఎండిపోవడం, ప్లాస్టిక్ వ్యర్థాలు పెరగడం వంటి కారణాలు ఈ పక్షుల జీవనానికి ప్రమాదంగా మారే అవకాశం ఉందని వారుహెచ్చరిస్తున్నారు. స్థానిక ప్రజలు చెరువుల పరిశుభ్రతను కాపాడుతూ, పక్షులకు ఇబ్బంది కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ప్రకృతి ప్రేమికులు కోరుతున్నారు.



## తిరుమలాయపాలెం గోల్ తండాలో దారుణ ఘటన

భార్యను కొట్టి ఉరివేసి ఆత్మహత్యగా చిత్రీకరణ

**ప్రజాపక్షం/తిరుమలాయపాలెం :** మండలంలో దారుణ ఘటన వెలుగుచూసింది. భార్యను తీవ్రంగా కొట్టి అనంతరం చున్నీతో ఉరివేసి హత్య చేసి దాన్ని ఆత్మహత్యగా చిత్రీకరించాడనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని గోల్ తండాకు చెందిన బానోత్ శివాజీ, మీనాక్షి దంపతులు 12 సంవత్సరాల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. వీరికి ఇద్దరు కుమారులు కాగా, గత కొంతకాలంగా దంపతుల మధ్య తరచుగా వివాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ క్రమంలో గురువారం రాత్రి మరోసారి ఇద్దరి మధ్యన ఘర్షణ జరగగా ఆ సమయంలో శివాజీ మీనాక్షిని తీవ్రంగా కొట్టాడని, అనంతరం చున్నీతో ఉరివేసి చంపి, దాన్ని ఆత్మహత్యగా చూపించే ప్రయత్నం చేశాడని కుటుంబసభ్యులు, గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మీనాక్షి ఒంటిపై గాయాలు, ఆనవాళ్లు గుర్తించినట్లు సమాచారం. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. పోస్టుమార్టం నివేదిక అనంతరం పూర్తి వివరాలు వెల్లడి కానున్నాయి. భర్త శివాజీ భార్యను హత్య చేసి ఉరేసుకున్నట్లుగా చిత్రీకరించి భర్త ఏమి తెలియనట్లుగా పోలీస్‌స్టేషన్లో లొంగిపోయినట్లుగా సమాచారం. ఇన్సూరెన్స్ డబ్బు కోసమే ఈ హత్య జరిగిందా శివాజీ మనసులో మరి ఏదైనా దురద్ధేశం ఉందా అనే కోణంలో విచారణ జరపాలని కోరుతున్నట్లు మృతిరాలి బంధువులు డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయంపై పూర్తి సమాచారం తెలవాలంటే పోస్టుమార్టం రిపోర్టు వస్తేగాని, హత్య జరిగిందా లేక పోతే ఆత్మహత్యతానే చేసుకుందా అనే పూర్తి సమాచారం తెలుస్తుందని స్థానికులు చెబుతున్నారు.



## పనికి తగ్గ వేతనం ఇవ్వండి

మమ్మల్ని కూడా ఉద్యోగులుగానే గుర్తించండి

విఒఎల ఆవేదన

**ప్రజాపక్షం/సత్తుపల్లి :** మండలంలో గ్రామీణాభివృద్ధి కోసం సంవత్సరాలుగా సేవలు అందిస్తున్న విఒఎలు (విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్లు) తమ జీవన సమస్యలపై ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నెలకు కేవలం రూ.150 గౌరవ వేతనం నుండి సేవలందిస్తున్నామని, ఇప్పటికీ రూ.5,000 వరకు మాత్రమే వేతనం అందుతున్న పరిస్థితుల్లో కుటుంబాలను పోషించడం కష్టమవుతుందని వాపోతున్నారు. శుక్రవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయ ఎదుట సత్తుపల్లి మండల విఓఏల సంఘం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆ సంఘం అధ్యక్షురాలు తుమ్మలపల్లి సరోజిని మాట్లాడుతూ ప్రభుత్వ పథకాల అమలులో మేము కీలక పాత్ర పోషిస్తున్నామని, గ్రామాల్లో మహిళా సంఘాల నిర్వహణ నుంచి పేదల సంక్షేమ కార్యక్రమాల వరకు బాధ్యతలు నిర్వర్తిస్తున్నా, మాకు కనీస వేతనం కూడా లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వేతనాలను కనీసం నెలకు రూ.20 వేలుగా నిర్ణయించి, నేరుగా ఉద్యోగుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు. అదే విధంగా హెచ్‌ఆర్ పాలసీ అమలు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. తమ డిమాండ్ల సాధన కోసం ఈనెల 18వ తేదీ నుంచి సమ్మె చేపట్టినట్లు సరోజిని తెలిపారు. తమ న్యాయమైన డిమాండ్లు సాధించే వరకు నిరసన కార్యక్రమాన్ని విరమించమన్నారు. పని మాత్రం ప్రభుత్వ ఉద్యోగిలా చేపిస్తున్నారని, గౌరవం మాత్రం కాంట్రాక్ట్ కార్మికుల కంటే తక్కువగా చూస్తున్నారని మండిపడ్డారు. విఒఎలు తమకు సాధారణ ఆరోగ్య భీమా సౌకర్యంతో పాటు రూ.20లక్షల బీమా కల్పించాలని, సెర్ప్ ఉద్యోగులుగా అధికారిక గుర్తింపు ఇవ్వాలని కోరుతున్నారు. అర్హులైన విఓఏలకు కమ్యూనిటీ కోఆర్డినేటర్లుగా (సీసీలు) పదోన్నతులు కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.ఈ నిరసన కార్యక్రమంలో సాదు చిట్టెమ్మ, నారపోగు సుధాకర్, సుజాత, అభిబున్నీస్సా, భాగ్యలక్ష్మి, రాజేశ్వరి, ధనలక్ష్మి, పద్మ, లత తదితరులు పాల్గొన్నారు.

# సమష్టి కృషితోనే 'ప్రజాపాలన' విజయవంతం

ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

ఘనంగా జిల్లా స్థాయి సమావేశం



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** అధికారులు, ప్రజాప్రతినిధుల సమన్వయం, సమష్టి కృషితోనే ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక విజయవంతంగా సాగుతోందని, ఇది ప్రజలను , ప్రభుత్వానికి మరింత చేరువచేసే మంచి కార్యక్రమమని కొత్తగూడెం శాసనసభ్యుడు కూనంనేని సాంబశివరావు అన్నారు. స్థానిక కొత్తగూడెం క్లబ్‌లో జిల్లా స్థాయి సమావేశాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. జిల్లా కలెక్టర్ అంకిత్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ఎంఎల్ఎలు కోరం కనకయ్య, పాయం వెంకటేశ్వర్లు, మున్సిపల్ కార్పొరేషన్ మేయర్, డిప్యూటీ మేయర్ మూడ్ గణేష్, సరిపురపు లలిత కుమారి, గ్రంథాలయ చైర్మన్ పసుపులేటి వీరబాబు, ఇల్లందు మున్సిపల్ చైర్‌పర్సన్ దొడ్డ కిరణ్ మిత్ర, భద్రాచలం ఐటిడిఎ పిఒ రాహుల్, భద్రాచలం సబ్ కలెక్టర్ మ్రినాల్ శ్రేష్టతో పాటు తదితరులు పాల్గొన్నారు. ముందుగా క్లబ్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వివిధ స్టాల్స్‌ను పరిశీలించారు. అనంతరం సభావేదిక వద్ద జ్యోతిప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తే గ్రామాలు, పట్టణాలు అభివృద్ధి సాధించడం చాలా సులువన్నారు. ప్రతీ శాఖ బాధ్యతాయుతంగా పనిచేసిన నాడు అభివృద్ధి ఫలాలు ప్రజలకు చేరువవుతాయని, గ్రామస్థాయిలో ప్రజల సమస్యలు తెలుసుకుని వాటిపై చర్యలు తీసుకోవడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమన్నారు. కొత్తగూడెం నియోజకవర్గంలో అభివృద్ధి ఫలాలు ప్రజల దరిచేరుతున్నాయని, ప్రతీ అంశాన్ని పరిగణలోనికి తీసుకుని ప్రజలకు మేలు చేసేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. జూన్ 12వ తేదిన ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక ముగింపు కార్యక్రమాన్ని పండుగ వాతావరణంలో జరుపుకుందామని చెప్పారు. అనంతరం పినపాక ఎంఎల్ఏ పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హతగల ప్రతీ కుటుంబానికి చేరవేసేలా ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పని చేయాలని అన్నారు. ఆరు గ్యారెంటీల అమలుతో ప్రభుత్వం ప్రజలకు చేరువైందని, అర్హులకు న్యాయం చేయడమే ఏకైక లక్ష్యం అన్నారు. అనంతరం ఇల్లెందు ఎంఎల్ఏ కోరం కనకయ్య మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలపై ప్రజల్లో మరింత అవగాహన పెంచాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశంలోనే అగ్రగామిగా ఉన్నాయని, సమస్యల పరిష్కారానికి అధికారులు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. మేయర్ గణేష్ మాట్లాడుతూ ప్రగతి ప్రణాళిక కార్యక్రమం ద్వారా వార్డులు, బస్తీల్లో మెరుగైన పరిస్థితులు ఏర్పడుతున్నాయని, ప్రజాప్రతినిధులతో పాటు అధికారులు క్షేత్రస్థాయిలోకి వెళ్లి నేరుగా ప్రజలతో మమేకమై సమస్యల పరిష్కారానికి కృషి చేయడం అభినందనీయం అన్నారు. కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ ప్రజలకు పారదర్శకమైన పాలన అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం 99 రోజుల కార్యాచరణను చేపట్టిందని, ప్రారంభ దశలో జిల్లాలోని సర్పంచ్‌లు, మున్సిపల్ కౌన్సిలర్లు, కార్పొరేటర్లకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. గ్రామాల్లో వార్డుల్లో పారిశుధ్య కార్యక్రమాలు, సంక్షేమ వారోత్సవాలు, ఆరోగ్య శిబిరాలు విస్తృతస్థాయిలో చేపట్టినట్లు వివరించారు. అనంతరం సాలిడ్ వేస్ట్ మేనేజ్‌ట్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన, కొత్తగూడెం ఆర్డీఓ మధు, అన్నిశాఖల అధికారులు, సర్పంచ్‌లు, వార్డు మెంబర్లు, ప్రజాప్రతినిధులు, సబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.





## ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు పంపిణీ

**ప్రజాపక్షం/మధిర :** మధిర పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క కృషితో మంజూరైన సిఎం రిలీఫ్ ఫండ్ రూ.10లక్షల విలువ కలిగిన చెక్కులను మధిర పట్టణ, మండల లబ్ధిదారులకు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పారుపల్లి విజయ్‌కుమార్, పట్టణ అధ్యక్షుడు తలుపుల వెంకటేశ్వర్లు పంపిణీ చేశారు. శుక్రవారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ మధిర నియోజకవర్గ అభివృద్ధి, ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న పేద, మధ్య తరగతి కుటుంబాలకు కోట్లాది రూపాయల చెక్కులను మంజూరు చేయించడం ద్వారా అనేక మంది ప్రజలకు ఆర్థిక భరోసా కల్పించారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి కర్నాటి రామారావు, కౌన్సిలర్ బాణావత్ వెంకటరమణనాయక్, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ ఐలూరి సత్యనారాయణరెడ్డి, నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు తూమాటి నవీన్‌రెడ్డి, కోరంపల్లి చంటి, బాజీ, బండారు నర్సింహారావు, రబ్బాని అనీల్, కరివేద సుధాకర్, సాలిక సురేష్ తదితరులు పాల్గొన్నారు.



## ఎండ వేడిమికి స్కూటీ దగ్ధం

**ప్రజాపక్షం/జూలూరుపాడు :** ఎండ వేడిమి తీవ్రత కారణంగా తల్లాడ కొత్తగూడెం రాష్ట్రీయ రహదారిపై ద్విచక్ర వాహనం దగ్ధమైంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు శివారు సీతారామ ప్రధాన కాల్వపైన నిర్మించిన బ్రిడ్జి సమీపంలో శుక్రవారం ఈ ఘటన చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తల్లాడ వైపు నుంచి పాల్వంచ వైపు స్కూటీపై దంపతులు ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహన నుంచి ఒక్కసారిగా మంటలు వ్యాపించడంతో వాహనం నడుపుతున్న వ్యక్తి వాహనాన్ని రోడ్డు పక్కన వదిలివేశాడు. మధ్యాహ్నం సుమారు 12:30గంటల సమయం, వేసవి ఎండల తీవ్రత, వేడి గాలులు ఎక్కువగా ఉండటం వాహనం నుంచి మంటలు ఒక్క సారిగా ఎగిసిపడటంతో టూ వీలర్ పూర్తిగా కాలిపోయింది. చుట్టుపక్కల పొలాల వారు మంటలు ఆర్పేందుకు ప్రయత్నించినా అప్పటికే స్కూటీ పూర్తిగా దగ్ధమైపోయింది. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాకపోవడంతో పెను ప్రమాదం తప్పినట్లయింది. ఈ సంఘటనతో కొత్తగూడెం ఖమ్మం జాతీయ రహదారికి ఇరువైపులా కిలోమీటర్ మేర వాహనాలు స్థంబించాయి. వాహనంపై ప్రయాణిస్తున్నవారికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియవలసి ఉంది. పగటి ఉష్ణోగ్రతలు గత వారం రోజులుగా జూలూరుపాడు మండలంలో ఉష్ణోగ్రతలు 45 డిగ్రీలు నమోదు అవుతున్నాయని, వేడిని తట్టుకోలేక ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. వేడికి ద్విచక్ర వాహనం అగ్ని ప్రమాదానికి గురైన సంఘటన ప్రజలను ఆందోళనకు గురిచేసింది.

# సమన్వయంతోనే అభివృద్ధి సాధ్యం

ప్రజాపాలన, ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో కలెక్టర్

ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో రాష్ట్రంలోనే ఖమ్మం ముందంజ



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ప్రజాప్రతినిధులు, అధికారుల సమన్వయంతోనే జిల్లా అభివృద్ధి సాధ్యమవుతుందని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తెలిపారు. శుక్రవారం స్థానిక భక్తరామదాసు కళాక్షేత్రంలో నిర్వహించిన 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక జిల్లా స్థాయి కార్యక్రమంలో కలెక్టర్ దివాకర టిఎస్ అదనపు కలెక్టర్ డా.పి.శ్రీజతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గత రెండున్నర ఏళ్లుగా ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు, లక్ష్యాలను ప్రజలకు వివరించేందుకు 99 రోజుల ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తే మంచి ఫలితాలు సాధించవచ్చునని తెలిపారు. ప్రభుత్వ పథకాలు విజయవంతం కావాలంటే ప్రజల భాగస్వామ్యం ఎంతో ముఖ్యమన్నారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం ప్రారంభ సమయంలో లబ్ధిదారులు ఇంటి నిర్మాణంలో అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నప్పటికీ, స్థానిక ప్రజాప్రతినిధుల సహకారం ఇందిరా మహిళా శక్తి కింద బ్యాంకు రుణాలు, కల్పన వంటి చర్యలతో పనులు వేగవంతమయ్యాయన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలోనే అత్యధికంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు ఖమ్మం జిల్లాలో పూర్తయ్యాయని కలెక్టర్ తెలిపారు. ఇటీవల నిర్వహించిన జాబ్‌మేళాలో యువతకు పెద్ద సంఖ్యలో ఉద్యోగ అవకాశాలు కల్పించినట్లు తెలిపారు. ఇటీవల ఎన్నికైన సర్పంచ్‌లు, మున్సిపల్ వార్డు సభ్యులు ప్రజలకు మరింత చేరువై సేవలు అందించాలని సూచించారు.

ఖమ్మం జిల్లాలో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్న నేపథ్యంలో ఎక్కువ సంఖ్యలో చలివేంద్రాలను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని విస్తృత స్థాయిలో మొక్కలు నాటాలని, పారిశుధ్యాన్ని అత్యంత ప్రాధాన్యంగా తీసుకోవాలని తెలిపారు. మధ్యాహ్న భోజన పథకాన్ని ఇంటర్ వరకు విస్తరించనున్నట్లు పాఠశాల విద్యార్థులకు అల్పాహార కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు. వికలాంగ విద్యార్థులకు బ్యాటరీ ఆధారిత వాహనాల పంపిణీ కార్యక్రమాన్ని కూడా త్వరలో ప్రారంభించనున్నట్లు కలెక్టర్ తెలిపారు.

జిల్లా స్థాయి శాఖల అధికారులు పలు ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి వివరించారు. ప్రజలు లబ్ధిపొందుతున్న వివరాలను తెలిపారు. రాబోయే ప్రభుత్వ పథకాలను ప్రజలకు కలెక్టర్ సంపూర్ణంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్లు, సర్పంచ్‌లు, జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# చెరువు చెరపై చర్యలేవీ..?

'ప్రజాపక్షం' కథనాలతో కదిలిన అధికారులు, ఇప్పుడు ఎందుకు మౌనం..?

కలెక్టర్ ఆదేశాలిచ్చినా బుట్టదాఖలవుతున్న వైనం

మంత్రి పొంగులేటి సైతం చెరువు ఆక్రమణపై పలు మీటింగుల్లో ధ్వజం

చెరువు, బఫర్ భూములు కాపాడాలని ప్రజల డిమాండ్




**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఏదులాపురంమున్సిపాలిటీ పరిధిలోని ఏదులాపురం ఊర చెరువు పరిరక్షణ అంశం తీవ్ర చర్చనీయాంశంగా మారుతోంది. తాజాగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి నిర్వహించిన ప్రజాదర్బారులోనూ ఆక్రమణపై ఫిర్యాదు చేయడంతో మరోమారు తెరపైకి వచ్చింది. ప్రధానంగా చెరువు చెరపై జరుగుతున్న ఆక్రమణలపై ఓ పక్క ప్రజాపక్షం దినపత్రిక వరుస కథనాలు, మరోపక్క సిపిఐ పార్టీ పలుమార్లు ఫిర్యాదులు ఇచ్చిన నేపథ్యంలో జిల్లా కలెక్టర్ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినప్పటికీ, ఇప్పటికీ అమలు మాత్రం కనిపించడంలేదు. ప్రజాపక్షం వరుస కథనాలతో స్పందించిన అధికారులు ప్రారంభంలో హడావుడిగా సర్వేలు నిర్వహించినా, ఆక్రమణదారులకు నోటీసులు జారీ చేసినా, ఆ తర్వాత చర్యలు నిలిచిపోయాయని విమర్శలు వినిపిస్తున్నాయి. ఇదే విషయంపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సైతం చెరువు భూములను కాపాడాలని పలు మీటింగులలో అధికారులకు సూచించారు.

అయినప్పటికీ క్షేత్ర స్థాయిలో మార్పు లేకపోవడం ప్రజల్లో అనుమానాలకు తావిస్తోంది. చెరువు విస్తీర్ణం తగ్గిపోతే భవిష్యత్తులో భూగర్భజలాలపై తీవ్ర ప్రభావం పడుతుందని, వర్షాకాలంలో వరద ముప్పు పెరిగే అవకాశముందని, చెరువు పరిసర ప్రాంతాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి, చెరువు భూములను ఆక్రమణల నుంచి విముక్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

**అధికారుల తీరు సరికాదు**
**28వ వార్డు సిపిఐ కౌన్సిలర్, దండి రంగారావు**



చెరువు ఆక్రమణపై జిల్లా కలెక్టర్‌తో పాటు సంబంధిత అధికారులకు సిపిఐ ఆధ్వర్యంలో అనేక సార్లు ఫిర్యాదులు చేశాము. ఒకసారి అధికారులు వచ్చి సర్వే చేసి వెళ్లారు. అటు తర్వాత ఇంతవరకు ఎటువంటి అతీగతి లేదు. ఈ విషయంపై మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలోనూ పలుమార్లు ప్రస్తవించాను. ఇప్పటికైన అధికారులు చర్యలు తీసుకొని చెరువును రక్షించాలి.

**మంత్రి దృష్టిలో ఉంది**
**మున్సిపల్ కమిషనర్, ఆళ్ల శ్రీనివాస్‌రెడ్డి**



చెరువు అంశం విషయమై మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి దృష్టిలో ఉంది. వారి వద్ద నుంచి అధికారిక ఆదేశాలు వెలువడిన వెంటనే చెరువు అభివృద్ధిని చేపడతాము.

**ఫైల్ పెట్టమని చెప్పాను**
**తహశీల్దార్, వినయేందర్‌రెడ్డి**



చెరువు ఆక్రమణ విషయంపై ఫైల్ పెట్టాల్సిందిగా మా అధికారులకు సూచించాను. దీన్ని పూర్తి స్థాయిలో పరిశీలన చేసి ఇరిగేషన్ అధికారులను సమన్వయం చేసుకొని ఆక్రమణలు తొలగింపుకు కృషి చేస్తాను.

**సర్వేలు, నోటీసులకే పరిమితం...!**

చెరువు ఆక్రమణలపై ప్రజాపక్షం దినపత్రిక ప్రచురించిన కథనాలు, స్థానిక సిపిఐ పార్టీ చేపట్టిన పోరాటంతో అధికారులు ఎట్టకేలకు స్పందించారు. రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల ఆధ్వర్యంలో ట్రైనింగ్ లైసెన్స్‌డ్ సర్వేయర్లతో చెరువు పరిసర ప్రాంతాలను జల్లెడ పట్టించారు. ఈ సందర్భంగా సర్వేయర్లు పాయింట్ టూ పాయింట్ క్షుణ్ణంగా సర్వే నిర్వహించి, చెరువు భూమిలో కొన్ని ప్రాంతాలు ఆక్రమణకు గురైనట్లు గుర్తించారు. అనంతరం సంబంధిత ఆక్రమణదారులకు నోటీసులు జారీ చేసినట్లు తెలిసింది. అయితే అక్కడివరకే అధికారులు చర్యలకు పరిమితమయ్యారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. నోటీసులు అనంతరం ఆక్రమణల తొలగింపుపై ఎలాంటి స్పష్టమైన చర్యలు కనిపించకపోవడంతో ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

**కలెక్టర్ ఆదేశాలు బుట్టదాఖలేనా..?**


జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం తొలిసారిగా ఏదులాపురం పర్యటనకు వచ్చిన అనుదీప్ దూరిశెట్టి చెరువును ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా చెరువు విశిష్టత, నీటి నిల్వ, సామర్థ్యం, పరిసర పరిస్థితులపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. చెరువు ఆక్రమణలు తొలగించడంతోపాటు చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్ నిర్మించాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. అయితే కాలక్రమేణా ఆ ఆదేశాల అమలు ప్రశ్నార్థకంగా మారింది. జిల్లా కలెక్టర్‌గా అనుదీప్ దూరిశెట్టి బదిలీ కావడంతో ఆ అంశమే పూర్తిగా కనమరుగైన పరిస్థితి కనిపిస్తోంది. మరోవైపు మంత్రి పొంగులేటి కూడా పలు సభలు, సమావేశాల్లో చెరువు ఆక్రమణలను తొలగించి పేదలకు ఇళ్ల స్థలాలు అందిస్తామని ప్రకటించారు. అయినప్పటికీ క్షేత్రస్థాయిలో మాత్రం ఎలాంటి పురోగతి కనిపించడకపోవడం విస్తుగొలుపుతోంది. కలెక్టర్ ఆదేశాలు, మంత్రి హామీలు, ప్రజల ఫిర్యాదులున్నప్పటికీ చర్యలు ముందుకు సాగకపోవడం ఆలసత్వ పరిస్థితికి అద్దం పడుతోంది. చెరువు పరిరక్షణ అంశం ఎందుకు మరుగున పడుతోందా? అనే ప్రశ్న ప్రధాన చర్చగా మారింది. కలెక్టర్ చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## నీట్ లీక్‌పై 'ప్రధాన మంత్రి', 'మంత్రి ప్రధాన్'

# బాధ్యత వహించాలి

- ఎన్‌టిఎ 'నేషనల్ ట్రామా ఏజెన్సీ'గా మారింది
- ప్రభుత్వం పేపర్ లీక్ మాఫియాతో కుమ్మక్కవుతోంది : కాంగ్రెస్



**న్యూఢిల్లీ :** నీట్ పరీక్ష పేపర్ లీక్ కాలేదని ఎన్‌టిఎ (నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ) ఉన్నతాధికారులు చేసిన వాదనల నేపథ్యంలో కేంద్రంపై కాంగ్రెస్ తీవ్ర ఆరోపణలు చేసింది. ఈ అంశాన్ని కప్పిపుచ్చడానికి 'ప్రధాన మంత్రి', 'మంత్రి ప్రధాన్' ప్రయత్నిస్తున్నారని, ఇందుకు వీరిద్దరిని జవాబుదారీగా ఉండాలని డిమాండ్ చేసింది. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఒక 'నేషనల్ ట్రామా ఏజెన్సీ'గా మారిందని, అవకతవకలు, మోసాల నిజాన్ని అణచివేయడానికి ప్రభుత్వం పేపర్ లీక్ మాఫియాతో కుమ్మక్కవుతోందని కాంగ్రెస్ ఆరోపించింది. అసలు పరీక్షలో వచ్చిన ప్రశ్నలతో కూడిన ఒక 'గెస్ పేపర్' పరీక్ష తేదీకి ముందే విద్యార్థుల మధ్య ప్రచారంలో ఉందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ ఎక్స్‌లో పేర్కొన్నారు. 2018లో ఎన్‌టిఎ ఏర్పడినప్పటి నుండి, మోదీ ప్రభుత్వం, దాని అనుబంధ వర్గాలు, ఎన్‌టిఎ నిర్వహించే పరీక్షలలో విచ్చలవిడిగా జరుగుతున్న అవకతవకలు, మోసాల నిజాన్ని అణచివేయడానికి పేపర్ లీక్ మాఫియాతో కుమ్మక్కవుతున్నాయని ఆయన ఆరోపించారు. నీట్‌యుజి 2026 పరీక్ష లీక్ కాలేదని ఎన్‌టిఎ డైరెక్టర్ జనరల్ గురువారం పార్లమెంటరీ కమిటీ ముందు చెప్పినట్లు మీడియా నివేదికల ద్వారా తమకు తెలిసిందన్నారు. ఇదే నిజమైతే, ఇది అత్యంత అవమానకరమైనది, దిగ్భ్రాంతికరమైన అబద్ధమన్నారు. అసలు పరీక్షలో వచ్చిన డజన్ల కొద్దీ ప్రశ్నలతో కూడిన 'గెస్ పేపర్' పరీక్ష తేదీకి చాలా ముందే విద్యార్థుల మధ్య ప్రచారంలో ఉందని స్పష్టంగా తెలుస్తోందని, అది లీక్ కాకపోతే మరేమిటి? మోదీ ప్రభుత్వం ఇప్పుడెందుకు దానిని కాదనడానికి ప్రయత్నిస్తోంది?' అని రమేశ్ నిలదీశారు. నీట్‌యుజి 2024లో వెలుగులోకి వచ్చిన విస్తృతమైన అవకతవకలను కూడా మోదీ ప్రభుత్వం గతంలో కప్పిపుచ్చడానికి ప్రయత్నించిందని ఆయన ఆరోపించారు. అప్పుడే నిజాన్ని ఎదుర్కొని చర్య తీసుకుని ఉంటే, నీట్ 2026 విషాదాన్ని నివారించి ఉండవచ్చని సూచించారు. 2024లో వెలుగులోకి వచ్చిన రాజస్థాన్‌లోని సికార్ వంటి మోసాలకు సంబంధించిన అవే కీలక ప్రాంతాలు 2026 కుంభకోణంలో కూడా ప్రమేయం కలిగి ఉన్నాయన్నారు. మన దేశంలోని లక్షలాది మంది ఆశావహ యువతకు, ఎన్‌టిఎ ఒక జాతీయ మానసిక గాయాల సంస్థగా మారింది అని రమేశ్ అన్నారు. సిబిఎస్ఇ, ఎన్‌సిఇఆర్‌టి, విద్యా మంత్రిత్వ శాఖకు చెందిన ఇతర సంస్థలు (కేంద్ర విశ్వవిద్యాలయాలతో సహా) కూడా ఏమీ మెరుగ్గా లేవని ఆయన అన్నారు. వృత్తిపరమైన నైపుణ్యానికి విలువ లేకుండా, సైద్ధాంతిక అనుబంధానికి అధిక ప్రాధాన్యతనిచ్చే వ్యవస్థకు విద్యా శాఖ మంత్రి అధ్యక్షత వహిస్తున్నారని ఆరోపించారు. 'ఈ ఘోర విషాదానికి, దానిని కప్పిపుచ్చడానికి జరుగుతున్న ప్రయత్నాలకు ప్రధాన మంత్రి, మంత్రి ప్రధాన్ ఇద్దరూ జవాబుదారీగా ఉండాలి' అని రమేశ్ అన్నారు.

**పేపర్ లీక్ కాలేదు...**

అంతకుముందు నీట్‌యుజి ప్రశ్నాపత్రం తమ వ్యవస్థ ద్వారా లీక్ కాలేదని జాతీయ పరీక్షల సంస్థ (ఎన్‌టిఎ) డైరెక్టర్ జనరల్ (డిజి) అభిషేక్ సింగ్ వెల్లడించారు. అంతేగాకుండా పేపర్ లీక్‌కాలేదని, కొన్ని ప్రశ్నలు మాత్రమే బయటికొచ్చాయని తెలిపారు. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం, గురువారం పార్లమెంటరీ స్థాయీ సంఘం ఎదుట హాజరైన ఎన్‌టిఎ అధికారులు ఈ మేరకు చెప్పారు. పరీక్షల వ్యవస్థను బలోపేతం చేసేందుకు చేపట్టిన చర్యలపై అధికారులను పలువురు ఎంపిలు ఈ సందర్భంగా ప్రశ్నించారు. పేపర్ లీక్‌పై వారు ప్రశ్నించగా, తమ వ్యవస్థ ద్వారా కాలేదని సింగ్ వివరణ ఇచ్చారు. అలాంటప్పుడు ఎలా లీకైందని మళ్లీ నిలదీశారు. దీనిపై సిబిఐ దర్యాప్తు జరుపుతోందని ఆయన బదులిచ్చారు. దర్యాప్తు నివేదికను తమ ముందుంచాలని కొందరు ప్రతిపక్ష ఎంపిలు డిమాండు చేయగా, సిబిఐ స్వతంత్ర సంస్థ అని, దాని పనిని అడ్డుకోవద్దని స్థాయీ సంఘంలోని బిజెపి ఎంపిలు సూచించారు. భవిష్యత్ పరీక్షల నిర్వహణలో జాగ్రత్తల గురించి, ఎన్‌టిఎలో సిబ్బంది కొరతపై స్థాయీసంఘం ప్రశ్నలు సంధించింది. సమావేశానంతరం కమిటీ ఛైర్‌పర్సన్ దిగ్విజయ్ సింగ్ మాట్లాడుతూ, కమిటీ చర్చించిన విషయాలను వెల్లడించలేమని చెప్పారు.

## నీట్ పునఃపరీక్షను 100 శాతం

# లోపరహితంగా నిర్వహిస్తాం

- ఒక్క విద్యార్థి కూడా సీటును కోల్పోకూడదనేదే ప్రభుత్వ సంకల్పం : ప్రధాన్



**న్యూఢిల్లీ :** నీట్ యుజి పరీక్ష నిర్వహణలో అవకతవకలు వెలుగుచూసిన నేపథ్యంలో ప్రభుత్వం కఠిన నిర్ణయాలు తీసుకోవాల్సి వచ్చిందని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తెలిపారు. పరీక్షల మాఫియా కారణంగా ఒక్క అర్హత కలిగిన విద్యార్థి కూడా తమకు దక్కాల్సిన సీటును కోల్పోకూడదన్నదే అధికారుల సంకల్పమని ఆయన స్పష్టం చేశారు. జూన్ 21న నిర్వహించ తలపెట్టిన రీటెస్ట్ (పునఃపరీక్ష) 'వంద శాతం లోపరహితంగా' జరిగేలా చూడటానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని కూడా ఆయన నొక్కి చెప్పారు. శుక్రవారం ప్రధాన్ 'జాగరణ్ భారత్ ఎడ్యుకేషన్ కాంక్లేవ్ 2026'లో ప్రసంగిస్తూ, ఈ వైద్య ప్రవేశ పరీక్షకు సంబంధించిన వివాదం కారణంగా సుమారు 22 లక్షల మంది విద్యార్థులు తీవ్ర మానసిక వేదనకు గురయ్యారని, ఈ వ్యవస్థను సరిదిద్దడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రధాన్ పేర్కొన్నారు. 'ఇరవై రెండు లక్షల మంది విద్యార్థులు అపారమైన మానసిక వేదనను అనుభవించారు. ఆ వేదనను అర్థం చేసుకుని, బాధ్యత వహిస్తూనే నేను ఈ రోజు చెబుతున్నాను— మేము కొన్ని కఠిన నిర్ణయాలు తీసుకోవాల్సి వచ్చింది' అని ఆయన అన్నారు. కొన్ని పరీక్షా ప్రక్రియల్లో లోపాలు జరిగినట్లు గుర్తించిన తర్వాతే పరీక్షను రద్దు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని ప్రధాన్ తెలిపారు. విద్యా వ్యవస్థలోని అవకతవకలకు పాల్పడేవారి కుట్రల వల్ల, అలాగే పరీక్షల మాఫియా కారణంగా ఒక్క విద్యార్థి కూడా తమకు దక్కాల్సిన సీటును కోల్పోకూడదని తాము భావించామన్నారు. ఈ సమస్యను నిర్వహించిన తీరుపై వస్తున్న విమర్శలను మంత్రి అంగీకరించారు, అయితే ఈ సవాలును ఎదుర్కోవడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. 'మేము విమర్శలను, సవాళ్లను ఎదుర్కొంటున్నాము; ఆ విషయాన్ని నేను అంగీకరిస్తున్నాను. కానీ ఈ వ్యవస్థను సరిదిద్దడం మా బాధ్యత. సమస్యను చూసి కళ్లు మూసుకుని పక్కకు తప్పుకోవడం మా విధి కాదు' అని ఆయన అన్నారు. వైద్య కోర్సుల్లో ప్రవేశాల కోసం మే 3న నిర్వహించిన 'నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్' (అండర్ గ్రాడ్యుయేట్) పరీక్షను, పేపర్ లీకేజీ ఆరోపణల నేపథ్యంలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌డిఎ) ఇటీవల రద్దు చేసింది. ఈ వ్యవహారంపై సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సిబిఐ) దర్యాప్తు జరుపుతోంది, అలాగే జూన్ 21న పునఃపరీక్ష నిర్వహించడానికి షెడ్యూల్ ఖరారైంది.

## ఎవరెస్ట్ దిగుతూ ఇద్దరు భారతీయ పర్వతారోహకులు మృతి




**కాఠ్మాండూ :** ఎవరెస్ట్ పర్వత శిఖరంపై విషాదం చోటుసేసుకుంది. పర్వతారోహణ ముగించుకుని కిందకు దిగివస్తుండగా ఇద్దరు భారతీయులు ప్రాణాలు కోల్పోయినట్టు నేపాల్ అధికారులు ప్రకటించారు. మృతులను అరుణ్‌కుమార్ తివారీ, సందీప్ అరేగా గుర్తించారు. ఎవరెస్ట్ శిఖరం దిగుతుండగా సందీప్ అరే తీవ్రంగా అలసిపోయారని, ఆయనను కాపాడేందుకు గైడ్స్ ప్రయత్నించినప్పటికీ ప్రాణాలను కాపాడలేకపోయారని ఎక్స్‌పెడిషన్ ఆపరేటర్స్ అసోసియేషన్ ఆఫ్ నేపాల్ సెక్రటరీ జనరల్ రిషి భండారి తెలిపారు. గురువారం సాయంత్రం 5.30 గంటల సమయంలోనే మరో పర్వతారోకుడు అరుణ్ తివారీ కూడా ఎవరెస్ట్ నుంచి కిందకు దిగుతూ హిల్లరీ స్టెప్ వద్ద తీవ్రంగా అలసిపోవడంతో నలుగురు గైడ్స్ ఆయనకు సాయం చేసినప్పటికీ ఫలితం లేకపోయిందని చెప్పారు. క్యాంప్2 వద్ద ఆయన కన్నుమూసినట్టు వివరించారు. ఎవరెస్ట్ శిఖరాన్ని గత బుధవారంనాడు విజయవంతంగా 274 మంది అధిరోహించారు. ఒకేరోజు అత్యధిక సంఖ్యలో ఎవరెస్ట్ అధిరోహించిన బృందంగా కూడా వీరు రికార్డు నెలకొల్పారు. ఇందులో సందీప్ అరే కూడా అన్నారు.

## బంగ్లాదేశ్ బోర్డర్ వెంబడి

# 'స్మార్ట్ సరిహద్దు' ప్రాజెక్టు


### చొరబాట్లను అరికట్టేందుకే ఈ చర్య : అమిత్ షా



**న్యూఢిల్లీ :** పాకిస్థాన్, బంగ్లాదేశ్‌తో ఉన్న 6,000 కిలోమీటర్ల సరిహద్దును పటిష్టంగా మార్చడానికి కేంద్రం నిర్ణయం తీసుకుంది. ఆ ప్రాంతాల జనాభా స్వరూపాన్ని మార్చే కుట్రలకు చెక్ పెట్టే విధంగా వచ్చే ఏడాదిలో 'స్మార్ట్ బోర్డర్' ప్రాజెక్టును ప్రారంభించనుంది. ఈ మేరకు కేంద్ర హోంమంత్రి అమిత్ షా శుక్రవారం ఈ విషయాన్ని వెల్లడించారు. ఢిల్లీలో బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ (బిఎస్‌ఎఫ్) నిర్వహించిన వార్షిక రుస్తమ్జీ మెమోరియల్ సమావేశానికి హాజరయ్యారు. సరిహద్దు చొరబాట్లపై జీరో టాలరెన్స్ విధానాన్ని ప్రకటిస్తూ, ప్రతి అక్రమ వలసదారుడిని వెనక్కి పంపడమే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకుందన్నారు. 'బిఎస్‌ఎఫ్ ఏర్పడిన 60వ సంవత్సరంలో మేము ఈ స్మార్ట్ బోర్డర్ ప్రాజెక్టును ప్రారంభించనున్నాం. పాకిస్థాన్, బంగ్లాదేశ్ సరిహద్దులను అభేద్యంగా మారుస్తామని బిఎస్‌ఎఫ్ దళాలకు నేను హామీ ఇస్తున్నాను. వచ్చే ఏడాదిలోగా పాకిస్థాన్, బంగ్లాదేశ్ సరిహద్దుల వెంబడి 'బలమైన భద్రతా గ్రిడ్‌ను ఏర్పాటు చేయాలని మోదీ ప్రభుత్వం నిర్ణయించింది. స్మార్ట్ సరిహద్దుకు సాంకేతికత, డ్రోన్లు, రాడార్లు, స్మార్ట్ కెమెరాలు సహాయపడతాయి. ఒక సమస్యను నియంత్రించడం భద్రత కాదు. దానిని మూలాల నుంచి నిర్మూలించడమే నిజమైన విధానం. బీఎస్‌ఎఫ్ ఇప్పుడు చొరబాటుకు వ్యతిరేకంగా అదే దృఢ సంకల్పంతో ముందుకు సాగాలి' అని అమిత్ షా స్పష్టం చేశారు. దేశంలోకి చొరబడిన ప్రతి ఒక్కరినీ గుర్తించి, వారిని భారతదేశం వెలుపలికి పంపిస్తామని అమిత్ షా మరోసారి ఉద్ఘాటించారు. చొరబాటు, పశువుల అక్రమ రవాణా మార్గాలను గుర్తించి, వాటిని అరికట్టేందుకు రాష్ట్ర పోలీసులు, జిల్లా కలెక్టర్లు, గ్రామ అధికారులతో నేరుగా సమన్వయం చేసుకుంటూ తమ నిఘా వ్యవస్థను విస్తరించాలని బిఎస్‌ఎఫ్‌ను కోరారు. బెంగాల్, అసోం, త్రిపుర ప్రభుత్వాలతో సమన్వయం చేసుకుంటే ఈ భద్రతా వ్యవస్థను సులభతరం చేసుకోవచ్చని అన్నారు. ఈ మేరకు మూడు రాష్ట్రాల ముఖ్యమంత్రులతో హోం మంత్రిత్వ శాఖ త్వరలో సమావేశం కానుందని వివరించారు. గతంలో ప్రకటించిన ఉన్నత స్థాయి జనాభా మిషన్‌ను కేంద్ర ప్రభుత్వం త్వరలో ప్రకటిస్తుందని తెలిపారు.

## ప్రభుత్వంలో చేరిన విసికె, ఐయుఎంఎల్

- తమిళనాడులో మరోసారి మంత్రివర్గ విస్తరణ
- మంత్రులుగా ప్రమాణం చేసిన షాజహాన్, వన్ని అరుసు
- కేబినెట్‌లో 35కు చేరిన మంత్రుల సంఖ్య



**చెన్నై :** తమిళనాడులో కొత్తగా ఏర్పడిన టివికె ప్రభుత్వంలో ఐయుఎంఎల్, విసికె పార్టీలు చేరాయి. శుక్రవారం లోక్‌భవన్‌లో జరిగిన ఒక సాధారణ కార్యక్రమంలో ఐయుఎఎల్‌కు చెందిన శాసనసభ్యుడు ఎంఎం షాజాహన్, విసికెకు చెందిన వన్ని అరుసులతో గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ ఆర్లేకర్ మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేయించారు. టివికె ప్రభుత్వంలో ఇద్దరు కాంగ్రెస్ సభ్యులు మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేయడంతో, ప్రస్తుత అధికార కూటమిలోని మిత్రపక్షాల సంఖ్య నాలుగుకు చేరింది. ఇది తమిళనాడులో కూటమి రాజకీయాల స్వరూపాన్ని పూర్తిగా మార్చివేస్తూ, సంకీర్ణ ప్రభుత్వ పాలనను సూచిస్తోంది. 2026 అసెంబ్లీ ఎన్నికల వరకు డిఎంకెకు మిత్రపక్షాలుగా కొనసాగిన ఈ రెండు పార్టీలను ఉద్దేశించి, డిఎంకె నాయకుడు ఎ. రాజా చేసిన వ్యంగ్య వ్యాఖ్యల మధ్య షాజహాన్, వన్ని అరసు ఇద్దరూ మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. డిఎంకెకు దీర్ఘకాలిక మిత్రపక్షాలుగా ఉన్న విసికె, ఐయుఎంఎల్, ప్రభుత్వం ఏర్పాటుకు అవసరమైన సంఖ్యాబలం టివికెకు సరిపోనప్పుడు, ఆ పార్టీకి తమ మద్దతును అందించాయి. ఈ రెండు పార్టీలు టివికె మంత్రివర్గంలో చేరడాన్ని 'పొరుగువారి వైపు వంగే కొబ్బరి చెట్టుతో' పోల్చిన డిఎంకె ఉప ప్రధాన కార్యదర్శి, ఎక్స్ వేదికగా ఒక ప్రశ్న సంధించారు. 'పొరుగువారికి కొబ్బరికాయలను అందించేందుకు వంగే కొబ్బరి చెట్టు లాగే, ఇతరులకు ప్రయోజనం చేకూర్చడానికి ప్రయత్నించే వారికి ఏ పేరు పెట్టాలి? అని అన్నారు. కాగా, పాపనాశం అసెంబ్లీ నియోజకవర్గం నుండి విజయం సాధించిన షాజహాన్, దిండివనం నియోజకవర్గం నుండి గెలుపొందిన వన్ని అరసు, లోక్ భవన్‌లో ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్ సమక్షంలో మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. విజయ్ నేతృత్వంలోని మంత్రివర్గంలో ఈ ఇద్దరు ఎమ్మెల్యేల చేరికతో, ముఖ్యమంత్రితో కలిపి మొత్తం మంత్రుల సంఖ్య 35కు చేరింది. షాజహాన్‌కు మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి పదవిని కేటాయించగా, విసికె నాయకుడు వన్ని అరసును సామాజిక న్యాయ శాఖ మంత్రిగా నియమించారు.

## బిజెపి పాలన యుపిని

# దయనీయస్థితిలోకి నెట్టింది

### విద్యుత్ సంక్షోభంపై యోగి సర్కార్‌పై ఎస్‌పి, బిఎస్‌పి మండిపాటు




**లక్నో :** ఉత్తరప్రదేశ్‌లో విద్యుత్ సంక్షోభం ఏర్పడింది. ఈ అంశంపై సమాజ్‌వాదీ పార్టీ (ఎస్‌పి), బహుజన్ సమాజ్ పార్టీ (బిఎస్‌పి) సహా ప్రతిపక్ష పార్టీలు బిజెపి ప్రభుత్వాన్ని విమర్శించాయి.రాష్ట్ర వ్యాప్తంగా విద్యుత్ సరఫరాను మెరుగుపరచడానికి తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశాయి. విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని విస్తరించడంలో ప్రభుత్వం విఫలమైందని ఎస్‌పి అధినేత అఖిలేశ్ యాదవ్ ఆరోపించారు. విద్యుత్ పరిస్థితిని ప్రభుత్వం నిర్వహించిన తీరుపై కూడా ఆయన విమర్శలు గుప్పించారు. 'కొత్త విద్యుత్ ప్లాంట్లను ఏర్పాటు చేయడం మీ (బిజెపి) సామర్థ్యంలోనూ లేదు, మీ సంకుచిత ఆలోచనా పరిధిలోనూ లేదు. కనీసం '3x660 సూపర్ క్రిటికల్ థర్మల్ పవర్ ప్లాంట్' అని అయినా మీరు చెప్పి ఉండవచ్చు; ఆ మాట విన్నా కూడా మండుటెండలో బాధపడుతున్న ప్రజలకు కొంత ఉపశమనం కలిగేది' అని అఖిలేశ్ ఎక్స్ బ్లాగ్‌లో పోస్ట్‌లో రాశారు. యుపిలోని బిజెపి ప్రభుత్వం కింద, విద్యుత్ సరఫరా కాదు, కేవలం డిమాండ్ ధర మాత్రమే పెరుగుతున్నాయని ఆయన ఆరోపించారు. బిజెపి పాలన ఉత్తరప్రదేశ్‌ను దయనీయ స్థితిలోకి నెట్టిందని మండిపడ్డారు. తీవ్రమైన వేసవి పరిస్థితుల మధ్య విద్యుత్ సరఫరా కొరత, తరచూ విద్యుత్ కోతలపై బిఎస్‌పి అధినేత్రి మాయావతి కూడా ఆందోళన వ్యక్తం చేశారు. ఉత్తర ప్రదేశ్ వంటి అధిక జనాభా గల రాష్ట్రంలో వేసవి ఉధృత కాలంలో తక్కువ విద్యుత్ సరఫరా, విద్యుత్ కోతలపై ఫిర్యాదులు సర్వవ్యాప్తంగా ఉన్నాయని ఆమె ఎక్స్ వేదిగా విమర్శించారు. ఈ పరిస్థితి ముఖ్యంగా పేదలు, మధ్యతరగతి ప్రజలు, రైతులు, చిన్న వ్యాపారులు, ఇతర శ్రామికుల జీవితాలను అత్యంత కష్టతరం చేసిందని ఆమె అన్నారు. ప్రజలు వివిధ రూపాల్లో తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నారని, ఈ అంశంపై మీడియాలో విస్తృతంగా చర్చ జరుగుతోందని మాయావతి తెలిపారు. విద్యుత్ సంబంధిత సమస్యల వల్ల ప్రజలు ఎదుర్కొంటున్న కష్టాలు, అసౌకర్యాలను పరిష్కరించడానికి ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు. కొత్త విద్యుత్ ప్లాంట్లను ఏర్పాటు చేయడం, ఇతర అవసరమైన చర్యలు తీసుకోవడం ద్వారా విద్యుత్ సరఫరా పరిస్థితిని మెరుగుపరచాలని ఆమె ప్రభుత్వాన్ని కోరారు. ఇటువంటి చర్యలు విస్తృత ప్రజా ప్రయోజనాలకు దోహదపడతాయని ఆమె పేర్కొన్నారు.

## భారత్, సైప్రస్ సంబంధాలు

# వ్యూహాత్మక భాగస్వామ్య స్థాయికి..

### ఇరు దేశాలు కొత్త ఆశయాలు, కొత్త వేగాన్ని అందించడానికి సిద్ధమయ్యాయి : మోదీ



**న్యూఢిల్లీ :** భారత్, సైప్రస్‌లు తమ సంబంధాలను వ్యూహాత్మక భాగస్వామ్య స్థాయికి పెంచుకున్నాయని ప్రధానమంత్రి నరేంద్రమోదీ వెల్లడించారు. భారత్, సైప్రస్ అనుబంధం కాల పరీక్షలో పదేపదే నిలుస్తూ వచ్చిందని ఆయన తెలిపారు. ఇప్పుడు భారత్–సైప్రస్ వ్యూహాత్మక భాగస్వామ్యం ఏర్పాటుతో ఇరుదేశాల సంబంధాలకు కొత్త ఆశయాలు, కొత్త వేగాన్ని అందించడానికి సిద్ధమయ్యామని చెప్పారు. ఈనెల 20 నుంచి భారత పర్యటనలో ఉన్న సైప్రస్ అధ్యక్షుడు నికోస్ క్రిస్టోడౌలిడెస్, శుక్రవారం ఢిల్లీలోని హైదరాబాద్ హౌస్‌లో ప్రధాని మోదీతో భేటీ అయ్యారు. ఈ ద్వైపాక్షిక సమావేశం అనంతరం నిర్వహించిన సంయుక్త మీడియా సమావేశంలో భారత ప్రధాని ప్రసంగించారు. గత దశాబ్ద కాలంలో భారత్‌లోకి సైప్రస్ పెట్టుబడులు దాదాపు రెట్టింపు అయ్యాయని, ఇది ఇరుదేశాల మధ్య పెరుగుతున్న నమ్మకానికి నిదర్శనమని నరేంద్ర మోదీ తెలిపారు. ఇటీవలే భారత్ యూరోపియన్ యూనియన్ (ఇయు) మధ్య కుదిరిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం రానున్న రోజుల్లో భారత్ సైప్రస్‌లకు కొత్త అవకాశాలను సృష్టిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. దీని ఊతంతో రాబోయే ఐదేళ్లలో పెట్టుబడులను రెట్టింపు చేయాలనే లక్ష్యాన్ని ఇరుదేశాలు పెట్టుకున్నాయని చెప్పారు. భారత్, సైప్రస్‌లు డిజిటల్ మౌలిక సదుపాయాలు, ఫిన్‌టెక్ నిర్వాహక వ్యవస్థలు, రీసెర్చ్ హబ్‌లు వంటి విభాగాలతో ముడిపడిన పలు అవగాహనా ఒప్పందాల(ఎంఒయు)పై సంతకాలు చేశాయని ప్రధాని వెల్లడించారు. సంస్థాగత సహకారాలు, విద్యార్థి మార్పిడి కార్యక్రమాలు, ఉమ్మడి శాస్త్రీయ పరిశోధనలను ప్రోత్సహించడంపైనా ఎంఒయులు కుదిరాయన్నారు. ఇరుదేశాల మధ్య చట్టబద్ధమైన వలసలను ప్రోత్సహించే, అక్రమ వలసలను అరికట్టే ఒప్పందం ఖరారుకు దృఢమైన ఏకాభిప్రాయాన్ని సాధించడంపైనా ఫోకస్ పెట్టాలని నిర్ణయించినట్లు మోదీ తెలిపారు. భారత్ సైప్రస్ మధ్య రాకపోకలు సాగించే వృత్తి నిపుణుల హక్కుల పరిరక్షణకు త్వరలోనే ఒక సామాజిక భద్రతా ఒప్పందాన్ని కుదుర్చుకోవాలని నిర్ణయించామన్నారు.

**ఉగ్రవాదం కట్టడికి జాయింట్ వర్కింగ్ గ్రూప్**

'ఉగ్రవాదం కట్టడి కోసం ఒక జాయింట్ వర్కింగ్ గ్రూప్‌ను ఏర్పాటు చేసే అంశంపై భారత్ సైప్రస్ మధ్య ఎంఒయు కుదిరింది. తీవ్రవాద భావజాలం, సరిహద్దు ముప్పులను ఎదుర్కోవడానికి ఈ జాయింట్ వర్కింగ్ గ్రూప్ పనిచేస్తుంది. సైబర్ భద్రత, సముద్ర భద్రత, ఉగ్రవాద నిరోధక నెట్‌వర్క్‌ల బలోపేతం, లక్షిత రక్షణ విస్తరణలలోనూ ఇరుదేశాలు కలిసి పనిచేస్తాయి. భారత్, సైప్రస్‌ల మధ్య స్నేహం బలమైనది. ఇది భవిష్యత్ దృష్టితో కూడుకున్నది. ప్రజాస్వామ్యం, చట్టబద్ధమైన పాలన వంటి విలువలకు కట్టుబడి ఉండాలనే ఉమ్మడి నిబద్ధతపై మా భాగస్వామ్యం ఆధారపడి ఉంది. మేం అన్ని దేశాల సార్వభౌమత్వాన్ని, ప్రాదేశిక సమగ్రతను ప్రగాఢంగా గౌరవిస్తాం. ఈ సూత్రాలను పరిరక్షించడానికి భారతదేశం కట్టుబడి ఉంది' అని ప్రధాని మోదీ తెలిపారు.

## ట్విషా శర్మ మృతి కేసు.. కోర్టులో లొంగిపోయిన భర్త

### రెండోసారి పోస్టుమార్టం చేయాలని కోర్టు ఆదేశం



**భోపాల్:** మధ్యప్రదేశ్‌లో తీవ్ర సంచలనం సృష్టించిన నోయిడా నటి ట్విషా శర్మ మృతి కేసులో కీలక పరిణామం జరిగింది. ట్విషా మృతదేహానికి మరోసారి పోస్టుమార్టం చేయాలని మధ్యప్రదేశ్ హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ట్విషా మృతదేహానికి రెండోసారి పోస్టుమార్టం చేయాలని ఆమె కుటుంబం దిగువ న్యాయస్థానాన్ని ఆశ్రయించగా వారి అభ్యర్థనను కోర్టు తిరస్కరించింది. దీంతో వారు మధ్యప్రదేశ్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ జరిపిన ఉన్నత న్యాయస్థానం మరోసారి పోస్టుమార్టం చేయాలని ఆదేశించింది. ఢిల్లీ ఎయిమ్స్ వైద్యులతో పోస్టుమార్టం జరిపించాలని కోర్టు వెల్లడించింది. అయితే ఈ ప్రక్రియ అంతా భోపాల్‌లోనే జరుగుతుందని పేర్కొంది. ఎయిమ్స్ వైద్యులను ప్రత్యేక విమానంలో భోపాల్‌కు రప్పించి, వీలైనంత త్వరగా రెండో పోస్టుమార్టం చేయాలని హైకోర్టు స్పష్టం చేసింది. మరోవైపు, ట్విషా శర్మ మృతి కేసులో గత పదిరోజులుగా పరారీలో ఉన్న ప్రధాన నిందితుడు, ఆమె భర్త సమర్థ్ సింగ్ శుక్రవారం జబల్‌పుర్ జిల్లా కోర్టులో లొంగిపోయాడు. మధ్యప్రదేశ్ హైకోర్టులో దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌ను ఉపసంహరించుకున్న గంటవ్యవధిలోనే ఈ పరిణామం జరిగింది. కాగా, బాధితురాలి తరపు న్యాయవాది అనురాగ్ శ్రీవాస్తవ మాట్లాడుతూ, నిందితుడు భోపాల్‌లోని విచారణ కోర్టు లేదా దర్యాప్తు అధికారి ఎదుట లొంగిపోవాల్సిందని అన్నారు. 'ట్రయల్ కోర్టు భోపాల్‌లో ఉంది, దర్యాప్తు అధికారి కూడా భోపాల్‌లోనే ఉన్నారు. కాబట్టి, అతను లొంగిపోవాలనుకుంటే, ట్రయల్ కోర్టులో లేదా దర్యాప్తు అధికారి ముందు లొంగిపోవాలి' అని ఆయన అన్నారు. మరోవైపు, ట్విషా శర్మ అత్తగారైన గిరిబాల సింగ్‌కు దిగువ కోర్టు మంజూరు చేసిన ముందస్తు బెయిల్‌ను వ్యతిరేకిస్తూ, మధ్యప్రదేశ్ హైకోర్టు శుక్రవారం ఉదయం నోటీసు జారీ చేసింది.

**కేసును సిబిఐకి అప్పగించిన ప్రభుత్వం**

ఇదిలా ఉండగా, ఈ కేసును మధ్యప్రదేశ్ ప్రభుత్వం సిబిఐకి అప్పగించింది. కేసు దర్యాప్తును సిబిఐకి బదిలీ చేస్తూ మధ్యప్రదేశ్ హోంశాఖ కార్యదర్శి కృష్ణవేణి దేశావతు అధికారిక నోటిఫికేషన్ విడుదల చేశారు. మే 12వ తేదీన భోపాల్‌లోని కటారా హిల్స్ ప్రాంతంలో ఉన్న తన అత్తవారింట్లో 33 ఏళ్ల ట్విషా శర్మ ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించింది. అదనపు కట్నం కోసం అత్తమామలు వేధించడం వల్లే తమ కుమార్తె ప్రాణాలు కోల్పోయిందని ట్విషా తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. అయితే, ట్విషా శర్మకు డ్రగ్స్ అలవాటు ఉందని, ఆ కారణం వల్లే ఆత్మహత్య చేసుకుందని ఆమె అత్తవారింటి సభ్యులు వాదిస్తున్నారు. ఈ ఘటనపై స్పందించిన భోపాల్ పోలీసులు ట్విషా భర్త సమర్థ్ సింగ్, అత్త గిరిబాల సింగ్‌లపై భారతీయ న్యాయ సంహితలోని పలు సెక్షన్ల కింద కేసులతో పాటు కట్న వేధింపుల నిరోధక చట్టం కింద ఎఫ్ఐఆర్ నమోదు చేశారు.

## పులి దాడిలో నలుగురు మహిళలు మృతి

**చంద్రాపూర్:** మహారాష్ట్రలోని చంద్రపూర్‌జిల్లాలో శుక్రవారం ఉదయం తునికి ఆకులను సేకరిస్తున్న నలుగురు మహిళలను పులి చంపింది. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం మహిళల బృందం అడవిలోని ఒక ప్రాంతానికి తునికి ఆకులు సేకరించేందుకు వెళ్లింది. ఈ ఆకులను ప్రధానంగా బిడిల తయారీలో ఉపయోగిస్తారు. వారు ఆకులు సేకరిస్తుండగా పులి దాడి చేసి వారిలో నలుగురిని చంపింది. మరణించిన మహిళలు కావడాబాయి మొహుర్లే (45), అనితాబాయి మొహుర్లే (40), సునీత మొహుర్లే (38), సంగీతాచౌదరి (50)అని , వీరంతా గుంజేవాహి గ్రామ నివాసులు అన్నారు. పులి ఒకే ప్రదేశంలో, ఒకేసారి ఈ నలుగురిపై దాడి చేసిందా లేదా వేర్వేరు ప్రదేశాల్లో దాడి చేసిందా అన్నది వెంటనే స్పష్టంకాలేదు. సమాచారం అందుకున్న వెంటనే అటవీ శాఖ అధికారులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. పంచనామా అనంతరం మరిన్ని వివరాలు తెలుస్తాయన్నారు.


**CHANGE OF NAME**

I, **THOKALA SUSMITHA W/o. Jagan,** R/o.H.No. 2-173, Seethampet (vill), Hasanparthy(mdl), Hanamkonda(Dist),T.G.I have changed my Name **BANDA SUSMITHA** (Old name) to **THOKALA SUSMITHA** (New name) for all future purpose.

SHRIRAM Finance **వాహనముల బహిరంగ వేలం ప్రకటన**

సమస్త ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా ఈ క్రింది వాహనములు వాయిదాలు సకాలంలో చెల్లించని కారణంగా స్వాధీనపరుచుకున్న వాహనములు ఉన్నవి ఉన్నట్లుగా వేలం ద్వారా విక్రయించుటకు నిర్ణయించబడినది.

| S.No | VEHICLE NO | Customer Name | MAKE & MODEL | YEAR |
|---|---|---|---|---|
| 1 | TS27T 3053 | Bhukya Ramesh | MARUTHI DZIRE TOUR DIESEL-P | 2018 |
| 2 | TS15UA 0346 | Chinnam Ravi | CHEVROLET TAVERA NEO-P | 2014 |
| 3 | TS27D 7977 | Ashok Tadem | JOHN DEERE 5105 | 2020 |
| 4 | TS11EN 6971 | Sathish Babu B | ERTIGA VDI BS4 DIESEL 7 SEATER | 2018 |
| 5 | TS09FH 6047 | Pandineni Sravan | ERTIGA ZDI BS4 DIESEL 7 SEATER | 2013 |

**AUCTION DATE:23-05-2026**

VENUE : SHRIRAM AUTOMALL INDIA LTD, PUNNEL CROSS ROAD, BOLLIKUNTA, WARANGAL

గమనిక : వేలం తేది ప్రకటన నుండి బండి అమ్ముడు అయే వరకు వర్తించును

**SHRIRAM FINANCE LIMITED**

H.No.6-2-7/35-B, 3rd Floor, Hyderabad Raod, Jangaon. Cell - 9000014364 , 98499 11793



## హోండూరస్‌లో కాల్పుల కలకలం

### రెండు వేర్వేరు ఘటనల్లో 25 మంది మృతి

**తెగుసిగల్ప:** అమెరికా దేశమైన హోండూరస్‌లో కాల్పులు కలకలం రేపాయి. రెండు వేర్వేరు ఘటనల్లో ఆరుగురు పోలీసు అధికారులు సహా 25 మంది ప్రాణాలు కోల్పోయారు. ఉత్తర హోండూరస్‌లోని ట్రుజిల్లో మున్సిపాలిటీ పరిధిలోని తోటలో పనిచేస్తున్న కార్మికులపై దుండగులు కాల్పులు జరపగా 19 మంది చనిపోయారు. సాగు భూమి వివాదం కారణంగా కాల్పులు జరిగినట్లు తెలిసింది. సమాచారం. గ్వాటెమాలా సరిహద్దుల్లో పోలీస్ కాన్వాయ్‌పై సాయుధులు కాల్పులు జరపడంతో ఆరుగురు అధికారులు మరణించారు. ప్రాణాలు కోల్పోయిన అధికారులు అక్కడి ముఠాల నిరోధానికి చేపట్టిన మిషన్‌లో భాగస్వాములుగా ఉన్నతాధికారులు తెలిపారు.

# ఇజ్రాయెల్ కఠినత్వం

### గాజాకు మానవతా సాయానికి అడ్డంకి
### కార్యకర్తల చేతులకు బేడీలు వేసి...
### మోకాళ్లపై కూర్చోపెట్టిన వైనం
### తమ పౌరులకు అవమానంపై ఇటలీ ఆగ్రహం

**రోమ్:** ఆకలితో అలమటిస్తున్న గాజాలో ప్రజలకు మానవతా దృక్పధంతో సాయం చేద్దామని వెళ్లిన బందాన్ని ఇజ్రాయెల్ సైనికులు అడ్డుకున్నారు. సముద్ర మార్గంలో వెళ్లిన కార్యకర్తలతో దారుణంగా ప్రవర్తించారు. నౌకలో ఉన్న అంతర్జాతీయ మానవతావాద కార్యకర్తలతో పాటు ఇటలీ పౌరులను తుపాకులలో బెదిరించింది అదుపులోకి తీసుకున్నారు. చేతులను వెనక్కి విరిచి కట్టేశారు. వారందరిని బలవంతంగా మోకాళ్లపై కూర్చోబెట్టి, నుదుటిని నేలకు ఆనించి ఉంచేలా చేశారు. ఈ అవమానకరమైన దశ్యాలు బయటకు రావడం వివాదానికి తెరతీసింది. ఇజ్రాయెల్ సైనిక అమానవీయ ప్రవర్తనపై విమర్శలు వెల్లువెత్తాయి. దయతో సాయం అందించే సదుద్దేశంతో వెళ్లిన వారితో నేరస్థుల కంటే హీనంగా ప్రవర్తించడంపై తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తమైంది. దీనిపై ఇటలీ ప్రభుత్వం తీవ్రంగా స్పందించింది. ఇటలీ ప్రధాన మంత్రి జార్జియా మెలోనీ మండిపడ్డారు. తమ దేశ పౌరులను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. వారిని అవమా



నించినందుకు అధికారికంగా క్షమాపణ చెప్పాలని ఇజ్రాయెల్ సైన్యానికి స్పష్టంచేశారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియోను ఇజ్రాయెల్ అంతర్గత భద్రతా మంత్రి, తీవ్ర జాతీయవాద నాయకుడు ఇటమార్ బెన్ గ్విర్ పోస్ట్ చేశారు. మెలోనీ స్పందిస్తూ ప్రజాస్వామ్య దేశంగా చెప్పుకునే ఇజ్రాయెల్ అంతర్జాతీయ నిబంధనలను కాలరాస్తూ మానవతా కార్యకర్తలను వేధించడం ఏమిటని నిలదీశారు. ఇటలీ పౌరుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా ప్రవర్తించిన సైన్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇజ్రాయెల్‌పై అంతర్జాతీయ సమాజం ఒత్తిడికి పిలుపునిచ్చారు. దీంతో ఇజ్రాయెల్ ఇటలీ దౌత్యబంధం బీటలు వారినట్లయింది.




## చైనాతో దౌత్య బంధానికి 75 ఏళ్లు

### స్మారక నాణెం విడుదల చేయనున్న పాకిస్థాన్
### నేడు బీజింగ్‌కు ప్రధాని షెహబాజ్ షరీఫ్


**ఇస్లామాబాద్:** చైనాతో తమ దౌత్య బంధానికి 75 ఏళ్లు అయిన సందర్భంగా 75 పాకిస్థానీ రూపాయల ప్రత్యేక స్మారక నాణెం విడుదల చేయనున్నట్లు పాకిస్థాన్ ప్రకటించింది. దీర్ఘకాలిక వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత పెంచుకోవాలని రెండు దేశాలు నిర్ణయించాయి. 1951లో చైనా, పాకిస్థాన్ మధ్య దౌత్య సంబంధాలు ఏర్పడ్డాయి. బీజింగ్‌తో సంబంధం కలుపుకున్న మొదటి ముస్లిం దేశంగా పాకిస్థాన్ నిలిచింది. కాగా, చైనా పాక్ బృందానికి 75 ఏళ్లు అయిన సందర్భంగా విడుదల చేయబోయే స్మారక నాణెం ఈనెల 25 నుంచి ప్రజలకు అందుబాటులోకి వస్తుందని ది స్టేట్ బ్యాంక్ ఆఫ్ పాకిస్థాన్ ప్రకటించింది. కాగా, పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ శనివారం చైనా పర్యటనకు బయల్దేరతారు. 26వ తేదీ వరకు అక్కడే ఉంటారు. తమ దౌత్య బంధాన్ని వేడుక చేసుకునేందుకు ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో షెహబాజ్ పాల్గొంటారు.

### బంగ్లాదేశ్‌కు బహిష్కరించిన కొంతమందిని...

# తిరిగి భారత్‌కు రప్పించాలని నిర్ణయించాం

### 'సుప్రీం'కు తెలిపిన కేంద్రం

**న్యూఢిల్లీ :** గతంలో బంగ్లాదేశ్‌కు బహిష్కరించబడిన కొంతమందిని తిరిగి భారతదేశానికి రప్పించాలని, ఆ తర్వాత వారి భారత పౌరసత్వ వాదనను ధృవీకరించాలని నిర్ణయించినట్లు కేంద్రం శుక్రవారం సుప్రీంకోర్టుకు తెలిపింది. కేంద్రం తరపున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహ‌తా ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ.. ఈ కేసులోని విలక్షణమైన వాస్తవాలు, పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని, దీనిని ఇతర విషయాలలో అనుసరించాల్సిన పూర్వ ఉదాహరణగా పరిగణించకుండా ప్రభుత్వం వారిని తిరిగి తీసుకురావాలని నిర్ణయించిందని వివరించారు. 'ప్రభుత్వం వారిని తిరిగి తీసుకువచ్చి, ఆ తర్వాత వారి పరిస్థితిని పరిశీలిస్తుంది. ఫలితాలను బట్టి మేము తదనుగుణంగా చర్యలు తీసుకుంటాం'అని ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చి, విపుల్ ఎం పాంచోలి త్రిసభ్య ధర్మాసనానికి వివరించారు. ఈ వ్యక్తులను భారతదేశానికి తిరిగి తీసుకురావడానికి 8 నుంచి 10 రోజుల సమయం పట్టవచ్చని ఉన్నత న్యాయ అధికారి అయిన తుషార్ మెహ‌తా తెలిపారు. ధర్మాసనం ఈ విషయంపై విచారణ జరిపేందుకు జూలై మాసానికి వాయిదా వేసింది. సునాలీ ఖాతున్, ఇతరులను బంగ్లాదేశ్‌కు బహిష్కరించాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని 'చట్ట విరుద్ధం'గా పేర్కొంటూ, 2025 సెప్టెంబరు 26న కలకత్తా హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వును సవాల్ చేస్తూ కేంద్రం దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు విచారణ జరుపుతోంది. గతేడాది డిసెంబరు 3న సునాలీ ఖాతూన్, ఆమె 8ఏళ్ల బిడ్డను బంగ్లాదేశ్‌లోకి నెట్టివేయబడిన కొన్ని నెలల తర్వాత వారిని భారతదేశంలోకి ప్రవేశించడానికి సుప్రీంకోర్టు మానవతా దృక్పథంతో అనుమతించింది. ఆ మైనర్‌ను సంరక్షించాలని పశ్చిమ బెంగాల్ ప్రభుత్వాన్ని కోరడంతో పాటు గర్భిణి అయిన ఖాతూన్‌కు ఉచిత ప్రసవంతో సహా సాధ్యమైన అన్ని వైద్య సహాయాలను అందించాలని బీర్భమ్ జిల్లా చీఫ్ మెడికల్ ఆఫీసర్‌ను ఆదేశించింది. ఏప్రిల్ 24న సుప్రీంకోర్టు కేంద్రానికి చివరి అవకాశం ఇస్తూ, ఈ విషయంపై సూచనలు తీసుకుని తిరిగి తమకు తెలియజేయాలని కేంద్రం తరపు న్యాయవాదిని కోరింది. సునాలీ ఖాతూన్ తండ్రి భోడు సేఖ్ తరపున హాజరైన సీనియర్ న్యాయవాదులు కపిల్ సిబల్, సంజయ్ హెగ్డే వాదనలు వినిపిస్తూ ఈ విషయంపై కేంద్రం తన అభిప్రాయాలను కోర్టుకు తెలియజేయకపోవడం 'కొద్దిపాటి అన్యాయం' అన్నారు. హక్కులు, వివాదాలకు భంగం కలగకుండా కేవలం మానవతా దృక్పథంతో ఆ మహిళను, ఆమె బిడ్డను దేశంలోకి అనుమతించడానికి సంబంధిత అధికార సంస్థ అంగీకరించిందని, వారిని నిఘాలో ఉంచుతా




రని తుషార్ మెహ‌తా చేసిన వాదనను సుప్రీంకోర్టు పరిగణనలోనికి తీసుకుంది. ఢిల్లీలోని రోహిణి ప్రాంతంలోని సెక్టార్ 26లో రెండు దశాబ్దాలకు పైగా రోజువారీ కూలీలుగా పనిచేస్తున్న కుటుంబాలను బంగ్లాదేశీయులనే అనుమానంతో గతేడాది జూన్ 18న పోలీసులు అదుపులోకి తీసుకుని, ఆతర్వాత జూన్ 27న సరిహద్దు దాటించారని భోదు సేఖ్ ఆరోపించారు. గత సంవత్సరం సెప్టెంబరు 26న పశ్చిమబెంగాల్‌లోని భీర్‌భమ్ జిల్లాకు చెందిన సునాలీ ఖాతూన్, స్వీటీ బీబీలను వారి కుటుంబాలతో పాటు 'అక్రమ వలసదారులు' గాపేర్కొంటూ బంగ్లాదేశ్‌కు బహిష్కరించాలన్న కేంద్రం నిర్ణయాన్ని హైకోర్టు కొట్టివేసింది. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ 2025, మే 2వ తేదీన ఒక మెమోలో జారీ చేసిన ఆదేశం ప్రకారం, ఢిల్లీలోని ఎఫ్ఆర్ఆర్ఓ (ఫారిన్ రీజినల్ రిజిస్ట్రేషన్ ఆఫీస్) ఒక సివిల్ అథారిటీగా బంగ్లాదేశ్‌కు చెందిన అక్రమ వలసదారులను స్వదేశానికి పంపిస్తోందని కేంద్రం తన అఫిడవిట్‌లో పేర్కొందని హైకోర్టు గమనించింది. దేశ బహిష్కరణకు అవసరమైన నియమాలను వివరిస్తూ ఏదైనా నిర్దిష్ట రాష్ట్రంలో లేదా కేంద్రపాలిత ప్రాంతంలో అనధికారికంగా నివసిస్తున్నట్లు గుర్తించిన బంగ్లాదేశీయులు /మయన్మార్ జాతీయుల విషయంలో ఈ నిబంధనలు వర్తిస్తాయని పేర్కొంది.

## డి.రాజా, రామకృష్ణ పాండా (మొదటి పేజీ తరువాయి)

**ఉగ్రవాదం:** కారణాలు, లక్ష్యాలు, పద్ధతులు' అనే అంశంపై జరుగనున్న మొదటి సమావేశంలో సిపిఐ ప్రధానకార్యదర్శి డి.రాజా ప్రసంగించనుండగా, 'అంతర్జాతీయ ఉగ్రవాదం దాని రూపాలపై ఏకైక పోరాటం : వామపక్ష ప్రగతిశీల శక్తుల పాత్ర' అనే అంశంపై జరిగే రెండవ సమావేశంలో రామ కృష్ణ పాండా ప్రసంగించనున్నారు. ఈ పర్యటన సందర్భంగా సిపిఐ ప్రతినిధి బృందం వివిధ దేశాలకు చెందిన ప్రగతిశీల నాయకులు, కమ్యూనిస్టులు, కార్మిక పార్టీలు, శాంతి ప్రతినిధులు, సామ్రాజ్యవాద వ్యతిరేక శక్తులతో సమావేశం కానుంది. ఈ ప్రతినిధి బృందం పరస్పర ఆసక్తిగల అంశాలు, అంతర్జాతీయ పరిణామాలు, శాంతి, ప్రజాస్వామ్యం, ప్రపంచవ్యాప్తంగా ప్రగతిశీల శక్తుల మధ్య ఐక్యతను బలోపేతం చేయడం వంటి విషయాలపై చర్చిస్తుంది. రష్యన్ ఫెడరేషన్ కమ్యూనిస్టు పార్టీతో భారతదేశ సిపిఐ ప్రతినిధులు డి.రాజా, రామకృష్ణ పాండా ద్వైపాక్షిక చర్చలను జరుపనున్నారు.ఉగ్రవాదం, సామ్రాజ్యవాద దురాక్రమణ, యుద్ధం, విభజనకు వ్యతిరేకంగా జరిగే పోరాటానికి తమ దృఢ నిబద్ధతను సిపిఐ పునరుద్ఘాటిస్తూ, సార్వభౌమత్వం, ప్రజల హక్కులు, శాంతి రక్షణ కోసం అంతర్జాతీయ ఐక్యత కోసం పిలుపునిచ్చింది.

## భగ్గుమంటున్న భారతావని (మొదటి పేజీ తరువాయి)

నమోదైంది. ఎయిర్‌క్వాలిటీ అండ్ వెదర్ ట్రాకర్ ఎక్యూఐ డాట్ ఇన్ ఈ గణాంకాలను వెల్లడించింది. రెండో స్థానంలో మహారాష్ట్రలోని చంద్రాపూర్ (44 డిగ్రీలు), మూడో స్థానంలో యుపిలోని ప్రయాగ్‌రాజ్ (44 డిగ్రీలు), నాలుగు, ఐదు స్థానాల్లో ఛత్తీస్‌గఢ్‌లోని బిలాస్‌పూర్, మహాసముంద్ (44 డిగ్రీలు), ఆరవ స్థానంలో బిహార్‌లోని బుక్సర్ (44 డిగ్రీలు), ఏడో స్థానంలో ఛత్తీస్‌గఢ్‌లోని దుర్గ్ (44 డిగ్రీలు), ఎనిమిదో స్థానంలో బిహార్‌లోని సాసారామ్ (43 డిగ్రీలు), తొమ్మిదో స్థానంలో ఛత్తీస్‌గఢ్‌లోని ఖిలాయ్ (43 డిగ్రీలు), పదో స్థానంలో యుపిలోని మీర్జాపూర్ (43 డిగ్రీలు) నిలిచాయి. ఇక ఆ తర్వాతి స్థానంలో తెలంగాణకు చెందిన జగిత్యాల ఉంది. యుపిలోని వారణాసి, బాందా, బరేలీ, అయోధ్యలో రికార్డు ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. వాయువ్య భారతదేశ మైదాన ప్రాంతాలు, మధ్య, తూర్పు భారతదేశం, అలాగే ద్వీపకల్ప భారతదేశంలోని కొన్ని ప్రాంతాల్లో రాబోయే ఆరు నుండి ఏడు రోజుల పాటు వడగాలుల నుండి తీవ్ర వడగాలుల పరిస్థితులు కొనసాగే అవకాశం ఉందని భారత




వాతావరణ శాఖ (ఐఎండి) శుక్రవారం తెలిపింది. పలు రాష్ట్రాలకు రెడ్ ఆరెంజ్ అలర్ట్‌లు జారీ చేసింది. ఈనెల 22 నుండి మే 28 వరకు ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్‌లలోని అక్కడక్కడా కొన్ని ప్రాంతాల్లో వడగాలుల పరిస్థితులు నెలకొనే అవకాశం ఉందని పేర్కొంది. అదే కాలంలో తూర్పు ఉత్తరప్రదేశ్, తూర్పు మధ్యప్రదేశ్‌లలో తీవ్ర వడగాలుల పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉని తెలిపింది. 22 నుండి 28 వరకు పంజాబ్, హర్యానా, చండీగఢ్, ఢిల్లీలలోని అక్కడక్కడా కొన్ని ప్రాంతాల్లో వడగాలుల పరిస్థితులు ఏర్పడే బలమైన అవకాశం ఉందని, ఈ ప్రాంతాల్లోని కొన్ని చోట్ల 24– 27 మధ్య తీవ్ర వడగాలుల పరిస్థితులు ఉంటాయని అంచనా వేయబడింది. 22–28 మధ్య రాజస్థాన్‌లోని అక్కడక్కడా కొన్ని ప్రాంతాల్లో వడగాలుల పరిస్థితులు ఏర్పడే బలమైన అవకాశం ఉంది। అలాగే 24–28 మధ్య పశ్చిమ రాజస్థాన్‌లోని అక్కడక్కడా కొన్ని చోట్ల తీవ్ర వడగాలుల పరిస్థితులు నెలకొనే అవకాశం ఉందని ఐఎండి తెలిపింది. 22–28 మధ్య వివిధ తేదీల్లో విదర్భ, కోస్తా ఆంధ్ర, యానాం, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, ఒడిశా, తెలంగాణ, జమ్ముకశ్మీర్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్‌లలోని కొన్ని ప్రాంతాల్లో వడగాలులు లేదా తీవ్ర వడగాలుల పరిస్థితులు కనిపించే అవకాశం ఉంది. అంతేకాకుండా, 22 నుండి 24 వరకు ఉత్తర ప్రదేశ్, విదర్భలోని అక్కడక్కడా కొన్ని ప్రాంతాల్లో, 22 నుండి 26 వరకు ఒడిశాలో, 22, 23 తేదీల్లో తెలంగాణలో రాత్రులు కూడా వేడిగా ఉండే పరిస్థితులు నెలకొనే అవకాశం ఉంది.

## భవిష్యత్ పెట్టుబడి

(మొదటి పేజీ తరువాయి)

ప్రజాప్రభుత్వం చేతల్లో నిరూపించిందని అన్నారు. సమగ్రాభివృద్ధి, రైతు సంక్షేమం, మహిళా సాధికారత, ఉపాధి సృష్టి పట్ల మా ప్రభుత్వం కట్టుబడి ఉందని మరోసారి ఆయన పునరుద్ఘాటించారు. మహాత్మాజ్యోతి రావు పూలే ప్రజాభవన్‌లో శుక్రవారం జరిగిన 49వ రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. సమావేశంలో మంత్రి తుమ్మల నాగేశ్వర రావు, స్పెషల్ చీఫ్ సెక్రెటరీ దాన కిషోర్, ఫైనాన్స్ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా, ఫైనాన్స్, ప్లానింగ్ కార్యదర్శి గౌరవ్ ఉప్పల్, ఆర్‌బిఐ రీజనల్ డైరెక్టర్ చిన్మయ మోహన్, ఎస్‌బిఐ సిజిఎం నీలేష్ ద్వివేది తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ 20147 నాటికి తెలంగాణ 3 ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థగా నిలిపేందుకు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం కృతనిశ్చయంతో పనిచేస్తోందన్నారు. రాష్ట్రంలో బ్యాంకుల మొత్తం డిపాజిట్లు దాదాపు రూ.9.43 లక్షల కోట్లకు చేరుకోవడం, అడ్వాన్సులు రూ.12.34 లక్షల కోట్లకు చేరుకోవడం గొప్ప విషయమని చెప్పారు. రాష్ట్రం 130.78 శాతం క్రెడిట్‌డిపాజిట్ నిష్పత్తితో




ముందుకు సాగడం అద్వితీయ విషయమని ఆయన చెప్పారు. వ్యవసాయ రుణాల విషయంలో లక్ష్యాలను మించి బ్యాంకులు రుణాలు ఇవ్వడం సంతోషకరమని అన్నారు. రూ.1,65,297 కోట్ల లక్ష్యానికి గాను రూ.1,68,401 కోట్ల వ్యవసాయ రుణాలు పంపిణీ చేసి 101.88 శాతం సాధించడం గర్వించదగ్గ విషయమన్నారు. వ్యవసాయం తెలంగాణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక అని, రైతులు, పాడి రైతులు, మత్స్యకారులు, అనుబంధ రంగాలకు కిసాన్ క్రెడిట్ కార్డు సహా వివిధ పథకాల ద్వారా బ్యాంకులు అందిస్తున్న మద్దతు అభినందనీయమన్నారు. సౌరశక్తి ప్రాజెక్టులు, రూఫ్ టాప్ సోలార్ ప్యానెళ్ల ఏర్పాటు, ఇతర పర్యావరణ అనుకూల కార్యక్రమాలకు బ్యాంకులు చురుగ్గా రుణ సహాయం అందించాలని, సామాజిక భద్రత, బీమా పథకాల పరిధిలోకి రాష్ట్ర ప్రజలను తీసుకురావాలని ఉప ముఖ్యమంత్రి సూచించారు. బ్యాంకులు కేవలం డబ్బు డిపాజిట్ చేసే, రుణాలు ఇచ్చే ఆర్థిక సంస్థలుగానే కాకుండా, రాష్ట్ర వ్యూహాత్మక అభివృద్ధి భాగస్వాములుగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. ప్రజల డబ్బు అంతా బ్యాంకులకే చేరుతుందని, కాబట్టి ఆ నిధులను ఏ రంగాల అభివృద్ధికి రుణాలుగా ఇస్తున్నామనేది చాలా ముఖ్యమని రాష్ట్ర ఆర్థిక వృద్ధికి (జిఎస్‌డిపి), ఉపాధికి ఏ రంగం ఎక్కువ దోహదపడుతుందో ఆలోచించి బ్యాంకులు వ్యూహాత్మకంగా రుణాలు అందించాలన్నారు. రాష్ట్రంలో త్వరలోనే అనేక ఇండస్ట్రియల్ హబ్‌లు, క్లస్టర్లను తీసుకువస్తున్నామని, ఇందులో భాగంగా ఫార్మా, ఫ్యాబ్ సిటీ, స్టీల్, లెదర్, టెక్స్‌టైల్ వంటి వివిధ రంగాలను డిజైన్ చేస్తున్నామని, దీని ద్వారా జాతీయ, అంతర్జాతీయ పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యమని డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క వెల్లడించారు.

## రూ.100 కోట్లు (మొదటి పేజీ తరువాయి)

తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. స్వామివారి మాలధారణ చేసి, దీక్ష చేపట్టే భక్తులకు కొండపైన ఉండటానికి సరైన వసతి లేకపోవడంతో ఇప్పటివరకు అనేక ఇబ్బందులు పడ్డారు. ఇకపై ఆ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతూ, దీక్షాపరుల కోసం ప్రత్యేక వసతి గృహాన్ని, అలాగే సాధారణ భక్తుల కోసం 60 గదుల నిర్మాణం, ఆధునిక డార్మిటరీ హాళ్లను కలిపి రూ. 43.12 కోట్ల వ్యయంతో ప్రభుత్వం నిర్మించనుంది.

**కాలినడక భక్తులకు ఊరట.. రూ. 1.41 కోట్లతో మెట్ల మార్గం ఆధునీకరణ**

వైకుంఠద్వారం నుంచి కాలినడకన మెట్ల మార్గం ద్వారా కొండపైకి వచ్చే భక్తులకు ఎండ, వానల నుండి రక్షణ కల్పించేందుకు ప్రభుత్వం రూ. 1.41 కోట్లు కేటాయించింది. భక్తులకు ఎండ తగలకుండా పైన ఆధునిక షెడ్డు, వృద్ధులు, పిల్లలు పట్టుకుని నడవడానికి మెట్లకు ఇరువైపులా పైపుల ( రేలింగ్) ఏర్పాటు చేయనున్నారు. దారిపొడవునా భక్తుల దాహార్తిని తీర్చేందుకు స్వచ్ఛమైన మంచి నీటి వసతిని కూడా కల్పించనున్నారు.

**రూ. 43 కోట్లతో వేదపాఠశాల, వైభవంగా రంగమండపం**

సనాతన ధర్మాన్ని, వేద విద్యను ప్రోత్సహించేందుకు యాదాద్రిలో రూ. 43.80 కోట్లతో బృహత్తర వేదపాఠశాల నిర్మాణానికి సీఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేయనున్నారు. ఈ ప్రాజెక్టును మూడు దశల్లో పూర్తి చేస్తారు (మొదటి దశకు రూ. 23.80 కోట్లు, రెండు మరియు మూడో దశలకు రూ. 10 కోట్ల చొప్పున). అలాగే స్వామివారి నిత్య కళ్యాణోత్సవాన్ని భక్తులు కనులారా వీక్షించేందుకు రూ. 9.87 కోట్లతో 'రంగ మండపం', రథశాల వైపు భక్తుల రాకపోకల కోసం రూ. 1.35 కోట్లతో కొత్తగా మెట్ల మార్గాన్ని నిర్మించనున్నారు.

ముఖ్యమంత్రి పర్యటన నిమిత్తం యాదాద్రి దేవస్థాన అధికారులు, జిల్లా యంత్రాంగం ఇప్పటికే అన్ని ఏర్పాట్లను పూర్తి చేసింది. శంకుస్థాపనల అనంతరం ఈ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ నిర్ణయం పట్ల అటు సామాన్య భక్తులు, ఇటు దీక్షాపరులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నేడు జరగనున్న శంకుస్థాపన మహోత్సవానికి కంచి పీఠాధిపతి శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి స్వామి వారి ఆధ్వర్యంలో వేద పాఠశాలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేస్తారు. అదేవిధంగా మంత్రులు కొండా సురేఖ, ఉత్తంకుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, జిల్లా ఇన్చార్జి మంత్రి అడ్లూరి లక్ష్మణ్, ముఖ్యమంత్రి సలహాదారు రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు లు హాజరుకానున్నారు.

**ప్రతిపాదిత పనులు**
**సుమారు అంచనా వ్యయం**

1.డార్మిటరీ హాళ్లు మరియు దీక్షాపరుల సదనం నిర్మాణం రూ. 43.12 కోట్లు
2.బృహత్తర వేదపాఠశాల నిర్మాణం (3 దశల్లో) రూ. 43.80 కోట్లు
3.రంగ మండపం (నిత్య కళ్యాణ మండపం) నిర్మాణం రూ. 9.87 కోట్లు
4.మెట్ల మార్గంపై షెడ్, మంచినీటి వసతి (వైకుంఠ శివద్వారం) రూ. 1.41 కోట్లు
5.పిఆర్‌ఓ కార్యాలయం నుండి 505 లెవల్ వరకు మెట్ల నిర్మాణం రూ. 1.35 కోట్లు
మొత్తం అన్ని పనుల శంకుస్థాపన వ్యయం రూ. 99.55 కోట్లు

## పెగులుతున్నాయ్

(మొదటి పేజీ తరువాయి)

ఉండటం శోచనీయం. ఏ అధికారి కథ కదిలించిన ఇదే పరిస్థితి. ఇప్పటికే ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేస్తున్న యంత్రాంగంపై ప్రజలు విశ్వసనీయత కోల్పోయారు. చిన్నదైన పెద్దదైన ప్రభుత్వ కార్యాలయాల్లో పని జరగాలంటే ఎంతో కొంత సమర్పించుకోవాల్సిన పరిస్థితి. ఆఖరికి జన్మ ధృవీకరణ పత్రం పొందాలన్న రూ.1,000లు సమర్పించుకోవాల్సిందేనట. ఇక భూములు, ఇతర స్థిరాస్తులకు సంబంధించిన వ్యవహారాల్లో అధికారులు పంచాయతీలను నిర్వహించి ఏకంగా వాటాలే పుచ్చుకుంటున్నారన్న ఆరోపణలు వినవస్తున్నాయి. ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి ఈనాటిది కాకపోయినా ఇప్పుడు మరింతగా బరితెగించారని ప్రజాప్రతినిధులు ఆఖరికి మంత్రులు చెప్పిన తమకు దక్కాల్సింది దక్కితేనే ఫైలు కదిలే పరిస్థితి ఏర్పడింది. ఇప్పుడు చాలా ప్రభుత్వ కార్యాలయాల్లో ఒక సంస్కృతి ప్రబలుతుంది. అదేమిటంటే అక్రమ పద్ధతుల్లో ప్రభుత్వ కార్యాలయాల ద్వారా పని చేయడానికి తమ వాటాను మాట్లాడుకున్న తర్వాత ప్రజాప్రతినిధుల చేత సంబంధిత వ్యక్తులను ఫోన్ చేయించమని అడుగుతున్నారు. ప్రజాప్రతినిధుల సిఫారసులను అడ్డంపెట్టుకుని ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. ఉదాహరణకు ఖమ్మం వెలుగుమట్ల నిరుపేదల విషయలో ఇండ్లు కూలగొట్టి పునరావాసం కల్పించేటప్పుడు ఒకరిద్దరి వ్యక్తులకు మంత్రులు లేదా అనుచరులు తమకు సంబంధించిన వారిని లబ్దిదారులుగా ఎంపిక చేయాలని సూచించారు. వారి సిఫారసును అడ్డంపెట్టుకుని 311లో 100 మందికి పైగా అనర్హులకు అధికారులు అవకాశం కల్పించారు. ఇది కేవలం ఒక ఉదాహరణ మాత్రమే. విలువైన భూముల విషయంలో అక్రమ పద్ధతుల్లో పట్టాలను చేసి అధికార యంత్రాంగం కోట్లు కొల్లగొడుతున్నది. ఈ పద్ధతి ఒక జిల్లాకో లేదా ఒక ప్రాంతానికో పరిమితం కాలేదు. ఎక్కడ భూముల ధరలు ఎక్కువగా ఉన్నాయో అక్కడ అవినీతి అధికారుల సంపాదన కూడా చాలా ఎక్కువగా ఉంది. బంధువుల పేరున ఇతరుల పేరున తమ ఆస్తులను భద్రపర్చుకుంటున్నారు. మొత్తం వ్యవస్థను నడిపించే అత్యున్నత స్థానంలో ఉండే వ్యక్తులే అవినీతికి పాల్పడుతుండటం ఇప్పుడు మరింత ఆలోచింపజేస్తుంది. ఉన్నతమైన స్థాయిలో ఉన్నప్పుడు తమ గురించికాకుండా ప్రజల బాగోగుల గురించి ఆలోచించాల్సిన అధికారులు అవినీతికి పాల్పడటం ద్వారా మొత్తం వ్యవస్థను భ్రష్టు పట్టిస్తున్నారు. అధికార యంత్రాంగం ఈ స్థితికి రావడానికి ప్రజాప్రతినిధుల వ్యవస్థ కూడా కలుషితం కావడమే కారణం. ఎన్నికల్లో కోట్ల రూపాయలు ఖర్చు చేసి దానిని పూడ్చుకునేందుకు అడ్డదారుల్లో అక్రమ సంపాదనకు అలవాటుపడుతున్నారు. అటువంటి వ్యక్తులే అధికారులను అవినీతికి ప్రోత్సహిస్తున్నారన్న విషయం పలు సంఘటనల్లో బహిర్గతమవుతుంది. అయితే ప్రజాప్రతినిధులు తప్పించుకుని అధికారులు అవినీతి నిరోధక శాఖాధికారులకు చిక్కుతున్నారు.

**ఫిర్యాదులు వస్తేనే..**

అవినీతి నిరోధక శాఖాధికారులు ఇటీవల సంచలనాత్మకంగా దాడులు నిర్వహిస్తున్నారు. ఒకప్పుడు క్షేత్రస్థాయిలో ఉన్న చిరుద్యోగులను మాత్రమే రూ. 1000, రూ.2వేలు లేదా రూ.20వేలకు లోపు లంచాలు తీసుకునే వారిని మాత్రమే అదుపులోకి తీసుకునే వారు. ఫిర్యాదులు చేసిన సందర్భంలోనే అవినీతి నిరోధక శాఖాధికారులు బాధితుని సాయంతో దాడులు చేసి అదుపులోకి తీసుకునే వారు. కానీ ఇప్పుడు అవినీతి నిరోధక శాఖ (ఏసిబి) తీరు కూడా మారింది. బాధితుల ఆరోపణలు నేరుగా లేకపోయినా ప్రజల ఆలోచన సరళికి అనుగుణంగా దాడులు చేస్తున్నారు. ఇది అభినందించదగిన విషయమే. అవినీతిని ఎక్కడో ఒక చోట రూపుమాపక పోతే ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల మెట్టు ఎక్కేందుకు జంకే పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికే మానసికంగా ప్రజలు సిద్ధమయ్యారు. ఏదో ఒకటి సంతర్పణ చేస్తే తప్ప పనులు కావన్న భావన పెరిగిపోయింది. ఈ భావన నుంచి ప్రజలను మార్చాల్సిన అవసరం ఉన్నది. ఓ రెవెన్యూ అధికారి మూడు కుంటల భూమిని పాసు పుస్తకంలో ఎక్కించేందుకు రూ. 50వేలు లంచం అడిగాడంటే పరిస్థితి ఏవిధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. లంచడం అడగటం హక్కు అన్న భావన అధికారుల్లో కూడా పెరుగుతుంది. చివరకు ఆ రైతు దానిని రెండు సార్లు విక్రయించినా అంత రాదు. సంతకం పెడతా మొత్తం భూమినే మీ పేర చేయించుకోండి అన్న సందర్భం రైతుల వేదనకు అద్దం పడుతున్నది.

## 24 రాజ్యసభ స్థానాలకు షెడ్యూల్

(మొదటి పేజీ తరువాయి)

ఎన్నికల సంఘం ఒక ప్రకటనలో పేర్కొంది. ఆంధ్రప్రదేశ్, గుజరాత్, కర్ణాటకలలో ఒక్కో రాష్ట్రంలో నాలుగు స్థానాలకు, మధ్యప్రదేశ్, రాజస్థాన్‌లలో ఒక్కో రాష్ట్రంలో మూడు స్థానాలకు; జార్ఖండ్‌లో రెండు స్థానాలకు; అలాగే మణిపూర్, మేఘాలయ, అరుణాచల్ ప్రదేశ్, మిజోరాంలలో ఒక్కో స్థానం చొప్పున ఈ రాజ్యసభ ఎన్నికలు నిర్వహించనున్నారు.

**నామినేషన్ల దాఖలుకు చివరి తేదీ జూన్ 8**

రాజ్యసభ నుండి పదవీ విరమణ చేస్తున్న వారిలో దేవెగౌడ, కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే (ఇద్దరూ కర్ణాటక నుండి); కేంద్ర మంత్రులు రవ్‌నీత్ సింగ్ (రాజస్థాన్), జార్జ్ కురియన్ (మధ్యప్రదేశ్); మాజీ ముఖ్యమంత్రి దిగ్విజయ్ సింగ్; కాంగ్రెస్ నాయకుడు శక్తిసింహ్‌జీ గోవిల్ తదితరులు ఉన్నారు. మహారాష్ట్ర, తమిళనాడు రాష్ట్రాల నుండి ఒక్కో రాజ్యసభ స్థానానికి ఉప ఎన్నికలు నిర్వహించనున్నట్లు కూడా ఎన్నికల సంఘం ప్రకటించింది. మహారాష్ట్రలో ఉప ముఖ్యమంత్రి సునేత్ర పవార్ తన రాజ్యసభ స్థానానికి రాజీనామా చేయడంతో ఆ స్థానం ఖాళీ అయ్యింది. ఆమె ప్రస్తుతం రాష్ట్ర శాసనసభకు ఎన్నికయ్యారు. రాజస్థాన్‌లో రవ్‌నీత్ సింగ్‌తో పాటు, పదవీకాలం ముగుస్తున్న ఇతర సభ్యులలో కాంగ్రెస్ పార్టీకి చెందిన నీరజ్ డాంగి, బిజెపికి చెందిన రాజేంద్ర గెహ్లాట్ ఉన్నారు. రాజస్థాన్‌లో మొత్తం 10 రాజ్యసభ స్థానాలు ఉన్నాయి. ప్రస్తుతం బిజెపి, కాంగ్రెస్ పార్టీలకు చెరో ఐదుగురు సభ్యులు ఉన్నారు. 200 మంది సభ్యులు కలిగిన రాజస్థాన్ శాసనసభలో పార్టీల ప్రస్తుత బలాన్ని పరిగణనలోకి తీసుకుంటే, మొత్తం మూడు స్థానాల్లో బిజెపి రెండు స్థానాలను గెలుచుకునే అవకాశం ఉండగా, కాంగ్రెస్ ఒక స్థానాన్ని దక్కించుకునే అవకాశం ఉంది. శాసనసభలో బిజెపికి 118 మంది ఎమ్మెల్యేలు ఉండగా, కాంగ్రెస్‌కు 67 మంది సభ్యులు ఉన్నారు. అలాగే బిఎస్‌పికి ఇద్దరు ఎమ్మెల్యేలు, భారత ఆదివాసీ పార్టీకి నలుగురు, రాష్ట్రీయ లోక్ దళ్‌కు ఒకరు, స్వతంత్ర అభ్యర్థులుగా ఎనిమిది మంది సభ్యులు ఉన్నారు.

## నేడు మంత్రివర్గ సమావేశం

(మొదటి పేజీ తరువాయి)

అంశాలపై నివేదిక ఇవ్వాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణా రావు ఇప్పటికే అన్ని శాఖల ప్రత్యేక కార్యదర్శులను, ముఖ్య కార్యదర్శులను ఆదేశించారు. ఈ మేరకు మంగళవారమే ఆయన ఒక సర్క్యులర్ జారీ చేశారు. రాష్ట్ర పరిపాలన, అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సంక్షేమానికి సంబంధించిన పలు కీలక అంశాలపై చర్చించి నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ప్రధానంగా ప్రైవేట్ పాఠశాలల ఫీజుల నియంత్రణ, అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల కేటాయింపు విధివిధానాలు, పాలమూరు– రంగారెడ్డి ఎత్తిపోతల పథకం, పలు ప్రజా ప్రాధాన్యత కలిగిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, పరిపాలనా అంశాలు, వివిధ శాఖలకు సంబంధించిన పెండింగ్ నిర్ణయాలపై చర్చ జరగనున్నట్లు సమాచారం.

# సిరాజ్, రషీద్ జోరుకు తలొగ్గిన చెన్నై..

లీగ్ దశ చివరి మ్యాచ్‌లో గుజరాత్ టైటాన్స్ పంజా విసిరింది. సొంతగడ్డపై బెబ్బేలిలా రెచ్చిపోయిన శుభ్మన్ గిల్ సేన చెన్నై సూపర్ కింగ్స్ ప్లే ఆఫ్స్ ఆశలను నేలమట్టం చేసింది. భారీ ఛేదనలో సిరాజ్(3–26) విజృంభణతో కుదేలైన సీఎస్కేను శివం దూబే(47) గట్టెక్కించేలా కనిపించినా.. రషీద్ ఖాన్(3–18) తిప్పేయడంతో మ్యాచ్ ఏకపక్షంగా మారింది. రబడ(3–32) సైతం ఓ చేయి వేయగా గుజరాత్ 89 పరుగుల భారీ విజయాన్నందుకోగా ఐదుసార్లు ఛాంపియన్ ఉసూరుమంటూ టోర్నీ నుంచి నిష్క్రమించింది.

పంతొమ్మిదో సీజన్‌లో దూసుకెళ్తున్న గుజరాత్ టైటాన్స్ అదిరే ఆటతో చెన్నై సూపర్ కింగ్స్‌ను ఇంటికి పంపింది. అహ్మదాబాద్‌లో తొలుత 229 రన్స్ కొట్టిన గుజరాత్ ప్రత్యర్థిని పడగొట్టింది. పేసర్ సిరాజ్(3–26) ఆదిలోనే చావుదెబ్బ తీశాడు. 230 పరుగుల భారీ ఛేదనకు దిగిన సీఎస్కే బ్యాటర్ల భరతం పడుతూ తొలి ఓవర్లోనే సంజూ శాంసన్(0)ను గోల్డెన్ డక్‌గా ఔట్ చేశాడు మియా భాయ్. ఆ తర్వాతి ఓవర్‌లో రుతురాజ్ గైక్వాడ్(16), ఈ సీజన్లో వేగవంతమైన అర్ధ శతకంతో రికార్డు నెలకొల్పిన ఉర్విల్ పటేల్(0)ను వెనక్కి పంపిన సిరాజ్ మూడో వికెట్‌తో చెన్నైని



పీకల్లోతు కష్టాల్లో నెట్టాడు.

సిరాజ్ నిప్పులు చెరగడంతో 29 పరుగులకే మూడు వికెట్లు పడగా మాథ్యూ షార్ట్(19), కార్తిక్ శర్మ(24)లు క్రీజునంటుకునేందుకు ప్రయత్నించారు. కానీ, రబడ ఓవర్లో షార్ట్ ఔటవ్వగా .. 7వ ఓవర్లో గిల్ విసిరిన త్రోకు కార్తిక్ రనౌటవ్వగా చెన్నై 63 పరుగులకే సగం వికెట్లు కోల్పోయింది. చూస్తుండగానే ఐదుగురు డగౌట్ చేరగా శివం దూబే(47), బ్రెవిస్(8)లు భారీ ఓటమిని తప్పించేందుకు పోరాడారు.


**దూబే ధనాధన్..** కీలక బ్యాటర్లు ఔటైన చోట దూబే సిక్సర్లతో హల్చల్ చేశాడు. హోల్డర్, అర్షద్ ఖాన్ ఓవర్లో దంచేసి చెన్నై స్కోర్ వంద దాటించాడు దూబే. అర్ధ శతకానికి చేరువైన అతడు రషీద్ ఖాన్(3–18) ఓవర్లో బంతిని గాల్లోకి లేపగా గిల్ వెనక్కి పరుగెడుతూ డైవింగ్ క్యాచ్ అందుకోగా ఆరో వికెట్ 53 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది. కంబోజ్(19) ఆట కట్టించిన రషీద్.. ప్రమాదకరమైన బ్రెవిస్ను ఔట్ చేసి చెన్నై ఓటమిని ఖాయం చేశాడు. 14వ ఓవర్లో రబడ(3 32) వరసగా నూర్ అహ్మద్, జాన్సన్ను ఔట్ చేయడంతో సీఎస్కే 140కే ఆలౌటయ్యింది. ఏమాత్రం పోటీ ఇవ్వలేకపోయిన గైక్వాడ్ సేన టోర్నీ నుంచి నిష్క్రమించింది.

**చితక్కొట్టిన టాపార్డర్...** గుజరాత్ టైటాన్స్ టాపార్డర్ బ్యాటర్లు చితక్కొట్టారు. ఓపెనర్ సాయి సుదర్శన్(84) అర్ధ శతకంతో కదం తొక్కగా శుభ్మన్ గిల్(64) కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడాడు. చెన్నై బౌలర్లను ధీటుగా ఎదుర్కొన్న ద్వయం శతక భాగస్వామ్యంతో జట్టను భారీస్కోర్‌కు పునాది వేసింది. ఆఖర్లో బట్లర్(57 నాటౌట్) బ్యాట్ ఝులిపించడంతో సీఎస్కే ముందు కఠినమైన లక్ష్యాన్ని నిలిపింది గుజరాత్.

# ఫిట్‌నెస్ ఉన్నంత వరకు రోహిత్, కోహ్లీ ఆడాలి

కిరణ్ మోరే

ఇండియన్ క్రికెట్ లెజెండ్స్ విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ తమ ఫామ్, ఫిట్నెస్ నిలబెట్టుకున్నంత కాలం అంతర్జాతీయ క్రికెట్లో ఆడాలని మాజీ భారత మాజీ క్రికెటర్, చీఫ్ సెలెక్టర్ కిరణ్ మోర్ ఆకాంక్షించారు. వారిద్దరిని బలవంతంగా రిటైర్ చేయించే ఆలోచన సరైంది కాదన్నారు. పరుగులు చేస్తున్నంత కాలం వారిని కొనసాగించడచం ఉత్తమం అని పేర్కొన్నారు. గాజియాబాద్లో జరుగుతున్న 'బియాండ్ రీచ్ ప్రీమియర్ లీగ్' టయల్స్ సందర్భంగా కిరణ్ మోరే మీడియాతో మాట్లాడారు. రోకోకు ఇప్పటికి విపరీతమైన ఫ్యాన్ ఫాలోయింగ్ ఉందని గుర్తు చేశారు. వీరిద్దరూ కలసి ఆడటం చూడటానికి ఎంతో బాగుంటుందని చెప్పారు. వీరి రిటైర్మెంట్‌పై ఎలాంటి చర్చలు చేయొద్దని సూచించారు. సచిన్ పదవీ విరమణ చేసినప్పుడు నా కళ్లలో నీళ్లు వచ్చాయి. ఈ ఇద్దరూ ఆట నుండి వైదొలిగినప్పుడు కూడా,వారి లోటు తీవ్రంగా బాధిస్తుందన్నారు. ఆ సమయం వచ్చినప్పుడు రిటైర్మెంట్ నిర్ణయాన్ని తీసుకొనే సమర్థత వారికుందన్నారు. భవిష్యత్లో వైభవ్ సూర్యవంశీతో భారత్ గొప్ప కీర్తి లభి





స్తుందన్నారు. కాగా, 311 వన్డే మ్యాచ్లలో విరాట్ 299 ఇన్నింగ్సులో 58.71 సగటుతో 14,797 పరుగులు సాధించాడు. ఇందులో 54 శతకాలు, 77 అర్ధశతకాలు ఉన్నాయి, అలాగే అతని అత్యధిక స్కోరు 183. గతేడాది13 వన్డేలలో 65.10 సగటుతో 651 పరుగులు సాధించి, మూడు శతకాలు, నాలుగు అర్ధశతకాలు నమోదు చేశాడు. 2026లో, అతను మూడు ఇన్నింగ్సులో 80.00 సగటుతో, 105కి పైగా స్ట్రైక్ రేట్తో 240 పరుగులు చేశాడు. మరోవైపు ఐపీఎల్లో కోహ్లీ తన ఆటతీరును అద్భుతమైన స్థాయికి మెరుగుపరుచుకుంటూనే ఉన్నాడు. ఇప్పటికే ప్లేఆఫ్స్కు చేరుకున్న ఆర్సిబి తరపున ఆడుతూ 13 ఇన్నింగ్సులో 54.20 సగటుతో మొత్తం 542 పరుగులు సాధించాడు. ఒక సెంచరీ, నాలుగు హాఫ్ సెంచరీలతో పాటు తన కెరీర్లోనే అత్యధికమైన 164.74 స్ట్రైక్ రేట్ను నమోదు చేసి, 'ఆరెంజ్ క్యాప్' రేసులో కొనసాగుతున్నాడు. రోహిత్ 282 వన్డేలలో 274 ఇన్నింగ్సులో 48.84 సగటుతో మొత్తం 11,577 పరుగులు సాధించాడు. ఇందులో 33 శతకాలు, 61 అర్ధశతకాలు ఉన్నాయి. 264 అత్యధిక వ్యక్తిగత స్కోర్.

# సైన్స్

## సునామికి, భూకంపానికి సంబంధం ఏమిటి?

భూకంపాలు సంభవించిన ప్రతిసారీ, సముద్ర తీర ప్రాంతాల్లో సునామీ హెచ్చరికలు జారీ చేయడం, ముందస్తు చర్యలు చేపట్టడం చూస్తునే ఉన్నాం. భూకంపానికి, సునామికీ మధ్య ఉన్న సంబంధం ఏమిటనే ప్రశ్న ఇలాంటి సందర్భాల్లో తలెత్తడం సహజం. నిజానికి, భూకంపాలు, సునామీల మధ్య గాఢమైన సంబంధం ఉంది, కానీ ప్రతి భూకంపం సునామీకి కారణం కాదు. సాధారణంగా సునామీలు సముద్ర గర్భంలో సంభవించే శక్తివంతమైన భూకంపాల వల్ల ఏర్పడుతాయి. ముఖ్యంగా భూమి టెక్టానిక్ ప్లేట్లు పరస్పరం ఢీకొనే ప్రాంతాల్లో సముద్రపు అడుగు భాగం ఒక్కసారిగా



పైకి లేచినా లేదా కిందికి దిగినా, ఆకదలిక సముద్ర జలాన్ని భారీ స్థాయిలో అస్తవ్యస్తం చేస్తుంది. ఈ ఆకస్మిక జల చలనం శక్తివంతమైన అలల శ్రేణిని సృష్టిస్తుంది. వాటినే సునామీ అలలు అంటారు. భూకంపం సంభవించే భూగర్భ స్థానాన్ని హైపోసెంటర్ అంటారు, దాని నేరుగా పైభాగంలో సముద్ర ఉపరితలంపై ఉన్న ప్రాంతం ఎపిసెంటర్. ఎపిసెంటర్ సముద్రంలో ఉండి, భూకంప తీవ్రత సాధారణంగా 7 లేదా అంతకంటే ఎక్కువగా ఉన్నప్పుడు, సునామీ సంభవించే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. అయితే కేవలం తీవ్రతే కాదు. సముద్ర మధ్యలో ఈ అలలు తక్కువ ఎత్తుతో కానీ అత్యంత వేగంతో ప్రయాణిస్తాయి. ఇవి గంటకు కొన్ని వందల కిలోమీటర్ల వేగంతో కూడి ఉండవచ్చు. తీర ప్రాంతాలకు చేరుకునే సరికి నీటి లోతు తగ్గడంతో అలల వేగం తగ్గి, ఎత్తు పెరుగుతుంది. అప్పుడే అవి విధ్వంసకర, రాకాసి అలలుగా రూపం దాలుస్తాయి.

## భూభ్రమణ శక్తితో విద్యుత్తు!


'శాస్త్ర విజ్ఞానం కొత్తపుంతలు తొక్కుతున్నది. మనిషి అవసరాలు పెరుగుతున్న కొద్దీ, కొత్తకొత్త అన్వేషణలు కూడా పెరుగుతున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా ఎక్కువ దేశాలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల్లో విద్యుత్తు ఒకటి. బొగ్గు నుంచి... నీటి నుంచి... గాలి నుంచి విద్యుత్ ఉత్పత్తి చేస్తున్న మనిషి, నిరంతరం జరిగే భూభ్రమణంపై దృష్టి మళ్లించాడు' అంటూ తెగ ప్రచారమవుతున్న వార్తల్లో నిజానిజాలు తేల్చుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. చాలా సందర్భాల్లో మాదిరిగానే, ఇక్కడ కూడా ఒకశాతం వాస్తవానికి, 99 శాతం అభూత కల్పనలను, ఊహాగానాలను జోడించి ప్రచారం చేస్తున్నారు. ఫిజికల్ రివ్యూ జర్నల్‌లో క్రిస్టోఫర్ చిబా, కెవిన్ పి. హాండ్ పరిశోధనా వ్యాసాన్ని అనుసరించి భూమి తన అక్షంపై తిరుగుతున్నప్పుడు, భూమి యొక్క చుంబక క్షేత్రం (మ్యాగ్నటిక్ ఫీల్డ్) తో పరస్పర చర్యలో ఒక ప్రత్యేక ఆకారంలో నిర్మించిన పరికరం సూక్ష్మ స్థాయిలో 'డిసి' వోల్టేజ్ ఉత్పత్తి అవుతున్నది. ఈ వార్త నిజమే. అయితే, ఇది ఒక ప్రూఫ్‌ఆఫ్‌కన్సెప్ట్ మాత్రమే. సాధారణ విద్యుత్ ఉత్పత్తి యంత్రం



కాదు. కొలిచిన వోల్టేజ్ పరిమాణం చాలా చిన్న దిదశల మైక్రోవోల్‌ట్స్ స్థాయిలోనే ఉంది. ఈ స్థాయి విద్యుత్ సాధారణ ఎలక్ట్రానిక్ పరికరాలను నడిపేందుకు సరిపోదు. ఇది ఉచితశక్తి లేదా విద్యుత్ ఉత్పాదక కేంద్రం కాదు. ఇది ఒక భౌతిక సూత్రాన్ని పరీక్షించే ప్రయోగం. సాధారణంగా, ఒక కండక్టర్ భూమి చుంబక క్షేత్రంలో కదిలితే ఫారడే నియమం ప్రకారం విద్యుత్ ఉత్పత్తి కావచ్చు. అయితే భూమి మొత్తం ఒకే ఫ్రేమ్‌లో తిరుగుతున్నందున, లోపలి ఎలక్ట్రాన్లు తక్షణమే పునర్వ్యవస్థీకరించి ఆ వోల్టేజ్‌ను రద్దు చేస్తాయి. ఇది ఇరవయ్యో శతాబ్దం నుంచి తెలిసిన సూత్రం. అయితే ఈ పరిశోధనలో వారు మాంగనీస్‌జింక్ ఫెరైట్ వంటి ప్రత్యేక పదార్థం, నిర్దిష్ట జ్యామితి ఉపయోగించారు. ఇది కొలత యాదృచ్ఛిక శబ్దం కాదని సూచించే అంశంగా పేర్కొన్నారు. అయితే శాస్త్రసంఘం మొత్తం దీనిని తక్షణమే అంగీకరించలేదు. మరిన్ని స్వతంత్ర పునరావృత ప్రయోగాలు, సిద్ధాంతాత్మక విశ్లేషణలు అవసరం. కొన్ని విమర్శలు కూడా వెలువడ్డాయి. అందువల్ల ఇది పూర్తిగా స్థిరపడిన సాంకేతిక పరిష్కారం కాదు... ఒక ఆసక్తికరమైన ఫౌండేషనల్ ఫిజిక్స్ పరిశీలన మాత్రమే.

## ద్రవ్యరాశి లేని ఫోటాన్లు

ఫోటాన్లు అంటే కేవలం వెలుగు కణాలు మాత్రమే కావు, అవి మనం చూస్తున్న భౌతిక లోకాన్ని నిర్మించే ప్రాథమిక దూతలు. ఫోటాన్ అనేది ఎలక్ట్రోమ్యాగ్నెటిక్ కిరణాలలోని అతి చిన్న క్వాంటమ్ పరిమాణం. దీనికి విశ్రాంతి ద్రవ్యరాశి లేదుగానీ, శక్తి, గతి ఉంటాయి. అందువల్ల అది ఉపరితలాన్ని తాకినప్పుడు ప్రభావం చూపగలదు. అదే సమయంలో అంతరిక్షంలో తరంగంలా వ్యాపించగలదు. ఫోటాన్ స్వభావంలో అత్యంత విశేషమైన అంశం తరంగ–కణ ద్వంద్వ స్వభావం. అంటే ఇది ఒకే సమయంలో కణంగానూ, తరంగానూ ప్రవర్తించడం. కొన్ని ప్రయోగాల్లో వెలుగు తరంగాల్లా ప్రవర్తించి అంతరాయ నమూనాలు సృష్టిస్తుంది. మరికొన్ని సందర్భాల్లో అది విడివిడిగా కణాల్లా ఢీకొంటుంది. ఇది సాధారణ తార్కిక దృక్పథానికి విరుద్ధంగా అనిపించినప్పటికీ, క్వాంటమ్



భౌతిక శాస్త్రం ప్రకారం ఈ రెండు ప్రవర్తనలు పరస్పర విరుద్ధాలు కావు. అవి ఒకే వాస్తవానికి భిన్న అవతరణలు. ప్రసిద్ధ డబుల్‌స్లిట్ ప్రయోగం ఈ ద్వంద్వ స్వభావాన్ని స్పష్టంగా చూపించింది. ఫోటాన్లు శక్తి మాత్రమే కాదు, సమాచారాన్ని కూడా మోస్తాయి. నక్షత్రాల గర్భంలో జరిగే అణు సంయోగ చర్యల నుంచి వెలువడే ఫోటాన్లు లక్షల సంవత్సరాల తర్వాత మన కళ్లకు చేరి నక్షత్ర కాంతిగా కనిపిస్తాయి. మన కంటిలోని రేటినాలో ఫోటాన్లు రసాయనిక మార్పులు కలిగించి నాడీ సంకేతాలుగా మారుతాయి. సౌర ప్యానెల్లలో ఫోటాన్లు ఎలక్ట్రాన్లను ఉత్తేజపరిచి విద్యుత్ ఉత్పత్తి చేస్తాయి. కెమెరా సెన్సార్లు కూడా ఫోటాన్ల ప్రభావాన్ని ఎలక్ట్రానిక్ సంకేతాలుగా మార్చి చిత్రాలను రూపొందిస్తాయి. ఫోటాన్ల ఈ విశిష్ట స్వభావం వల్లే వెలుగు వక్రీభవనం చెందడం, ప్రతిఫలనం (రిఫ్లెక్షన్) వ్యతిరేక దిశల్లో కలిసినప్పుడు అంతరాయం వంటి ఖచ్చితమైన ప్రభావాలు కనిపిస్తాయి. విశ్వంలోని సమాచార మార్పిడి వ్యవస్థలో వెలుగు కీలక పాత్ర పోషిస్తుంది. దూర గెలాక్సీల గురించి మనకు తెలిసిన సమాచారం అంతా ఫోటాన్ల ద్వారానే చేరింది. వెలుగు నిశ్శబ్దంగా ప్రపంచాన్ని ఎలామార్చుతుందో, అలాగే ఫోటాన్ల అవగాహన మన విజ్ఞానాన్ని మారుస్తోంది.

# ప్రజలను పోరుబాటలో నడిపించింది 'పాటే'

కళాకారుల సంక్షేమానికి ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలి

ప్రజానాట్యమండలి జిల్లా మహాసభలో ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం




**ప్రజాపక్షం/నల్లగొండ:** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో ప్రజాకవి సుద్దాల హనుమంతు, బండి యాదగిరి వంటి ప్రజా కళాకారుల పాటలు ప్రజల్లో చైతన్యం నింపి రజాకార్లను తరిమికొట్టడంలో కీలక పాత్ర పోషించాయని, ఆ స్ఫూర్తితో కమ్యూనిస్టులు చేసిన ప్రజా పోరాటాల్లో కళాకారులు విశేష సేవలందించారని సిపిఐ నల్లగొండ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం పేర్కొన్నారు. ప్రజానాట్యమండలి నల్లగొండ జిల్లా 4వ మహాసభ శుక్రవారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని అమరజీవి నిస్సార్ కళా ప్రాంగణం, సిపిఐ జిల్లా కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. మహాసభ ప్రారంభానికి ముందు ప్రజానాట్యమండలి పతాకాన్ని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కురిమిద్దె శ్రీనివాస్ ఆవిష్కరించారు. సభకు ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో జరిగిన ప్రతి ప్రజా పోరాటంలో కళాకారుల పాత్ర కీలకమైందని, గ్రామీణ ప్రాంతాల్లో అణగారిన ప్రజల్లో ధైర్యం నింపింది పాటేనన్నారు. పదిమంది ప్రసంగాల కంటే ఒక పాట సమాజాన్ని ఎక్కువగా ప్రభావితం చేస్తుందన్నారు. ప్రజానాట్యమండలి కేవలం కళా సంస్థ కాదని, సామాజిక మార్పు కోసం కళను ఆయుధంగా మలిచిన ఉద్యమ సంస్థ అని సత్యం కొనియాడారు. నేటి తరానికి చరిత్రను, పోరాటాల స్ఫూర్తిని చేరవేయడంలో ప్రజా కళాకారుల బాధ్యత పెరిగిందన్నారు. కళాకారుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని కోరారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై కొత్త కళారూపాలను రూపొందించడంలో కళాకారులు ముందుండాలని సూచించారు. ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షుడు కురిమిద్దె శ్రీనివాస్ మాట్లాడుతూ పాట ఒక తూటాలాంటిది. నిద్రపోతున్న సమాజాన్ని తట్టి లేపి చైతన్యం కలిగించే శక్తి పాటకు ఉందన్నారు. నల్లగొండ జిల్లా కేంద్రంలో ప్రజాకవి సుద్దాల హనుమంతు పేరుతో మినీ రవీంద్రభారతిని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అర్హులైన కళాకారులను తెలంగాణ సారథిలో తీసుకోవాలి. అదేవిధంగా తెలంగాణ సారథిలో పనిచేస్తున్న కళాకారుల విద్యా అర్హతలను బట్టి ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, ప్రభుత్వం నిరుపేదలకు నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకంలో అర్హులైన పేద కళాకారులకు ఐదు శాతం ఇళ్లు కేటాయించాలని, కళా ప్రదర్శనల కోసం వెళ్లే కళాకారులకు ఆర్టీసీ బస్సుల్లో, రైళ్లలో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని, వృద్ధ కళాకారులకు ఆసరా పెన్షన్ మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ నెల 25,26 తేదీల్లో హైదరాబాద్‌లో జరిగే రాష్ట్ర నాలుగో మహాసభను విజయవంతం చేయడంలో నల్లగొండ జిల్లా ప్రధాన పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షులు బి.జగన్ అధ్యక్షత వహించగా సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి లొడంగి శ్రవణ్ కుమార్, గీత పనివారాల సంఘం జిల్లా కార్యదర్శి పబ్బు వీరస్వామి, ఎఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి టీ.వెంకటేశ్వర్లు, రైతు సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బంటు వెంకటేశ్వర్లు, ఎఐటియుసి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ చాపల శ్రీను, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి చేల్లం పాండురంగారావు, నాయకులు రొయ్య రాములు, గంటి హనుమంతు, కృపాటి పరమేష్, వడ్త్య గణేష్, గంట నగేష్, కలకొండ శ్రీను, ముగుదాల సైదమ్మ, వెన్నెల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



# భూసేకరణలో రైతుకు ఎకరాకు రూ.40లక్షల పరిహారం చెల్లించాలి

రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ డిమాండ్



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** పట్టణ రెవిన్యూలోని 1041 సర్వే నెంబర్‌లో ఫుడ్ పార్క్ నిమిత్తం చేపడుతున్న భూసేకరణలో రైతులకు ఎకరాకు రూ.40 లక్షలు పరిహారంతో పాటుగా భూములను కోల్పోయిన వారికి ఉద్యోగం, రామస్వామి గుట్ట వద్ద ఇల్లు ఇవ్వాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ డిమాండ్ చేశారు. ఈ మేరకు సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పట్టణంలో శుక్రవారం స్థానిక రైతులతో కలిసి హుజూర్‌నగర్ ఆర్‌డిఒ శ్రీనివాసులుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పశ్య పద్మ మాట్లాడుతూ రంగారెడ్డి జిల్లాలో ఇచ్చినట్లుగా ఎకరాకు 800 గజాల స్థలం భూ బాధితులకు ఇవ్వాలని కోరారు. ఫుడ్ పార్కును ప్రొఫెసర్ జయశంకర్ విశ్వ విద్యాలయానికి అనుబంధంగా ఏర్పాటు చేసి సేకరిస్తున్న 138 ఎకరాల భూమిని వ్యవసాయ విశ్వ విద్యాలయానికి కేటాయించాలని, సేకరించిన భూములను కేవలం ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలకు మాత్రమే వినియోగించాలన్నారు. కాలుష్యాని వెదజల్లే పరిశ్రమలకు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతి ఇవ్వకూడదన్నారు. భూమిని కోల్పోయిన రైతుల్లో ఎవరికైనా ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేయాలని, ఆసక్తి ఉంటే వారికి ప్రభుత్వం మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా నాయకులు కంబాల శ్రీనివాస్, జక్కుల రమేష్, భూబాధితులు పశ్య అరుణ్, చెనగాని వికాస్, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పెంచిన వేతనాలు సవరించాలి



ఎఐటియుసి నిజామాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓమయ్య విజ్ఞప్తి

**ప్రజాపక్షం/నిజామాబాద్ :** రాష్ట్ర ప్రభుత్వం కార్మికులకు పెంచిన కనీస వేతనాలను సవరించాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి ఓమయ్య అన్నారు. శుక్రవారం ఎఐటియుసి జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. సిఎం రేవంత్‌రెడ్డి ప్రకటించిన కార్మికుల కనీస వేతనాలను సవరించాలన్నారు. 12 సంవత్సరాలుగా రాష్ట్రంలో కార్మికుల వేతనాల పెంపు జరగలేదని, కనీస వేతనాల బోర్డు రాష్ట్రంలో ప్రస్తుత ధరలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వేస్తున్న విధానాలతో కార్మికుల ఆర్థిక స్థితిగతులు రాష్ట్రంలో కేంద్ర, కార్మిక సంఘాలుగా 26 వేల వేతనాన్ని డిమాండ్ చేస్తూ ప్రభుత్వం నియమించిన కనీస వేతనాల బోర్డు రూ.22 వేలకు నిర్ధారిస్తూ ప్రభుత్వానికి గత ఎనిమిది నెలల క్రితం నివేదిక సమర్పించామని ప్రభుత్వం నియమించిన కనీస వేతనాల బోర్డు నివేదికను పట్టించుకోకుండా కార్మికుల ఆర్థిక స్థితిగతులను పరిగణలోకి తీసుకోకుండా కార్మికుల వేతనాలను రూ.16 వేలకు పెంచడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. ప్రస్తుత ఆర్థిక పరిస్థితులను గమనంలో పెట్టుకుని శ్రమ చేసే కార్మికుల వేతనాలను అనుస్కిల్డ్ కార్మికులను రూ.22 వేలకు పెంచాలని, సెమీస్కిల్డ్ వారికి రూ.26 వేలకు పెంచాలని స్కిల్ కార్మికులకు రూ.30 వేల పైచిలుకు వేతనాలను రాష్ట్రంలో అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. సమావేశంలో ఎఐటియుసి జిల్లా ఉపాధ్యక్షులు చక్రపాణి, జిల్లా కార్యదర్శులు హన్మాండ్లు, అనిల్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

# కాంటాలు వేయక రైతాంగం ఇబ్బందులు

సిపిఐ సూర్యాపేట జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు




**ప్రజాపక్షం/నూతనకల్ :** ఐకెపి కేంద్రాల్లో కాంటాలు వేయక రైతులు ఇబ్బందులు పడుతున్నారని సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి కంబాల శ్రీనివాస్ పేర్కొన్నారు. శుక్రవారం సూర్యాపేట జిల్లా నూతనకల్ మండల కేంద్రంలో ఐకెపి కేంద్రాలను సందర్శించి మాట్లాడుతూ వరి ధాన్యం వచ్చి రోజులు గడుస్తున్న నేటికి 30 శాతం ధాన్యానికి కాంటాలు వేయకపోవడంతో రైతాంగం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఐకెపి కేంద్రాలకు వచ్చిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి లిఫ్ట్ చేసి రైతాంగాన్ని ఆదుకోవాలన్నారు. ఐకెపి కేంద్రాలకు వచ్చిన ధాన్యాన్ని సుదూర ప్రాంతమైన హుజూర్‌నగర్, కోదాడ ప్రాంతాలకు పంపించటం వల్ల సమయం వృధా కావటం వలన ఎగుమతి జరగకుండా లారీల కొరత ఏర్పడుతుందన్నారు. లారీల కొరత మూలంగా కాంటాలు వేసిన ధాన్యం లిఫ్టు చేయకపోవడంతో రైతాంగం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. తరుగు పేరుతో రెండు, మూడు కిలోలు తరుగు తీస్తున్నారన్నారు. మిల్లు యాజమాన్యాలు దిగుమతి చేసుకునే దగ్గర సమస్యలు సృష్టించి రైతాంగాన్ని నిలువునా దోచుకుంటున్నారని ఆరోపించారు. ఐకెపి కేంద్రాల్లో సరిపడా గన్ని బ్యాగులు అందుబాటులో ఉంచాలన్నారు. తేమ, బెరుకులు సాకుతో రైతులను నిలువునా దోపిడి చేస్తున్నారన్నారు. ప్రభుత్వ అధికారులు ప్రకటనలకు క్షేత్రస్థాయిలో ధాన్యం కొనుగోలుకు ఎలాంటి పొంతన లేకుండా పోయిందన్నారు. ధాన్యం కాంటా వేసే సందర్భంగా తూకాలలో మోసాలను అరికట్టాలన్నారు. అకాలవర్షాలు వచ్చే ప్రమాదం ఉన్నందున ప్రభుత్వం తక్షణమే కొనుగోలును వేగవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బూర వెంకటేశ్వర్లు, మండల కార్యదర్శి తొట్ల ప్రభాకర్, రైతు సంఘం నాయకులు యానాల వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

# విఓఎల సమస్యలు పరిష్కరించండి

ఎఐటియుసి మంచిర్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్

**ప్రజాపక్షం /రెబ్బన :** గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) పరిధిలోని విఓఎల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ డిమాండ్ చేశారు. విఓఎల జెఎసి ఆధ్వర్యంలో శుక్రవారం రెబ్బన మండల సమాఖ్య కార్యాలయం ఎదుట నిరవధిక సమ్మె ప్రారంభించారు. ఈ సందర్భంగా బోగే ఉపేందర్ మాట్లాడుతూ 20 ఏళ్లుగా క్షేత్రస్థాయిలో సేవలందిస్తున్న విఓఎలకు నెలకు కేవలం ఐదు వేల రూపాయలు ఇవ్వడం దారుణమన్నారు. విఓఎలను వెంటనే సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని, కనీస వేతనం 20 వేల రూపాయలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. హెచ్‌ఆర్ పాలసీ, ఇన్సూరెన్స్, పిఎఫ్, ఇఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని, సిసిలుగా పదోన్నతులు ఇవ్వాలని కోరారు. విఓఎలకు వ్యతిరేకంగా ఉన్న 58 జిఓను రద్దు చేసి, రాష్ట్ర నాయకత్వాన్ని చర్చలకు పిలవాలన్నారు. లేనిపక్షంలో 18 వేల మందితో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో విఓఎల సంఘం జిల్లా అధ్యక్షుడు భీమేష్, తిరుపతి, కృష్ణ, ప్రభాకర్, శంకర్, సురేఖ, కవిత, రజిత, రాజేశ్వరి, శ్రీనివాస్, సులోచన, రవి, లింగన్న, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.





## ఐక్యతతోనే బహుజనులకు రాజ్యాధికారం

మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు

**ప్రజాపక్షం/సూర్యాపేట:** ఐక్యతతోనే బహుజనులకు రాజ్యాధికారం దక్కుతుందని మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు అన్నారు. జిల్లా కేంద్రంలోని జే పంక్షన్ హాల్‌లో మాదిగల ఓట్లు, మాదిగలకే అనే నినాదంతో మాదిగ మహాశక్తి నాయకులు సగరపు ప్రసాద్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మాదిగ ఆత్మీయ సమ్మేళనానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. స్వాతంత్ర్యం వచ్చి ఏడు దశాబ్దాలు గడుస్తున్నా కాని మాదిగలు బతుకులు మారడంలేదని, రాష్ట్రంలో 70 లక్షల మంది మాదిగలు ఉంటే అగ్రకులాలైన రెడ్లు, కమ్మలు, వెలమలు, అధికారాన్ని చలయిస్తూ మాదిగలను, బహుజన కులాలను పావులుగా, ఓట్లు వేసి యంత్రాలుగా వాడుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ప్రతి నియోజకవర్గంలో 50వేలకు మంది పైగా మాదిగలు ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో బిసి పొలిటికల్ ప్రంట్ రాష్ట్ర చైర్మన్ బాలగోని బాలరాజ్‌గౌడ్, ప్రొఫెసర్ కనకయ్య, దుర్గయ్యగౌడ్, బండారు సుధాకర్, కెవి, మాచర్ల సైదులు, డేవిడ్, మస్తాన్, దయానందం, జయశంకర్, సూరయ్య పాల్గొన్నారు.

## వరి కొయ్యలను, పంట వ్యర్థాలను కాల్చవద్దు : ఎస్‌పి

**ప్రజాపక్షం/సూర్యాపేట:** వరి కొయ్యలకు, పంట వ్యర్థాలకు నిప్పంటించడం వల్ల పరిసరాలు తగులబడి అందులో విద్యుత్ మోటార్లు, స్టాటర్‌లు, కరెంట్ తీగలు, గడ్డివాములు, ఇతర పంటలు కాలిపోయి రైతులకు ఆర్థిక నష్టం కలుగుతుంది. దీని వల్ల భూమిలో ఉన్న పోషకాలు, క్రిమి కీటకాలు, సూక్ష్మ జీవులు, భూసారం తగ్గుతుందని, తద్వారా పంటల దిగుబడి తగ్గుతుందని సూర్యాపేట జిల్లా ఎస్‌పి కె.నర్సింహా శుక్రవారం తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. వరి కొయ్యలు కాల్చే క్రమంలో చుట్టుపక్కల ఉన్న వ్యవసాయ మోటార్లు, ఇతర సామాగ్రి, గడ్డివాములు ఇతర పంటలు కాలిపోతున్న సంఘటనలు జిల్లాలో అక్కడక్కడ నమోదు అవుతున్నాయని అన్నారు. మంటలు వేగంగా చాల ఎకరాల్లో వేగంగా వ్యాప్తి చెందుతాయని, ఇలా వ్యాప్తి చెందే మంటలు గ్రామాలను తాకే అవకాశం ఉందన్నారు. పంట భూముల్లో పంట వ్యర్థాలు, వరి కొయ్యలను ఎవరు కాల్చవద్దని కోరారు. రైతులు భూసారాన్ని, పర్యావరణాన్ని కాపాడుకోవాలని, మంటల వల్ల భూసారం తగ్గి ఎక్కువ ఎరువులు వేయాల్సి వస్తుందని, రైతుకు ఖర్చు పెరుగుతుందని, గాలి కాలుష్యం అవుతుంది. దట్టమైన పొగ కమ్మి రోడ్డు ప్రమాదాలు జరుగుతాయని అన్నారు.

## చైన్ స్నాచింగ్‌లకు పాల్పడుతున్న అంతర్ జిల్లా గ్యాంగ్ అరెస్ట్

రూ.22 లక్షల బంగారం స్వాధీనం

ఎస్‌పి శరత్ చంద్ర పవార్ వెల్లడి




**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** వృద్ధులు,మహిళలను లక్ష్యంగా చేసుకొని చైన్ స్నాచింగ్‌లకు పాల్పడుతున్న అంతర్ జిల్లా గ్యాంగ్‌ను నల్గొండ పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి రూ.22 లక్షల విలువైన 75 గ్రాముల బంగా రం, కారు,రెండు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్ శుక్రవారం తెలిపారు.మార్చి 10న కట్టంగూర్ మండలంలో అయితగోని సునీల్ వద్ద నుంచి ఇద్దరు తులాల బంగారు చైన్ లాక్కెళ్లిన ఘటనపై కేసు నమోదైంది. సీసీఎస్, కట్టంగూర్ పోలీసులు సంయుక్తంగా దర్యాప్తు చేపట్టి ఏ2షేక్ చాంద్ పాషా,ఏ3 సయ్యద్ రంజాన్‌ను అరెస్ట్ చేశారు.నేరానికి ఉపయోగించిన హ్యుందాయ్ వెర్నా కారును స్వాధీనం చేసుకున్నారు.పరారీలో ఉన్న ప్రధాన నిందితుడు ఏ1 పాకాల ధర్మతేజ కోసం గాలింపు కొనసాగుతోంది.వేసవిలో నేరాలు పెరిగే అవకాశం ఉన్నందున మహిళలు రాత్రిపూట ఒంటరిగా బయటకు వెళ్లవద్దని, ఖరీదైన ఆభరణాలతో డాబాలపై నిద్రించవద్దని ఎస్‌పి సూచించారు.ఈ కేసును సమర్థవంతంగా ఛేదించిన సీసీఎస్ సీఐ జితేందర్ రెడ్డి,సీఐ డి.చంద్రశేఖర్ రెడ్డి,శాలిగౌరారం ఇన్‌చార్జ్ సీఐ రాఘవరావు, కట్టంగూర్ ఎస్సై ఎం. రవీందర్, ఎస్ఐ డి.విజయ్ కుమార్,సీసీఎస్ సిబ్బంది హెడ్ కానిస్టేబుళ్లు విష్ణువర్ధనగిరి, నాగార్జున ప్రసాద్, పుష్పగిరి, వహీద్ పాషా,కానిస్టేబుళ్లు సాయి,శివరాజ్,జునైద్, నరేశ్, నాగరాణి, అలాగే కట్టంగూర్ పోలీస్ స్టేషన్ సిబ్బంది రామ్మోహన్, హెడ్ కానిస్టేబుల్, కానిస్టేబుల్ ఎండి. ముజీబ్ తదితరులను అభినందించారు.

## కాలేజీల్లో ప్రవేశాలకు చివరి తేదీ జూన్ 5

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** 2026 మార్చిలో పదో తరగతి ఉత్తీర్ణులై 400 మార్కులు,అంతకంటే ఎక్కువ సాధించిన ఎస్‌సి,ఎస్‌టి,బీసీ,ఈబీసీ, మైనార్టీ,దివ్యాంగ విద్యార్థుల నుంచి కార్పొరేట్ కళాశాలల్లో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్డు కులాల అభివృద్ధి శాఖ ఉప సంచాలకులు బి. శశికళ తెలిపారు.

## తవ్విన గుంతలను పూడ్చేశారు

ప్రజాపక్షం ఎఫెక్ట్

**ప్రజాపక్షం/చిట్యాల:** ఈ నెల 20వ తేదిన ప్రజాపక్షం దినపత్రికలో వచ్చిన వార్తకు వెంటనే స్పందించారు మున్సిపల్ చైర్‌పర్సన్ , కమిషనర్. మెగా గ్యాస్ కంపెనీ వారు ఇంటింటికి గ్యాస్ పైప్‌లైన్ కోసం గత నెల రోజుల క్రితం నల్లగొండ చిట్యాల మున్సిపాలిటి కేంద్రంలోని 6వ వార్డులో గల విద్యానగర్, సాయిబృందావన్ కాలనీలో గాతులను తవ్వి వదిలేశారు. దీంతో ఈ ప్రాంత ప్రజలకు, వాహనదారులకు అసౌకర్యంగా, ఇబ్బందికరంగా మారింది. ఈ విషయంపై ప్రజాపక్షం దినపత్రికలో 'తవ్వి వదిలేశారు' శీర్షికన వార్తను ప్రచురించి మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకువచ్చింది. వారు వెంటనే స్పందించి 21వ తేది గురువారం పైప్‌లైన్ పనులను పూర్తి చేసి గుంతలను పూడ్చివేయించారు. స్పందించిన చైర్మన్ పందిరి గీతారమేష్, కమిషనర్ గురులింగంలకు ఈ ప్రాంత ప్రజలు ధన్యవాదములు తెలియజేశారు.



ప్రభుత్వ కార్యక్రమాల అమలులో

# ప్రజా భాగస్వామ్యం అవసరం

మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి

నల్లగొండలో జిల్లాస్థాయి ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక సమీక్ష సమావేశం



**ప్రజాపక్షం/నల్లగొండ:** ప్రభుత్వ కార్యక్రమాల అమలులో ప్రజల భాగస్వామ్యం అవసరమని రాష్ట్ర శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు.ప్రజా పాలప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా గురువారం జిల్లా కేంద్రం సమీపంలోని బైపాస్ వద్ద ఉన్న ఎంఎన్‌ఆర్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన జిల్లాస్థాయి కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.రాష్ట్ర ప్రభుత్వం సమాజంలోని అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలు అమలు చేస్తోందని, ముఖ్యంగా రైతులకు రైతు బీమా,రైతు భరోసాతో పాటు 6 గ్యారంటీలను అమలు చేస్తోందని తెలిపారు. అయినప్పటికీ వివిధ రంగాలలో ఇంకా నెలకొన్న సమస్యలను పరిష్కరించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. రైతులు పంటల మార్పిడికి వెళ్లాలని, దేశ, కాల, వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని పంటలపై అవగాహన కల్పించుకోవాలన్నారు. రోజురోజుకు తగ్గిపోతున్న పశు సంపదను పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ప్రజా పాలప్రగతి ప్రణాళిక ప్రజల సంక్షేమానికి అంకితమైన కార్యక్రమమని అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసే కార్యక్రమాలను,త్వరలో అమలు చేయనున్న కొత్త పథకం కుటుంబ జీవిత బీమా పథకాన్ని వివరించారు.అంతకు ముందు జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ మాట్లాడుతూ మార్చి 6న ప్రారంభమైన ప్రజా పాలప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన కార్యక్రమాలను, సాధించిన విజయాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్,రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్,స్థానిక సంస్థల ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ వై. అశోక్ రెడ్డి,మున్సిపల్ చైర్మన్లు,కార్పొరేటర్లు, ఇతర ప్రజా ప్రతినిధులు,జిల్లా అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

**సంక్షేమ పథకాల అమలు,కార్మిక భద్రతపై అధికారుల నిర్లక్ష్యం తగదు: నెల్లికంటి సత్యం**



సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేయడంలో అధికారుల పాత్ర ఎంతో కీలకమని నెల్లికంటి సత్యం పేర్కొన్నారు.ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం అనేక పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నప్పటికీ అవి పూర్తిస్థాయిలో లబ్ధిదారులకు చేరేందుకు క్షేత్రస్థాయిలో మరింత పర్యవేక్షణ అవసరమని అభిప్రాయపడ్డారు. ము ఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ఇంకా తాగునీరు, ఆరోగ్యం, ఉపాధి,గృహాలు,రేషన్ వంటి అంశాలలో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రజా సమస్యలను వెంటనే గుర్తించి పరిష్కరించే విధంగా అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు.జిల్లాలలో ఉన్న పరిశ్రమలలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, కార్మికుల భద్రత విషయంలో యాజమాన్యాలు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నాయని ఆయన విమర్శించారు. పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలను కచ్చితంగా అమలు చేయించాల్సిన బాధ్యత అధికారులదేనని స్పష్టం చేశారు.కార్మికుల ప్రాణాలకు ముప్పు కలగకుండా ఫ్యాక్టరీలలో భద్రతా చర్యలను కఠినంగా అమలు చేయాలని, తరచూ తనిఖీలు నిర్వహించాలని కోరారు.ప్రమాదాలు జరిగిన తర్వాత స్పందించడం కంటే ముందస్తు చర్యలతో వాటిని నివారించడం ముఖ్యమని సత్యం తెలిపారు. కార్మిక సంక్షేమం, ప్రజల భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించబోమని ఆయన హెచ్చరించారు.



## రైతులకు ఎలాంటి ఇబ్బందులు రావొద్దు

ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి

రైస్ మిల్లును ఆకస్మికంగా తనిఖీ

**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :** భువనగిరి మండలం అనాజీపురం గ్రామంలోని మల్లికార్జున రైస్ మిల్లును భువనగిరి నియోజకవర్గ శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మిల్లులో జరుగుతున్న ధాన్యం కొనుగోలు, నిల్వలు, మిల్లింగ్ ప్రక్రియ, రైతులకు అందుతున్న సౌకర్యాలపై పరిశీలించారు. అనంతరం సంబంధిత నిర్వాహకులు, అధికారులతో మాట్లాడిన ఎమ్మెల్యే, రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని, ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. రైతులకు నాణ్యమైన సేవలు అందేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్, జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# 'నేడు' యాదగిరిగుట్టకు సిఎం

ఏర్పాట్లను పరిశీలించిన

ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య



**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట :** ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి శనివారం యాదగిరిగుట్టకు విచ్చేస్తున్న నేపథ్యంలో, ఆలేరు నియోజకవర్గ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య ఏర్పాట్ల బాధ్యతను భుజాన వేసుకున్నారు. సీఎం పర్యటనను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఆయన, శుక్రవారం ఉదయమే యాదగిరిగుట్టకు చేరుకొని క్షేత్రస్థాయిలో ఏర్పాట్లను క్షుణ్ణంగా పరిశీలించారు.

ముఖ్యమంత్రి పర్యటనలో ఎలాంటి లోటుపాట్లు రాకుండా, అన్ని శాఖలను సమన్వయం చేస్తూ ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య స్వయంగా పనులను పర్యవేక్షించడం విశేషం. టెంపుల్ సిటీ పరిసరాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులు, భద్రతా చర్యలు, పారిశుధ్య నిర్వహణ, మరియు ట్రాఫిక్ నియంత్రణపై అధికారులతో కలిసి ఆయన సుదీర్ఘంగా సమీక్షించారు.

హెలిప్యాడ్ వద్ద 'విప్' సమీక్ష

ముఖ్యమంత్రి దిగనున్న హెలిప్యాడ్ వద్దకు చేరుకున్న ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య అక్కడ కల్పించిన సదుపాయాలను స్వయంగా తనిఖీ చేశారు. భద్రతా ఏర్పాట్లు, సీఎం కాన్వాయ్ రూట్ మ్యాప్, వాహనాల పార్కింగ్ స్థలాలను పరిశీలించారు. సీఎం పర్యటనకు వచ్చే ప్రజల కు, భక్తులకు ఎక్కడా ఎలాంటి చిన్న ఇబ్బంది కూడా కలగకుండా పకడ్బందీగా మార్గదర్శకాలను అమలు చేయాలని అధికారులను ఆదేశించారు.

**ఆలేరు నియోజకవర్గ ప్రగతికి సరికొత్త ఊతం: బీర్ల అయిలయ్య**

ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి పర్యటనను విజయవంతం చేయడానికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో, అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆశీస్సులతో, సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో టెంపుల్ సిటీ అభివృద్ధికి మరింత ఊతం లభిస్తుందని, ఆలేరు నియోజకవర్గం ప్రగతి పథంలో దూసుకుపోతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో యాదగిరిగుట్ట ఏసిపి శ్రీనివాస్ నాయుడు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మంగ సత్యనారాయణ, గుండ్లపల్లి భరత్ గౌడ్, కౌన్సిలర్లు బూడిద మధు, మాజీ ఎంపీపీ చీర శ్రీశైలం, దుంబాల వెంకటరెడ్డి, హేమేంధర్ పాల్గొన్నారు.



## పిల్లలమర్రి ఐకెపి-2 సెంటర్‌లో భారీ మోసం

ఐకెపి నిర్వాహకులు మిల్లర్ల కుమ్మక్కు...

లారీకి 35 నుంచి 40 బస్తాల ధాన్యం కోత

అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదంటూ మీడియా ఎదుట రైతుల ఆవేదన

**ప్రజాపక్షం/సూర్యాపేట :** సూర్యాపేట మున్సిపాలిటి పరిధిలోని పిల్లలమర్రి ఐకెపి2 సెంటర్‌లో భారీ మోసం వెలుగు చూసింది. ఐకెపి నిర్వాహకులు, మిల్లర్ల కుమ్మక్కై లారీ ధాన్యములో 35 నుండి 40 బస్తాలు కోత విధిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా ఏ మాత్రం పట్టించుకోవడంలేదంటూ శుక్రవారం మీడియా ఎదుట తమ ఆవేదనను వెలుబుచ్చారు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన రైతులు ఉపేందర్, చెరుకు సైదులు, మట్టిపెల్లి వెంకన్న మాట్లాడుతూ ఐకెపి సెంటర్ నిర్వహిస్తున్న కోట్ల మంజుల, రామిశెట్టి సోమమ్మ, తూటపల్లి అలివేలు మిల్లర్లతో కుమ్మక్కై ధాన్యం కాంటాలు వేసిన తరువాత ట్రక్ షీట్‌లలో తప్పుడు లెక్కలు చూపుతున్నారని ఆరోపించారు. మిల్లుల వద్దకు ధాన్యాన్ని ఎగుమతి చేసిన తరువాత మిల్లర్లు ఏ గ్రేడ్ ఉన్న తమ ధాన్యంలో కోత విధించారని ఆవేదన వ్యక్తం చేశారు. తమతో పాటు కొంతమంది రైతుల ధాన్యం 896 బస్తాలు మిల్లుకు ఎగుమతి చేయగా మిల్లర్లు ధాన్యం బాగోలేదని లారీకి 40 బస్తాలు కోత విధించడంతో రూ.30వేల వరకు నష్టపోతున్నామని ఆవేదన వెలుబుచ్చారు. గతంలో కూడా ఈ ఐకెపి సెంటర్‌లో అక్రమాలు జరుగుతున్నాయని తమకు కూడా అన్యాయం కూడా జరిగిందని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకవెళ్ళినా పట్టించుకోవడం లేదన్నారు. ట్రక్ షీట్ల మార్పు, సెల్‌ఫోన్ కాల్ డేటాను పరిశీలించి జరిగిన మోసంపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని అధికారులను వేడుకున్నారు.

## ఇసుక ట్రాక్టర్ పట్టివేత

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** పాలేరు వాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఒక ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకున్న సంఘటన మండలంలోని తక్కెళ్లపాడు గ్రామ శివారులో చోటు చేసుకుంది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తక్కెళ్లపాడు గ్రామానికి చెందిన దొంతగాని భిక్షం ట్రాక్టర్‌లో గ్రామ శివారులోని పాలేరు వాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తుండగా సమాచారం అందుకున్న పోలీసులు ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకోని పరిశీలించగా అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్నట్లు గుర్తించి పట్టుబడిన ట్రాక్టర్‌ను స్టేషన్‌కు తరలించి దొంతగాని భిక్షంపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

# యువకుడి హత్యకేసులో ముగ్గురు నిందితుల అరెస్ట్

సాంకేతిక ఆధారాలతో నేరస్తులను గుర్తించిన పోలీస్ బృందం : డిఎస్‌పి శ్రీనివాసరెడ్డి



**ప్రజాపక్షం/కోదాడ రూరల్ :** యువకుని హత్యకేసులో సాంకేతిక ఆధారాలతో నేరస్తులను గుర్తించి ముగ్గురు నింధితులను అరెస్టు చేసినట్లు కోదాడ డిఎస్‌పి శ్రీనివాస రెడ్డి తెలిపారు. శుక్రవారం డిఎస్‌పి కార్యాలయం నందు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కోదాడ మండల పరిధిలోని గణపవరం గ్రామ శివారులో జరిగిన హత్య కేసు చేదన, నిందితుల అరెస్టు వివరాలను వెల్లడించారు. ఈనెల 15న గణపవరం గ్రామ శివారులో భీక్య తండ రోడ్డుకు సమీపంలోని వ్యవసాయ భూమిలో ఒక యువకుడు హత్యకు గురై మృతదేహంగా లభ్యమైన విషయం తెలుసుకున్న పోలీసులు, క్లూస్ టీమ్, ప్రత్యేక పోలీస్ బృందాలు శాస్త్రీయ ఆధారాలు, సాంకేతిక సమాచారంతో దర్యాప్తు చేపట్టారన్నారు. దర్యాప్తులో గరిడేపల్లి మండలం కొత్తగూడెం గ్రామానికి చెందిన నింధితుడు పగిళ్ళ ఉదయ్ కిరణ్‌ను అదుపులోకి తీసుకొని విచారించగా నేరాన్ని ఒప్పుకున్నట్లు చెప్పారు. నిందితుడు తెలిపిన వివరాల ప్రకారం మృతుడు బలుగూరి గణేష్ అనే వ్యక్తి సోమేష్ ఏకాంతంగా ఉన్నప్పుడు తీసుకున్న ఫోటోల విషయంలో నింధితుల మధ్య విభేదాలు ఏర్పడ్డాయన్నారు. ఈ క్రమంలో హుజూర్‌నగర్‌కు చెందిన బరెంకుల సోమేష్ తండ్రి సాంబయ్య, తన స్నేహితుడు ఉదయ్ కిరణ్ సహాయంతో పథకం ప్రకారం గణేష్‌ను 14వ తేదీ రాత్రి సమయంలో గణపవరం సమీపంలోని నిర్మానుష్య ప్రదేశానికి పిలిపించి అక్కడ ముందుగా సిద్ధం చేసుకున్న రాళ్ళతో తలపై బలంగా దాడిచేసి, అనంతరం గొంతు బిగించి హత్య చేయడంతోపాటు కత్తితో గొంతు కోసినట్లు నింధితుడు ఒప్పుకున్నట్లు వివరించారు. బరెంకుల సోమేష్‌కు సహకరించిన అతని తల్లిదండ్రులు అయిన బరెంకుల జ్యోతి, బరెంకుల సాంబయ్యలను కూడా అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. ఏ1 నింధితుడు బరెంకుల సోమేష్ కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నట్లు చెప్పారు. ప్రజలు సోషల్ మీడియా ద్వారా ఏర్పడే పరిచయాల విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. వ్యక్తిగత వివాదాలు ఉంటే చట్టఉల్లంఘన చర్యలకు పాల్పడవద్దని సూచించారు. చట్టపరిధిలో సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. ఈ సమావేశంలో సిఐ రామకృష్ణారెడ్డి, ఎస్ఐ గోపాల్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

# సూర్యాపేట జిల్లా అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయం

మహిళా సంఘాల భవనాలకు వెంటనే నిధులు మంజూరు

క్షేత్రస్థాయిలో రూ.10లక్షలతో షెడ్స్ నిర్మాణానికి ప్రతిపదనలు పంపాలి : కలెక్టర్ తేజస్‌నంద్‌లాల్ పవార్




**ప్రజాపక్షం/సూర్యాపేట:** జిల్లా సమగ్ర అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు కోసం క్షేత్రస్థాయి అధికారులు సమిష్టి ఆలోచనలతో కలిసికట్టుగా పనిచేస్తూ జిల్లాను ముందంజలో నిలపాలని జిల్లా కలెక్టర్ తేజస్‌నంద్‌లాల్ పవార్ పిలుపునిచ్చారు. ప్రజా పాలన, ప్రగతి ప్రణాళిక నివేదికపై నిర్వహించిన జిల్లాస్థాయి సమావేశం స్థానిక రవిమహల్ పంక్షన్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్‌పి నర్సింహాతో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందేలా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. మండల, జిల్లాస్థాయి అధికారులు ప్రజల సమస్యలు పరిష్కారం అయ్యే వరకు వారికి తోడుగా ఉంటారని భరోసా ఇచ్చారు.

**మహిళా సంఘాల భవనాలకు ప్రాధాన్యత :** గ్రామాల్లో మహిళ సంఘాలకు స్వంత భవనాలు లేకపోతే సంబంధిత ఎంపిడివో ద్వారా తగిన ప్రతిపాదనలు పంపించాలని, అలా వచ్చిన ప్రతిపాదనలకు వెంటనే నిధులు మంజూరు చేస్తామని కలెక్టర్ స్పష్టం చేశారు. జిల్లాలో ఇప్పటి వరకు 370కి పైగా భవనాలు ప్రతిపాదనలు వచ్చాయని, వాటిలో ఇప్పటికే 200 మహిళ సంఘ భవనాలకు గ్రౌండింగ్ పూర్తి చేయడం జరిగిందని ఆయన వెల్లడించారు. అదే విధంగా క్షేత్రస్థాయిలో మహిళల సౌకర్యార్థం రూ. 10 లక్షల వ్యయంతో షెడ్స్ నిర్మించుకునే అవకాశం ఉందని, వీటి కోసం కూడా త్వరితగతిన ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపాలని అధికారులను అదేశించారు.

**ప్రత్యేక అవసరాల పిల్లలకు చేయూత :** దివ్యాంగుల సంక్షేమంపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఇందులో భాగంగా జిల్లాలోని 50 మంది ప్రత్యేక అవసరాల గల పిల్లలకు రూపొందించిన 342 ప్రత్యేక పరికరాలను అందజేస్తున్నట్లు ప్రకటించారు. ఈ పరికరాలను ప్రత్యేకంగా అలింకో కంపెనీ ద్వారా నాణ్యత ప్రమాణాలతో తయారు చేయించినట్లు పేర్కొన్నారు. జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించేందుకు సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్క అధికారి, సిబ్బంది పూర్తిస్థాయిలో సహకరించాలని ఈ సందర్భంగా కలెక్టర్ కోరారు. అనంతరం జిల్లా ఎ స్‌పి కె.నర్సింహా మాట్లాడుతూ మాదకద్రవ్యాలను కూకట్ వేళ్లతో పెకలించాలని పిలుపునిచ్చారు. రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రజల్లో చైతన్యం తీసుకరావాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా సమాజంలో యువతను, విద్యార్థులను పీడిస్తున్న గంజాయిలాంటి మాదకద్రవ్యాలను కూకటివేళ్లతో పెకలించి వేయడానికి ప్రతి ఒక్కరు బాధ్యతగా పనిచేయాలని పిలుపునిచ్చారు. మహిళలు, పిల్లల రక్షణకోసం ఏర్పాటు చేసిన భరోసా సెంటర్లు, షీటీమ్స్, మానవ అక్రమ రవాణ నిరోదక విభాగాలు మరింత పటిష్టంగా పనిచేస్తూ బాధితులకు అండగా నిలుస్తుందని స్పష్టం చేశారు. అనంతరం ప్రజాపాలన, ప్రగతి నివేదికలో భాగంగా జిల్లా పోలీస్‌శాఖ ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను జిల్లా కలెక్టర్ తేజస్‌నంద్‌లాల్ పవార్, జిల్లా ఎస్‌పి కె.నర్సింహా, ఇతర ఉన్నతాధికారులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా సైబర్ మోసాల నివారణ, మహిళ భద్రత, రోడ్డు భద్రతకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. పోలీస్‌శాఖ తరుపున క్షేత్రస్థాయిలో చేపడుతున్న వివిధ సేవా, రక్షణ కార్యక్రమాలను ఎస్‌పి కలెక్టర్‌కు వివరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మరణించిన ఇద్దరు ఉద్యోగుల పిల్లలకు కారుణ్య నియామక ఆర్డర్ పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి.హరిసింగ్, పెరిక కార్పోరేషన్ చైర్మన్ దొంగరి వెంకటేశ్వర్లు, మున్సిపల్ చైర్‌పర్సన్ మురిశెట్టి నివేదిక, వైస్‌చైర్మన్ షఫి ఉల్లా, డిఆర్‌డిపి సన్యాసయ్య, జడ్పి సిఈవో శీరిష, హౌజింగ్ పిడి సిద్దార్ధ, సిపివో కిషన్, డిఎస్‌సిడిఓ దయానందరాణి, మున్సిపల్ కమిషనర్ హనుమంతరెడ్డి పాల్గొన్నారు.

## సిజెపి ఎక్స్ హ్యాండిల్‌ను వెంటనే పునరుద్ధరించాలి

ఎఐవైఎఫ్ జాతీయ కార్యదర్శి డాక్టర్ సయ్యద్ వలీ ఉల్లా ఖాద్రి



ప్రజాపక్షం/ వరంగల్ : సిజెపి ఎక్స్ హ్యాండిల్‌ను వెంటనే పునరుద్ధరించాలని, సిజెపిఎక్స్ హ్యాండిల్‌ను నిలిపివేయడాన్ని ఏఐవైఎఫ్ జాతీయ కార్యదర్శి డాక్టర్ సయ్యద్ వలీ ఉల్లా ఖాద్రి తీవ్రంగా ఖండించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో భావ ప్రకటనా స్వేచ్ఛ, సమాచార హక్కు, ఇంటర్నెట్ స్వేచ్ఛలు అత్యంత ప్రాథమికమైన హక్కులని ఆయన పేర్కొన్నారు. ప్రజా ప్రయోజనాల కోసం, రాజ్యాంగ విలువల పరిరక్షణ కోసం పనిచేస్తున్న సంస్థల గొంతుకలను అణచివేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమన్నారు. ఎక్స్ సంస్థ ఇంటర్నెట్ స్వేచ్ఛను గౌరవించి, ఎటువంటి ఆలస్యం లేకుండా సిజెపి హ్యాండిల్‌ను వెంటనే పునరుద్ధరించాలని ఆయన డిమాండ్ చేశారు. భిన్నాభిప్రాయాలను అణచివేసే చర్యలు ప్రజాస్వామ్య విలువలకు హానికరమని, సామాజిక మాధ్యమ వేదికలు పారదర్శకత, బాధ్యతాయుత విధానాలను పాటించాలని సూచించారు.

## కేసముద్రంలో శంకుస్థాపనకే పరిమితమైన అగ్నిమాపక కేంద్రం



కేసముద్రం/ప్రజాపక్షం: కేసముద్రం మండల కేంద్రంలో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు కేవలం శంకుస్థాపనకే పరిమితమైందని, ప్రజా ప్రతినిధులు, అధికారులు తక్షణమే అగ్నిమాపక కేంద్రం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం సిపిఐ మండల నాయకులు మంద భాస్కర్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంద భాస్కర్ మాట్లాడుతూ పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న కేసముద్రం మున్సిపాలిటీగా ఏర్పడిందని, అనేక మిల్లులు, ట్రేడింగ్ కంపెనీలు, బట్టల దుకాణాలతో పాటు వివిధ రకాల షాపులతో అనేక మంది కార్మికులు జీవిస్తున్నారని తెలిపారు. గతంలో మిల్లులు,దుకాణాలతో పాటు గ్రామీణ ప్రాంతాలలో అగ్నిప్రమాదాలు జరిగాయని, మహబూబాబాద్ జిల్లా కేంద్రం నుండి అగ్నిమాపక వాహనం రావడం ఆలస్యం కావడం చేత ప్రజలు తీవ్రంగా నష్ట పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో మంజూరైన ఫైర్ స్టేషన్‌కు స్థల సేకరణతో అధికారులు చేతులు దులుపుకున్నారని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అనేక అభివృద్ధి కార్యక్రమాలలో భాగంగా అగ్నిమాపక కేంద్రం ఏర్పాటుకు శంకుస్థాపన చేశారన్నారు. గురువారం ప్రమాదవశాత్తూ ఏర్పడిన అగ్ని ప్రమాదంతో మండలంలోని అర్పణపల్లి, కోరుకొండపల్లి గ్రామాల్లో అగ్ని ప్రమాదం సంబవించి వందల ఎకారాల్లో రైతులు తీవ్రంగా నష్ట పోయారని తెలిపారు. ప్రభుత్వం, ప్రజా ప్రతినిధులు, అధికారులు ఇప్పటికైనా స్పందించి మండల కేంద్రంలో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు జన్ను రాజేందర్, వెంకన్న, జిలాని, వెంకన్న, ఉప్పలయ్య పాల్గొన్నారు.

## వడదెబ్బతో ఆటో డ్రైవర్ మృతి



ప్రజాపక్షం/ఖిలా వరంగల్: వరంగల్ నగరంలో ఆటో డ్రైవింగ్ చేస్తూ ఉపాధి పొందుతున్న ఆటో డ్రైవర్ వేసవి ఎండ తీవ్రత కారణంగా మృతి చెందిన సంఘటన శుక్రవారం జరిగింది. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. నగరంలోని ఖిలా వరంగల్ మండలం రంగశాయిపేట, శ్రీసాయినగర్ గంగపుత్ర(బెస్త) కులానికి చెందిన విండ్ల సంతోష్ కుమార్(49) గత ముప్పై సంవత్సరాల నుండి ఆటో డ్రైవింగ్ చేస్తే జీవనోపాధి పొందుతున్నాడు. ప్రతి రోజు లాగే శుక్రవారం మధ్యాహ్నం తన ఆటోలో ప్రయాణీకులను ఎక్కించుకొని వరంగల్ బస్టాండ్ ప్రాంతంలో ప్రయాణికులను దింపి దాహంతో ఉన్న తాను పక్కన మంచి నీరు తాగుతుండగానే క్రింద పడిపోయాడు. దీనితో తోటి ఆటో డ్రైవర్లు 108 అంబులెన్స్‌కు ఫోన్ చేశారు. దీనితో అంబులెన్స్ సిబ్బంది పరీక్షలు చేయగా ముందే మరణించినట్లు నిర్ధారణ చేశారు. అనంతరం మృతుడి వివరాలు తెలుసుకొని వారి కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుతో మృతున్ని ఇంటికి తీసుకెళ్ళారు. గత ముప్పై సంవత్సరాల నుండి ఆటో డ్రైవింగ్ చేస్తూ జీవనోపాధి పొందుతున్న, వేసవి ఎండ తీవ్రతతో మృతి చెందిన విండ్ల సంతోష్ కుమార్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు. మృతుని భార్య గృహిణి కాగా ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు. రంగశాయిపేట గంగపుత్ర సంఘం సభ్యుడైన సంతోష్ కుమార్‌ను పలువురు సంఘం నాయకులు, సభ్యులు, తోటి ఆటో డ్రైవర్లు సందర్శించి నివాళులు అర్పించి సానుభూతి తెలిపారు.

## వడదెబ్బతో మహిళ మృతి



ప్రజాపక్షం/గూడూరు: మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం మచ్చర్ల గ్రామంలో విషాద ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన కొట్టెం భద్రమ్మ (60) రోజు వారీ కూలీ పనులు చేస్తూ జీవనం సాగించేది.శుక్రవార ఉదయం సమీపంలోని మిర్చి తోటలో మిరప పండ్లు వెరడానికి పనుల కోసం వెళ్లిన ఆమే తీవ్ర ఎండ వేడిమిని తట్టుకోలేక అకస్మాత్తుగా అస్వస్థతకు గురైనట్లు సహచర కూలీలు తెలిపారు.గమనించిన తోటి కార్మికులు వెంటనే ఆమేను ఇంటికి తరలించగా అప్పటికే పరిస్థితి విషమించిందని కుటుంబ సభ్యులు పేర్కొన్నారు.అనంతరం ఆమే మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు.వడదెబ్బ కారణంగానే ఆమే ప్రాణాలు కోల్పోయినట్లు స్థానికులు భావిస్తున్నారు. ఈఘటనతో మచ్చర్ల గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.కటుంబ సభ్యుల రోదనలు హృదయ విదారకంగా మారాయి. గ్రామస్తులు భద్రమ్మ మృతి పై తీవ్రదిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

## ఫార్మర్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగవంతం

ప్రజాపక్ష/జనగామ: కేంద్ర ప్రభుత్వ పథకాలు, రాయితీలు పొందడం కోసం ఫార్మర్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా వ్యవసాయ శాఖ సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం ఫార్మర్ రిజిస్ట్రీ, క్రాప్ బుకింగ్, రైతు బీమా పై కలెక్టరేట్‌లో వ్యవసాయ శాఖ అధికారులతో సమీక్ష నిర్వయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా మాట్లాడుతూ వ్యవసాయ విస్తరణ అధికారులు, సిబ్బంది క్షేత్ర స్థాయిలో పర్యటించి అర్హులైన ప్రతి రైతుతోనూ ఫార్మర్ రిజిస్ట్రేషనే చేయించాలన్నారు. ఫార్మర్ రిజిస్ట్రేషన్, రైతు భీమా డిజిటల్ క్రాప్, సర్వే రైతు నేస్తం, మట్టి పరీక్షలు, ఫర్టిలైజర్ యాప్ రైతు ఫక్షన్ నెంబర్ అప్డేడ్‌పై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. భూమి ఉన్న ప్రతి రైతు తన ఉన్న భూములకు సంబందించిన వివరములతో కూడిన సమాచారాన్ని వ్యవసాయ విస్తరాణాధికారులకు ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అంబికాసోని, ఎడిఎలు, ఎఏఓలు పాల్గొన్నారు.

# ప్రతి ఇంటికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు

అర్హుల జాబితా వెంటనే సిద్ధం చేయాలి

జూన్ రెండవ తేదీ నుండి రెండవ విడత ఇందిరమ్మ ఇండ్లు, నూతన పెన్షన్ల మంజూరు: మంత్రి సీతక్క

ప్రజాపక్షం/ములుగు: ప్రజాపాలన...ప్రగతి ప్రణాళికతో ప్రతి ఇంటికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందిస్తున్నామని, సంక్షేమ పథకాలకు అర్హుల జాబితా వెంటనే సిద్ధం చేయాలని, జూన్ రెండవ తేదీ నుండి రెండవ విడత ఇందిరమ్మ ఇండ్లు, నూతన పెన్షన్లు మంజూరు చేస్తామని, ప్రీ ప్రైమరీ నుండి ఇంటర్మీడియట్ వరకు విద్యార్థులకు బ్రేక్‌ఫాస్ట్ పథకం అమలు చేయబోతున్నామని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమశాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క తెలిపారు. శుక్రవారం ప్రజాపాలన...ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ములుగు జిల్లా స్థాయి సమావేశాన్ని లీలా గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవ రావు అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర పంచాయతీరాజ్, మహిళా శిశు సంక్షేమ శాఖ, గ్రామీణ నీటి సరఫరా శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క ముఖ్య అతిథిగా హాజరై రాష్ట్ర గేయం జయ జయహే తెలంగాణ ఆలపించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక ద్వారా ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాల ఫలాలు అందుతాయని తెలిపారు. 2026 మార్చి 6 నుండి జూన్ 12 వరకు జరుగుతున్న ఈ కార్యక్రమంలో గ్రామ, మండల, నియోజకవర్గ స్థాయి పూర్తి చేసుకొని నేడు జిల్లా స్థాయి సమావేశం నిర్వహించుకోవడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వ అత్యంత ప్రతిష్టాత్మక పథకాలపై ప్రజలకు పూర్తి అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశ్యమని మంత్రి పేర్కొన్నారు. పాలనలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచి, జిల్లా స్థాయి సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించే విధంగా చూడాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. మే 18 నుండి 23 వరకు జరుగుతున్న యువత , క్రీడలు వారోత్సవాలు స్ఫూర్తితో యువతను క్రీడల్లో ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్‌సి సుధీర్ రామ్‌నాథ్ కేకన్, ఐటిడిఏ ప్రాజెక్టు ఆఫీసర్ లెనిన్ వత్సల్ టోప్పో, సిహెచ్ మహేందర్ జి, సంపత్‌రావు, రవిచందర్, రేగ కళ్యాణి, చంద్రకళ, భగవాన్ రెడ్డి, రవీందర్ రెడ్డి, ఆర్‌డిఓ వెంకటేష్, కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, ప్రజా ప్రతినిధులు, జిల్లా అధికారులు, సంబంధిత అధికారులు, పాల్గొన్నారు.



**జర్నలిస్టుల ఇళ్ల స్థలాలకు కృషి చేస్తా: మంత్రి సీతక్క**

ములుగు జిల్లాలో అర్హులైన జర్నలిస్టులందరికి ఇళ్ల స్థలాలు ఇప్పించేందుకు కృషి చేస్తానని రాష్ట్ర పంచాయతీ రాజ్, మహిళా, శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క అన్నారు. ఈ మేరకు శుక్రవారం ములుగు జిల్లా కేంద్రంలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో ఇటీవల నూతనంగా ఎన్నికైన టియూడబ్ల్యూజే(ఐజేయూ) యూనియన్ కార్యవర్గం మంత్రి సీతక్కను మర్యాదపూర్వకంగా కలిసి మెమొంటో అందించి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ ములుగు జిల్లాలో జర్నలిస్టులు ఐకమత్యంతో పనిచేసి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని అన్నారు. జర్నలిస్టుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. త్వరలోనే జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించే దిశగా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని అన్నారు. జర్నలిస్టుల ప్రధాన సమస్య అయిన ఇళ్ల స్థలాలను రాష్ట్ర ప్రభుత్వం త్వరలోనే మంచి శుభవార్త వెలువడనుందని తెలిపారు. అనంతరం జర్నలిస్టులకు శాలువ కప్పి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్, ఎస్‌పిలను మర్యాదపూర్వకంగా కలిసి మెమొంటో అందించి, శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎండి షఫీ అహ్మద్, కార్యదర్శి చిదురాల వాసు, ఉపాధ్యక్షులు బిక్కనూరి సుమన్, చింతల దేవేందర్, అలుగొండ రమేష్, శంకర్, సునర్కాని శ్యామ్, మల్లేష్, హబీబ్ ఖాన్, నరసింహచారి, జంపాల శ్యామ్, నాయకపు రాజు, సంపత్ రావు, గాదె సుమన్, వివిధ జర్నలిస్టులు, పాల్గొన్నారు.

## విద్య, సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలి: కలెక్టర్



ప్రజాపక్షం/జనగామ : అధికారులు, ప్రజాప్రతినిధుల సమిష్టి కృషితోనే జిల్లా సమగ్రాభివృద్ధి చెందుతుందని జనగామ జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా అన్నారు. ప్రభుత్వ పథకాల అమలులో ప్రజలే కేంద్ర బిందువులని, విద్యా, సంక్షేమ పథకాలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో ప్రజాపాలనప్రగతి ప్రణాళికలో భాగంగా జిల్లా స్థాయి సమావేశం నిర్వయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు భరోసాతో ప్రభుత్వం రైతులకు అండగా ఉందని, ఇందిరమ్మ ఇళ్లు ప్రతి కుటుంబానికి సొంతింటి కలను సాకారం చేస్తుందనానరు. విద్య, సంక్షేమ రంగాలకు అధిక ప్రాధాన్యత ఇస్తు విద్యార్థుల భవిష్యత్తుకు పునాధులు వేయాలన్నారు. పంటల మార్పిడిలో భాగంగా లాభదాయక పంటలపై దృష్టి పెట్టాలన్నారు. ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడం, స్థానిక అవసరాలకు ప్రాధాన్యత ఇవ్వడం తదితర అంశాల లక్ష్యంగా ప్రభుత్వం ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించాలని, జిల్లా స్థాయిలో ప్రజల సమస్యలు, అవసరాలు, ప్రాధాన్యతను నేరుగా తెలుసుకొని భవిష్యత్తు అభివృద్ధి మార్గాన్ని ప్రజలతో కలిసి రూపొందించాలన్నారు. వివిధ శాఖల అధికారులు తమ పరిధిలో అమలవుతున్న సంక్షేమ పథకాలను వివరించారు. రైతు భరోసా కింద యాసంగి పంట కాలనికి లక్షా 85వేల 504 మంది రైతులకు 152 కోట్ల 10లక్షల 50వేల 84 రూపాయలు వార ఖాతాలో జమ చేయడం జరిగిందనానరు. కొత్తగా 25వేల 972 రేషన్ కార్డులు, గృహజ్యోతి ద్వారా 97వేల 157 మందికి ఉచిత విద్యుత్, మొదటి విడతలో ఇందిరమ్మ ఇళ్లు 5వేల 652, ఇవ్వగా అందులో 5వేల 339 ఇళ్లు గ్రౌండింగ్ చేయడం జరిగిందన్నారు. జిల్లాలో వివిధ సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బెన్షాలోమ్, అధికారుల, తహాశీల్దార్లు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## న్యాయం జరుగుతుందని భరోసా ప్రజల్లో కలిగించాలి: సిపి

ప్రజాపక్షం/వరంగల్ క్రైమ్: పోలీస్ స్టేషన్ కు వచ్చే బాధితులకు న్యాయం జరుగుతుందనే భరోసాను కలిగించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ తెలిపారు. టాస్క్ ఫోర్స్ నూతన ఇన్స్ స్పెక్టర్ గా బాధ్యతలు చేపట్టిన బండారి రాజుతో పాటు,మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్ నూతన ఇన్స్ స్పెక్టర్ బాధ్యతలు చేపట్టిన కె. స్వామి గురువారం వరంగల్ పోలీస్ కమిషనర్ ను మర్యాదపూర్వకంగా కలుసుకొని మొక్కను అందజేశారు. ఫిర్యాదులపై పారదర్శకంగా విచారణ చేపట్టాలని ఇరువురు అధికారులకు సీపీ తెలిపారు.

## పకడ్బందీగా యుపిఎస్‌సి సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్షలు

కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి



ప్రజాపక్షం/హనుమకొండ : ఈ నెల 24వ తేదీన ఆదివారం నిర్వహించనున్న యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్షలను పకడ్బందీగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన సమన్వయ సమావేశంలో పరీక్షల నిర్వహణపై కలెక్టర్ అధికారులతో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ హన్మకొండ జిల్లాలో మొత్తం 10 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లాలో మొత్తం 4,075 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరుకానున్నారని పేర్కొన్నారు. పరీక్షలు ఎటువంటి అవాంఛనీయ ఘటనలు లేకుండా సజావుగా నిర్వహించేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.పరీక్షల నిర్వహణ కోసం 10 మంది లోకల్ ఇన్‌స్పెక్టర్లు, ఇన్‌స్పెక్టింగ్ అధికారులు, 10 మంది సూపర్వైజర్లను నియమించినట్లు తెలిపారు. న్యూఢిల్లీకి చెందిన ప్రైవేట్ సెక్రటరీ శుభం గౌడ్ సెంట్రల్ లెవెల్ ఇన్‌స్పెక్షన్ ఆఫీసర్‌గా, కే వరుణ్ రెడ్డి, ఐఏఎస్, సీఎండీ, టీజీఎన్‌పీడీసీఎల్ రాష్ట్ర స్థాయి అబ్జర్వర్‌గా వ్యవహరిస్తారని వెల్లడించారు.ఆదివారం ఉదయం 9:30 గంటల నుండి 11:30 గంటల వరకు, మధ్యాహ్నం 2:30 గంటల నుండి 4:30 గంటల వరకు రెండు సెషన్లలో పరీక్షలు నిర్వహించబడతాయని తెలిపారు. పరీక్ష ప్రారంభానికి 30 నిమిషాల ముందే పరీక్షా కేంద్రాల ప్రధాన గేట్లు మూసివేయబడతాయని, అనంతరం ఒక్క నిమిషం ఆలస్యమైనా అభ్యర్థులను అనుమతించబోమని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రవి, జిల్లా రెవెన్యూ అధికారి రమేష్, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

**24వ తేదీన నిర్వహించనున్న యుపిఎస్‌సి సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్షలకు హన్మకొండ జిల్లాలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాల వివరాలు ఇవే:**

1. యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల, హన్మకొండ
2. యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల (మరో కేంద్రం), హన్మకొండ
3. సెయింట్ గాబ్రియేల్ హైస్కూల్, ఫాతిమా నగర్
4. న్యూ సైన్స్ డిగ్రీ కాలేజ్, అదాలత్ సమీపం, హంటర్ రోడ్
5. ఎస్సార్ నేషనల్ హైస్కూల్, అడ్వకేట్స్ కాలనీ, హన్మకొండ
6. ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, వడ్డేపల్లి, హన్మకొండ
7. శ్రీ గాయత్రి డిగ్రీ, పీజీ కళాశాల, ప్రభుత్వ ఐటీఐ ఎదురుగా, ములుగు రోడ్
8. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, భద్రకాళి దేవాలయం సమీపం, రంగంపేట
9. లాల్ బహదూర్ కళాశాల, హన్మకొండ
10. ప్రభుత్వ జూనియర్ కళాశాల, అశోక్ థియేటర్ సమీపం, హన్మకొండ.

## కవి సమ్మేళన కార్యక్రమంలో ఎంపి కడియం కావ్య



ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ : హనుమకొండ కాకాజీ అడ్వకేట్స్ కాలనీలో తెలంగాణ రచయితల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన "కవిత్వంతో కలుద్దాం" కార్యక్రమానికి వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ, ప్రతి సామాజిక ఉద్యమాన్ని అందుకునే తొలి సాహిత్య రూపం కవిత్వమని అన్నారు. పోరాటాల కేంద్రంగా పేరుగాంచిన వరంగల్, సాహిత్య ఉద్యమాల్లో కూడా ఎప్పటికప్పుడు అగ్రగామిగా నిలుస్తోందని పేర్కొన్నారు. దేశీయ తెలుగులో సాహిత్య సృజనకు శ్రీకారం చుట్టిన పాలకుర్తి సోమన వారసత్వం, "సాహిత్యం ప్రజల కోసమే" అనే పోతన భావజాలాన్ని ఓరుగల్లు సాహితీవేత్తలు నేటికీ ముందుకు తీసుకెళ్తున్నారని తెలిపారు.మనం జీవిస్తున్న ప్రపంచంలో అనేక అసమానతలు, అధిపత్య ధోరణులు ఇంకా కొనసాగుతున్నాయని, అలాంటి పరిస్థితుల్లో సమాజాన్ని చైతన్యపరిచే శక్తి సాహిత్యానికి ఉందని అన్నారు. కవులు, రచయితలు తమ కలం ద్వారా సమాజ సమస్యలను వెలుగులోకి తీసుకురావాలని పిలుపునిచ్చారు. యువతలో పఠనాభిరుచి, సృజనాత్మక ఆలోచనలను పెంపొందించేందుకు ఇటువంటి కవి సమ్మేళనాలు ఎంతో దోహదపడతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో కుంజ కళ్యాణి రచించిన "కంకపోద" పుస్తకాన్ని అంజనీ దేవి పరిచయం చేశారు. అనంతరం పలువురు రచయితలు, కవులు తమ కవితలను చదివి వినిపించారు.ఈ సమావేశంలో పోట్లపల్లి శ్రీనివాస్ రావు, మాజీ కార్పొరేటర్ మాధవి, అసనాల శ్రీనివాస్, బిల్ల మహేందర్, బాలబోయిన రమాదేవి తదితరులతో పాటు హనుమకొండ జిల్లాకు చెందిన పలువురు కవులు, రచయితలు పాల్గొన్నారు.

# షార్ట్ సర్క్యూట్‌తో అరటి తోట దగ్ధం

అగ్ని ప్రమాదాల్లో దగ్ధమైన పంటలు పరిశీలించిన ఎమ్మెల్యే గండ్ర



ప్రజాపక్షం/భూపాలపల్లి: విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా దగ్ధమైన పంటలకు సంబంధించి విద్యుత్ శాఖ అధికారులు పూర్తి స్థాయిలో నష్టం అంచనా వేసి రైతులకు తగిన నష్టపరిహారం చెల్లించేలా చర్యలు తీసుకోవాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అధికారులకు సూచించారు. భూపాలపల్లి నియోజకవర్గ వ్యాప్తంగా అగ్ని ప్రమాదాల్లో దగ్ధమైన పంటలను ఎమ్మెల్యే గండ్ర పరిశీలించారు. చిట్యాల మండలం రామచంద్రపురం గ్రామానికి చెందిన సిరిపురం కుమారస్వామి అరటి తోట విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా దగ్ధమైంది. అలాగే చల్లగరిగ గ్రామంలో చాడ సమ్మిరెడ్డి పామాయిల్ తోట, చిట్యాల గ్రామంలో బాలవేణి వేణు మిరప పంట అగ్ని ప్రమాదాల్లో దగ్ధమైనాయి. మండలంలోని అంకుషాపురం గ్రామంలో చిత్తిరెడ్డి రమణారెడ్డి పామాయిల్ తోట కూడా అగ్ని ప్రమాదంలో దెబ్బతింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే గండ్ర ఈ ఘటనల్లో నష్టపోయిన రైతుల దగ్ధమైన తోటలు పంట పొలాలను సందర్శించి పరిశీలించారు. బాధిత రైతులను పరామర్శించి జరిగిన నష్టంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా దగ్ధమైన పంటలకు సంబంధించి విద్యుత్ శాఖ అధికారులు పూర్తి స్థాయిలో నష్టం అంచనా వేసి రైతులకు తగిన నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. అలాగే వివిధ అగ్ని ప్రమాదాల్లో దగ్ధమైన పంటలకు ప్రభుత్వం నుంచి కూడా తక్షణ సహాయం నష్టపరిహారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

## భక్తులు లేక పుష్కర ఘాట్ వెలవెల



ప్రజాపక్షం/భూపాలపల్లి/కాళేశ్వరం: జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాళేశ్వరంలో సరస్వతి అంత్య పుష్కరాలు ప్రారంభమైన గురువారంతో సహా మరుసటి రోజు శుక్రవారం భక్తులు లేక సరస్వతి పుష్కర ఘాట్ వెలవెల పోయింది గత ఏడాది పుష్కరాలలో రోజురోజుకు అంతకంతకు పెరిగిన భక్తుల తాకిడితో కళకళలాడిన కాళేశ్వరం క్షేత్రం తాజాగా గత గురువారం ప్రారంభమైన సరస్వతీ అంత్య పుష్కరాలకు భక్తుల రాక అంతంత మాత్రనికే పరిమితం కావడంతో త్రివేణి సంగమ పుష్కర ఘాట్ తీరం బోసిపోయింది. త్రివేణి సంగమ తీరంలో నేటి ఉదయం వేళ కొంతమేర భక్తులు పుష్కర స్నానాలు ఆచరించినప్పటికీ మద్యాహ్నానికి భక్తుల సంఖ్య తగ్గుముఖం పట్టి నామ మాత్రానికే పరిమితమైంది. ఉష్ణోగ్రతలు 47 డిగ్రీలకు చేరుకుని దంచికొడుతున్న ఎండల తీవ్రతకు పుష్కర భక్తుల తాకిడి తగ్గిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుని గత ఏడాది సరస్వతీ ఆది పుష్కరాల కంటే ఈ ఏడాది అంత్య పుష్కరాల ఏర్పాట్లను భారీగా చేపట్టినప్పటి భక్తుల రాక తగ్గిపోవడంతో అధికార యంత్రాంగం అయోమయంలో పడ్డారు. అదే విధంగా గత ఏడాది పుష్కర సమయంలో భక్తులతో కిటకిటలాడిన కాళేశ్వర ముక్తీశ్వర ఆలయం నేటి పుష్కరాలలో భక్తులు లేక వెలవెలబోతోంది. సరస్వతీ అంత్య పుష్కరాల సందర్భంగా గత ఏడాది పుష్కరాల అనుభవాలను దృష్టిలో పెట్టుకొని క్షేత్రంలో భారీ స్థాయిలో ఏర్పాటు చేసిన వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, పారిశుధ్య కార్మికులు, బందోబస్తు పోలీసుల హడావుడి మాత్రమే నెలకొని ఉండగా పుష్కరాలకు కొద్ది పాటి భక్తులే పరమితం కావడం విస్మయానికి గురి చేస్తుంది. వీకెండ్ శని, ఆది వారాల్లో భక్తుల తాకిడి గణనీయంగా పెరుగుతుందని అధికారులు భావిస్తున్నారు.


# నెక్కొండ రైల్వే సమస్యల పరిష్కారానికి చర్యలు



ప్రజాపక్షం/నెక్కొండ: నెక్కొండ పట్టణ ప్రజలు, వ్యాపారస్తులు, నిత్యం ఎదుర్కొంటున్న రైల్వే సంబంధిత సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని నర్సంపేట ఎంఎల్‌ఏ దొంతి మాధవరెడ్డి భరోసా ఇచ్చారు. శుక్రవారం నెక్కొండ పట్టణంలోని నెహ్రూ సెంటర్ ప్రాంతంలో రైల్వే అండర్ బ్రిడ్జి, మూడవ లైన్‌పై నిర్మించనున్న బ్రిడ్జి పనులు, అలాగే అండర్ బ్రిడ్జి వద్ద ఏర్పాటు చేసిన సైడ్ వాల్స్ కారణంగా వ్యాపారస్తులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఎంఎల్‌ఏ స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా రైల్వే అసిస్టెంట్ డివిజనల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అంజిరెడ్డి, ఆర్ అండ్‌బి ఈఈ రాజేందర్, తదితర అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఏ దొంతి మాధవరెడ్డి మాట్లాడుతూ నెక్కొండ అభివృద్ధి విషయంలో ఎలాంటి రాజీ ఉండదు. ప్రజల రాకపోకలకు, వ్యాపారాలకు ఆటంకం కలిగించే అంశాలను వెంటనే పరిష్కరించేలా అధికారులతో మాట్లాడారు. అండర్ బ్రిడ్జి వద్ద ఉన్న సైడ్ వాల్స్ తొలగింపు ప్రజలకు అనుకూలంగా రహదారి సౌకర్యాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. అలాగే రైల్వే, ఆర్‌అండ్‌బి శాఖల సమన్వయంతో పెండింగ్ సమస్యలను త్వరగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సొంటిరెడ్డి, రంజిత్‌రెడ్డి, హరీష్ రెడ్డి, హరిప్రసాద్, ఉమారాణి, రాజ్ కుమార్, సదానందం, బండి శివకుమార్, ఎస్ఐ మహేదర్, తీన్మార్ చౌహాన్, కాంగ్రెస్ నాయకులు, ప్రజా ప్రతినిధులు, వ్యాపారస్తులు, పలు గ్రామాల సర్పంచ్‌లు, కాంగ్రెస్ పార్టీ నేతలు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఎపి ఎఫ్ డిసి ఛైర్మన్ మెంబర్లకు తెలంగాణ ఛాంబర్ సన్మానం ఆంధ్రప్రదేశ్ ఫిల్మ్, టెలివిజన్ అండ థియేటర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు నూతనంగా నియమితులైన ఛైర్మన్, డైరెక్టర్స్‌కు తెలంగాణ ఫిలిం ఛాంబర్ ఛైర్మన్, నిర్మాత డా. ప్రతాని రామకృష్ణ గౌడ్ ఘనంగా సన్మానించారు.

రీల్



## పదేళ్ల తరువాత చేస్తున్న సినిమా 'ట్రాన్స్‌ఫర్ త్రిమూర్తులు'

### టీజర్ రిలీజ్ ఈవెంట్‌లో హీరో వడ్డే నవీన్

వడ్డే జిష్ణు సమర్పణలో వడ్డే క్రియేషన్స్ బ్యానర్ మీద వడ్డే నవీన్ హీరోగా, నిర్మాతగా రూపొందించిన చిత్రం 'ట్రాన్స్‌ఫర్ త్రిమూర్తులు'. కమల్ తేజ నార్ల ఈ మూవీతో దర్శకుడిగా పరిచయం కాబోతోన్నారు. ఈ సినిమాలో వడ్డే నవీన్, రాశి సింగ్, శిల్పా తులస్కర్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఈ మూవీని జూన్ 19న విడుదల చేయనున్నారు. ఈ క్రమంలో మూవీ టీజర్‌ను రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా హీరో వడ్డే నవీన్ మాట్లాడుతూ మా నాన్న చనిపోయిన తరువాత నేను నటిస్తున్న, నిర్మిస్తున్న మొదటి చిత్రమిది. నేను ఎప్పుడూ హైదరాబాద్‌లోనే ఉన్నాను. ఫ్యామిలీతోనే ఉంటున్నాను. నేను ఎక్కువగా బయట కనిపించను. కానీ నా గురించి మీడియా, అభిమానులు మాత్రం ఎప్పుడూ గుర్తు చేసుకుంటూనే ఉన్నారు. నా వద్దకు వచ్చిన కథలు నచ్చలేదు, నచ్చిన కథలు నా వద్దకు రాలేదు. ఎన్నో కథలు విన్నాను. త్రిమూర్తులు పాత్ర గురించి మాత్రమే కమల్ చెప్పాడు. 'ట్రాన్స్‌ఫర్ త్రిమూర్తులు' అనే టైటిల్ కూడా చెప్పాడు. అయితే కథ, స్క్రిప్ట్ మీద ఏడాది పాటు ఇద్దరం వర్క్ చేశాం. కథ మొత్తం రెడీ అయ్యాక షూటింగ్‌కి వెళ్లాం. కంటెంట్ కూడా కొత్తగా ఉంటుంది. అందరం కలిసి ఓ ఫ్యామిలీలా ఈ మూవీ కోసం పని చేశాం. జూన్ 19న 'ట్రాన్స్‌ఫర్ త్రిమూర్తులు' ఆడియెన్స్ ముందుకు వస్తోంది. గత పదేళ్లుగా నేను ఎక్కడా కనిపించకపోయినా, సినిమాలు చేయకపోయినా నన్ను గుర్తు పెట్టుకున్న ప్రేక్షకులకు థాంక్స్ అని అన్నారు. ఈ కార్యక్రమంలో హీరోయిన్ రాశీ సింగ్, దర్శకుడు కమల్ తేజ నార్ల, ఫైట్ మాస్టర్ రామ్ సుంకర, సంగీత దర్శకుడు కళ్యాణ్ నాయక్, ఎడిటర్ విజయ్ ముక్తవరపు, కెమెరా మెన్ కార్తీక్ సుజాత సాయికుమార్, ఆర్ట్ డైరెక్టర్ భిక్షపతి పాల్గొన్నారు.

## మినిస్టర్ నారాయణగా 'రాజా రవీందర్'



వరుణ్ సందేశ్, గగన్, సత్యం రాజేష్, రవి ప్రధాన పాత్రల్లో ఎకె జంపన్న రచన, దర్శకత్వంలో గోల్డెన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై తోట లక్ష్మీ కోటేశ్వర రావు నిర్మిస్తున్న చిత్రం 'క్యాస్ట్. ఈ చిత్రంలో రాజా రవీందర్ కీలక పాత్ర పోషిస్తున్నారు. ఆయన పాత్రని మినిస్టర్ నారాయణగా పరిచయం చేస్తూ ఫస్ట్ లుక్‌ని రిలీజ్ చేశారు. మంత్రి నారాయణగా రాజా రవీందర్ లుక్ పవర్‌ఫుల్‌గా ఆకట్టుకుంటోంది. తెల్లటి దుస్తులు, భుజంపై పార్టీ కండువా ధరించి ఇంటెన్స్‌గా కనిపిస్తున్నారు. ఈ చిత్రంలో కశికా కపూర్, దివి హీరోయిన్స్‌గా నటిస్తున్నారు. ఈ చిత్రానికి అనూప్ రూబెన్స్ మ్యూజిక్ అందిస్తున్నారు. త్వరలోనే ఈ సినిమా రిలీజ్ డేట్‌ని అనౌన్స్ చేయనున్నారు.


## 'సమవర్తి' ఫస్ట్ లుక్ విడుదల

వైవిధ్యమైన చిత్రాల్లో నటిస్తూ హీరోగా తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు యంగ్ టాలెంటెడ్ హీరో సత్యదేవ్. ఆయన హీరోగా నటిస్తున్న కొత్త చిత్రానికి 'సమవర్తి' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. ఈ రోజు ఈ చిత్ర టైటిల్, ఫస్ట్ లుక్ పోస్టర్ రిలీజ్ చేశారు. సత్యదేవ్ హీరోగా నటిస్తున్న 16వ చిత్రమిది. 'సమవర్తి' సినిమాను రుద్ర పిక్చర్స్ బ్యానర్ & పంచభూత ప్రొడక్షన్స్ పై శివచరణ్ రెడ్డి జక్కిడి, శశిధర్ రెడ్డి పడమటి నిర్మిస్తున్నారు. అజయ్ నాగ్. వి దర్శకత్వం వహిస్తున్నారు. ఎకోలాజికల్ యాక్షన్ థ్రిల్లర్‌గా తెరకెక్కుతున్న ఈ సినిమా త్వరలోనే తెలుగుతో పాటు తమిళ, కన్నడ, మలయాళంలో గ్రాండ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. 'సమవర్తి' సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్‌లో సత్యదేవ్ చుట్టూ గొడ్డళ్లు, కత్తులతో కొందరు దూసుకు రాగా, ఆయన ఎలాంటి భయం లేకుండా హెడ్‌ఫోన్స్‌లో పాటలు వింటూ ఇంటెన్స్ లుక్స్‌లో కనిపిస్తుండటం ఆసక్తి కలిగిస్తోంది. సమవర్తి అంటే యముడు, ఎవరి పట్ల పక్షపాతం లేని వాడు అని అర్థం. ఈ సమవర్తి శత్రువుల పాలిట యముడిలా మారి వారందరినీ ఎలాంటి తేడాలు లేకుండా ఒకేలా కనుమరుగు చేస్తాడని అనుకోవచ్చు. సత్యదేవ్ కెరీర్‌లో ఇదొక హై ఇంటెన్స్ యాక్షన్ మూవీ అవుతుందనే అంచనాలు టైటిల్, ఫస్ట్ లుక్ పోస్టర్‌తో ఏర్పడుతున్నాయి.



## యాక్షన్ డ్రామాగా 'రౌడీ జనార్ధన'

స్టార్ హీరో విజయ్ దేవరకొండ శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్‌లో నటిస్తున్న క్రేజీ మూవీ 'రౌడీ జనార్ధన'. స్టార్ ప్రొడ్యూసర్స్ దిల్ రాజు, శిరీష్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. డైరెక్టర్ రవి కిరణ్ కోలా ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. రూరల్ యాక్షన్ డ్రామా నేపథ్యంతో భారీ పాన్ ఇండియా ప్రాజెక్ట్‌గా 'రౌడీ జనార్ధన' సినిమా రూపొందుతోంది. ఛాతీపై హీరోయిన్ కీర్తి సురేష్ కాలు పెట్టినట్లు చూపించడం ఆసక్తి కలిగిస్తోంది. ఈ పోస్టర్ యాక్షన్‌తో పాటు రొమాంటిక్ యాంగిల్ ను ఎస్టాబ్లిష్ చేస్తోంది. రౌడీ జనార్ధన సినిమాను సిల్వర్ స్క్రీన్‌పై చూసేందుకు రౌడీ ఫ్యాన్స్‌తో పాటు మూవీ లవర్స్ వెయిట్ చేస్తున్నారు. ఈ డిసెంబర్‌లో ఈ సినిమా థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది. విజయ్ దేవరకొండ సరసన కీర్తి సురేష్ హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ చిత్రానికి ప్రొడక్షన్ డిజైనర్ డినో శంకర్, డిఓపి ఆనంద్ సి చంద్రన్, ప్రొడ్యూసర్స్ దిల్ రాజు, శిరీష్.



## భూపాల్‌లో 'పెద్ది' పాట రిలీజ్ చేయనున్న రామ్‌చరణ్



రామ్ చరణ్ హీరోగా బుచ్చిబాబు సానా దర్శకత్వంలో తెరకెక్కిన పెద్ది సినిమా విడుదల సమయం దగ్గర పడుతున్న నేపథ్యంలో ప్రమోషన్ డోసు పెంచారు. ఇటీవల ముంబైలో ప్రచార కార్యక్రమాలను మొదలు పెట్టిన 'పెద్ది' టీమ్ ఇప్పుడు పూర్తి స్థాయిలో పాటను భూపాల్‌లో రిలీజ్ చేయనున్నారు. హెల్లల్లో అనే పాటను మధ్య ప్రదేశ్ , భూపాల్ వేదికగా ఆవిష్కరించనున్నారు. రాంచరణ్ సరసన జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఈ కాంబినేషన్ తొలిసారిగా ప్రేక్షకుల ముందుకు వస్తోంది. దీంతో రామ్ చరణ్ ఫాన్స్‌లో ఈ సినిమాపై ఆసక్తి నెలకొంది. ఆస్కార్ అవార్డు గ్రహీత ఏ ఆర్ రెహ్మాన్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రంలోని పాటలకు ఇప్పటికే మంచి ఆదరణ లభిస్తోంది. మరోపక్క పోస్ట్ ప్రొడక్షన్ పనులు చివరి దశలో ఉన్నాయి. వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్న ఈ సినిమాను మైత్రి మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సంయుక్తంగా సమర్పిస్తున్నారు. జగపతి బాబు, జ్యోతి దేష్ పాండే, బొమ్మన్ ఇరానీ, తదితరులు నటిస్తున్నారు. ఈ చిత్రానికి ప్రొడక్షన్ డిజైనర్ అవినాష్ కోల్ల, ఎడిటర్ నవీన్ నూలి, రత్నవేలు సినిమాటోగ్రాఫర్‌గా పని చేశారు.

## 'మేము కాప్ లమ్' 17 రోజుల్లో షూటింగ్ పూర్తి

### నిర్మాత: బి.వి.ఎస్.రవి




జీ తెలుగు నుంచి 'మేము కాప్ లమ్' అనే మరో ఒరిజినల్ సిరీస్ వచ్చింది. రా ఎంటర్‌టైన్‌మెంట్స్ (ప్రొడక్షన్ నెం. 3) బ్యానర్‌పై బి.వి.ఎస్. రవి నిర్మించిన 'మేము కాప్ లమ్' సిరీస్‌కు 'వికటకవి' ఫేమ్ ప్రదీప్ మద్దాలి దర్శకత్వం వహించారు. ఈ సిరీస్‌లో నాగబాబు కొణిదెల ప్రధాన పాత్రను పోషించారు. గెటప్ శ్రీను, రవి తేజ నన్నిమాల వంటి ప్రముఖ తారాగణం నటించారు. ఈ సిరీస్ మే 22 నుంచి స్ట్రీమింగ్ కానుంది. ఈ క్రమంలో ప్రివ్యూ ఈవెంట్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తమన్, బండ్ల గణేష్, అజయ్ భూపతి, కోన వెంకట్ తదితరులు ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ఈ సందర్భంగా నిర్మాత బివిఎస్ రవి మాట్లాడుతూ శోభన్, చాణక్య వర్మ ఈ కథను చెప్పారు. ప్రదీప్ నాకు ఆప్తుడు. నా 30 ఏళ్లలో ప్రదీప్ లాంటి ఓ డైరెక్టర్‌ని చూడలేదు. ఒక కోడిని పట్టుకునేందుకు ఇద్దరు పోలీస్ ఆఫీసర్లు రంగంలోకి దిగుతారు. గెటప్ శ్రీను గొప్ప నటుడు. రవి, శ్రీను కలిసి చేసిన పర్ఫామెన్స్ అదిరిపోతుంది. అన్ని డిపార్ట్‌మెంట్ల సహకారంతోనే 17 రోజుల్లో షూటింగ్ చేశాం. నాగబాబుగారు ఈ ప్రాజెక్ట్‌లోకి రావడంతోనే మా సిరీస్ స్థాయి, విలువ పెరిగింది. సాకేత్ మాకు మంచి మ్యూజిక్ ఇచ్చారు. ధ్రువన్ మంచి లిరిక్స్ ఇచ్చారు. మే 22 నుంచి మా సిరీస్ స్ట్రీమింగ్ అయింది. మా సిరీస్ ఆనందంగా, ఆహ్లాదంగా, సరదాగా ఉంటుంది. అందరూ చూసి విజయాన్ని అందిస్తారని ఆశిస్తున్నాను' అని అన్నారు. ఈ కార్యక్రమంలో సిరీస్‌లో నటించిన నటీనటులు, సాంకేతిక నిపుణులు పాల్గొన్నారు.

# ప్రజాస్వామ్యానికి బలమైన సంస్థలు అవసరం

### గవర్నర్ శివ్‌ప్రతాప్ శుక్లా
### పోలీసు అకాడమీలో ఘనంగా రైజింగ్ డే వేడుకలు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రజాస్వామ్యానికి బలమైన సంస్థలు అవసరమని, ప్రజల నమ్మకాన్ని నిలబెట్టే బాధ్యత పోలీసు వ్యవస్థపై ఉందని రాష్ట్ర గవర్నర్ శివ్‌ప్రతాప్ శుక్లా అన్నారు. నాలుగు దశాబ్దాల పోలీసు శిక్షణ, నాయకత్వ వికాసం, ప్రజాసేవా ప్రస్థానాన్ని పూర్తి చేసుకున్న రాజా బహదూర్ వెంకట రామారెడ్డి (ఆర్‌బివిఆర్‌ఆర్) తెలంగాణ పోలీస్ అకాడమీ తన 40వ రైజింగ్ డే వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించింది. ఈ ముగింపు వేడుకలకు తెలంగాణ గవర్నర్ శివ్‌ప్రతాప్ శుక్లా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ పరీక్షల ద్వారా ఉద్యోగం లభించినా, ప్రజలకు సేవ చేసే వ్యక్తిత్వం, నైతిక విలువలు, రాజ్యాంగ బాధ్యతలను శిక్షణా సంస్థలే అందిస్తాయని పేర్కొన్నారు. తెలంగాణ పోలీస్ వ్యవస్థ దేశంలోనే ఆధునిక, సాంకేతిక ఆధారిత, ప్రజా కేంద్రిత పోలీసింగ్‌కు ఆదర్శంగా నిలుస్తోందని గవర్నర్ ప్రశంసించారు. మహిళల భద్రత, సైబర్ నేరాల నియంత్రణ, కమాండ అండ కంట్రోల్ వ్యవస్థలు, కమ్యూనిటీ పోలీసింగ్ వంటి కార్యక్రమాలు రాష్ట్రాన్ని ప్రత్యేకంగా నిలిపాయని చెప్పారు. అదే సమయంలో సైబర్ నేరాలు, ఆర్థిక మోసాలు, కృత్రిమ మేధస్సు ఆధారిత నేరాలు, తప్పుడు సమాచార వ్యాప్తి వంటి కొత్త సవాళ్లను ఎదుర్కొనేందుకు పోలీసులు సాంకేతికంగా, చట్టపరంగా, భావోద్వేగపరంగా సిద్ధంగా ఉండాలని సూచించారు. ఆర్‌బివిఆర్‌ఆర్ తెలంగాణ పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్త్ మాట్లాడుతూ అకాడమీ అభివృద్ధి ఒక్కరి కృషి కాదని, తరతరాల నాయకత్వం కలిసికట్టుగా నిర్మించిన వారసత్వమని అన్నారు. నేటి నేరాల స్వభావం సరిహద్దులు లేని, సాంకేతిక ఆధారితంగా మారిందని, అందుకు అనుగుణంగా శిక్షణ కూడా మారాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. పోలీసు శిక్షణను కేవలం కోర్సుగా కాకుండా నిరంతర అభ్యాస ప్రక్రియగా మార్చే దిశగా అకాడమీ ముందుకు సాగుతోందని తెలిపారు. ఇందుకోసం యూనిసేఫ్,ఐఐఐటి హైదరాబాద్,జెఎన్‌టియు,రాష్ట్రీయ రక్షా యూనివర్సిటీ తదితర సంస్థలతో భాగస్వామ్యాలు కొనసాగుతున్నాయని చెప్పారు. మూడు రోజుల వేడుకల్లో క్రీడా పోటీలు, ఓపెన్ హౌస్ కార్యక్రమాలు, సైబర్ అవగాహన, డ్రగ్స్ నివారణ అంశాలపై విద్యార్థులకు ప్రత్యేక సెషన్లు నిర్వహించారు. అలాగే థలసేమియా అండ సికిల్ సెల్ సొసైటీ సహకారంతో నిర్వహించిన రక్తదాన శిబిరంలో సుమారు 50 యూనిట్ల రక్తం సేకరించారు.

## రిజర్వేషన్లు ఎందుకు?

(మొదటి పేజీ తరువాయి)

పరిమితులు, రిజర్వేషన్ల మినహాయింపులపై దాఖలైన పిటిషన్లను విచారించిన జస్టిస్ బి.వి. నాగరత్న, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌లతో కూడిన ధర్మాసనం శుక్రవారం ఈ కీలక వ్యాఖ్యలు చేసింది. విచారణ సందర్భంగా జస్టిస్ బి.వి. నాగరత్న మాట్లాడుతూ.. విద్య, ఆర్థిక సాధికారత ద్వారా సమాజంలో ఒక స్థాయి లభిస్తుందని పేర్కొన్నారు. 'రిజర్వేషన్ల ద్వారా ఒకసారి ఉన్నత స్థాయికి చేరుకున్నాక కూడా, మళ్లీ వారి పిల్లల కోసం కోటాను ఆశించడం సరికాదు. ఇలాగైతే మనం రిజర్వేషన్ల వ్యవస్థ నుంచి ఎప్పటికీ బయటపడలేం. ఈ అంశాన్ని తీవ్రంగా పరిగణించాల్సి ఉంది' అని వ్యాఖ్యానించారు. ఒక వ్యక్తి సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడి ఉండవచ్చని.. కానీ, రిజర్వేషన్ల ప్రయోజనం పొంది తల్లిదండ్రులు ఉన్నత స్థానాలకు వెళ్లినప్పుడు వారి పిల్లల పరిస్థితి మారుతుందని, ఇక్కడ ఒక సమతుల్యత అవసరమని కోర్టు స్పష్టం చేసింది. ఒకే కుటుంబంలో ఉన్నత వర్గాలే అన్ని అవకాశాలను చేజిక్కించుకుంటే, అదే వర్గంలోని అత్యంత వెనుకబడిన పేదలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ధర్మాసనం ఆందోళన వ్యక్తం చేసింది. రిజర్వేషన్ల ఫలాలు కేవలం కొందరికే పరిమితం కాకుండా, సమాజంలో కిందిస్థాయిలో ఉన్న చివరి వ్యక్తికి కూడా అందాల్సిన అవసరం ఉందని కోర్టు అభిప్రాయపడింది. ప్రస్తుతం ఒబిసిలకే పరిమితమైన 'క్రీమీలేయర్' నిబంధనలను, మరింత శాస్త్రీయంగా అమలు చేయడంపై న్యాయస్థానం దృష్టి సారించింది.

**ఇంద్ర సాహ్ని తీర్పు.. ప్రస్తుత నిబంధనలు**

1992 నాటి చారిత్రాత్మక 'ఇంద్ర సాహ్ని' (మండల్ కమిషన్) కేసులో సుప్రీంకోర్టు ఒబిసిలకు 27 శాతం రిజర్వేషన్లను సమర్థిస్తూనే, వారిలో 'క్రీమీలేయర్' వర్గాలను మినహాయించాలని స్పష్టం చేసింది. ప్రస్తుతం వార్షిక ఆదాయం రూ. 8 లక్షలు దాటిన వారితో పాటు.. ఉన్నత రాజ్యాంగ పదవుల్లో ఉన్నవారు, ఐఎఎస్, ఐపిఎస్ వంటి సీనియర్ బ్యూరోక్రాట్లు, మిలిటరీలో టాప్ ఆఫీసర్ల పిల్లలను ఆదాయంతో సంబంధం లేకుండా క్రీమీలేయర్ కింద పరిగణించి కోటా నుంచి మినహాయిస్తున్నారు. అయితే, ఈ మినహాయింపులను సవాల్ చేస్తూ కోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. ఇక, ఈ కేసులో సుప్రీంకోర్టు.. కేంద్ర ప్రభుత్వానికి, ఇతర సంబంధిత వర్గాలకు నోటీసులు జారీ చేస్తూ తదుపరి విచారణను వాయిదా వేసింది.

## డయాలసిస్ పేషెంట్లకు అండగా ప్రభుత్వం

### మరో 2,356 మందికి చేయూత పెన్షన్లు మంజూరు
### మంత్రి సీతక్క

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత డయాలసిస్ పేషెంట్ల సంక్షేమానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క తెలిపారు. తీవ్రమైన ఆరోగ్య సమస్యలతో పాటు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కిడ్నీ బాధిత కుటుంబాలకు ప్రభుత్వం భరోసాగా నిలుస్తోందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇప్పటికే 4,710 మంది డయాలసిస్ పేషెంట్లకు చేయూత పెన్షన్లు అందించగా, తాజాగా మరో 2,356 మంది బాధితులకు కొత్తగా పెన్షన్లు మంజూరు చేసినట్లు ఆమె వెల్లడించారు. డయాలసిస్ పేషెంట్లు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రభుత్వం మానవీయ కోణంలో అర్థం చేసుకుంటుందన్నారు. ఆరోగ్య సమస్యలతో పోరాడుతున్న కుటుంబాలకు అండగా నిలవడం ప్రభుత్వ బాధ్యతగా భావిస్తున్నామన్నారు. అర్హులైన ప్రతి బాధితుడికి చేయూత పెన్షన్ అందేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రజా పాలనలో సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, అత్యవసర సమయంలో ప్రజలకు అండగా నిలవడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తెలిపారు. ఈ ఫైల్‌పై మంత్రి సీతక్క సంతకం చేయగా, వచ్చే నెల నుంచి లబ్ధిదారులకు పెన్షన్లు అందనున్నాయి. మరో 488 దరఖాస్తులు ప్రస్తుతం పరిశీలనలో ఉన్నాయని, అర్హులైన వారికి త్వరలోనే పెన్షన్లు మంజూరు చేస్తామని అధికారులు తెలిపారు. డయాలసిస్ చికిత్స కోసం తరచూ ఆస్పత్రులకు వెళ్లాల్సి రావడం, మందులు, ప్రయాణ ఖర్చులు, ఉపాధి కోల్పోవడం వంటి సమస్యలతో బాధిత కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయన్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం అందిస్తున్న రూ.2016 చేయూత పెన్షన్ వారికి ఆర్థికంగా ఊరటనిస్తోందన్నారు.

## పెంపు కాదు... తగ్గాయ్

(మొదటి పేజీ తరువాయి)

హెచ్చరించారు. హైదరాబాద్‌లోని ఎఐటియుసి రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో యూసుఫ్ మాట్లాడుతూ కనీస వేతనాలు పెంచకుండా, కార్మికులకు ఎంతో మేలు చేసినట్టుగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన ప్రకటన చూస్తే,వేతనాలు పెంచకుండా తగ్గించిట్టుగా స్పష్టం అవుతుందన్నారు. ప్రస్తుతం సఫాయి కర్మచారి కార్మికులకు జి.ఒ నంబర్ 108 ప్రకారం జోన్1లో నెలకు రూ.17,332ల వేతనాన్నిపొందుతున్నారని, కానీ ప్రభుత్వం ప్రకటించిన వేతనం ప్రకారం వారికి రూ.16,000లు వస్తుందని వివరించారు. అలాగే జోన్2లో ప్రస్తుతం రూ.17,072ల వేతనం ఉంటే, ప్రభుత్వ ప్రకటన ప్రకారం రూ.15,000లకు తగ్గించినట్టుగా ఉన్నదని, జోన్3లో ప్రస్తుతం రూ.16872ల వేతనాన్ని పొందుతుండగా, నూతన వేతనం ప్రకారం రూ.14,000లుగా ఉన్నదని యూసుఫ్ తెలిపారు. జోన్1లో రూ.1332, జోన్ 2లో రూ.2072, జోన్3లో రూ.2872ల వేతనాన్ని తగ్గించి పెంచామంటున్నారు. అలాగే కొన్ని జిఒల్లో జోన్1లో నామమాత్రంగా పెంచి, జోన్2, జోన్3లో తగ్గించారని విమర్శించారు. కాంట్రాక్ట్ లేబర్ జి.ఒలో స్కిల్ కార్మికులకు రూ.485లు తగ్గించారని, హైలీ స్కిల్ కార్మికులకు రూ.3,683లు జోన్1లో తగ్గించారన్నారు. జిఒ 34లో వేతనాలు తగ్గగా, 39 జిఒలో నామమాత్రంగా వేతనాలను పెంచి రాష్ట్ర ప్రభుత్వం వేతనాలు పెంచామనటం తగదన్నారు.

కింది స్థాయి ఉద్యోగికి కనీసం రూ.26 వేల వేతనాన్ని నిర్ణయించాలని జాతీయ,ప్రాంతీయ కార్మిక సంఘాలు నిరంతరం పోరాటాలు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్రంలో రాష్ట్ర ప్రభుత్వం నియమించిన కనీస వేతనాల సలహా మండలి ఏప్రిల్,2025లోనే కింది స్థాయి ఉద్యోగులకు రూ.20,257లు, అలాగే సెమీస్కిల్ కార్మికులకు రూ.23వేలు, స్కిల్ కార్మికులకు రూ.26వేలు, హైలీస్కిల్ కార్మికులకు రూ.28వేలవేతనాలు ఇవ్వాలని శాస్త్రీయ బద్ధంగా నిర్ణయిస్తూ, కార్మిక శాఖకు నివేదికను సమర్పించినట్టు యూసుఫ్ తెలిపారు. రాష్ట్రాన్ని 3 జోన్లుగా విభజించడంతో కార్మికులు నష్టపోతున్నారన్నారు. గత 2021 జూన్ 25వ తేదీ నుండి 30వ తేదీ వరకు అప్పటి రాష్ట్ర ప్రభుత్వం వేతనాలను పెంచుతూ 5 జి.ఒను విడుదల చేసిందని, కానీ ఆజిఒలో కింది స్థాయి ఉద్యోగుల కనీస వేతనం రూ.18,018లు కాగా ,హైలీ స్కిల్ ఉద్యోగులకు రూ.36 వేలుగా నిర్ణయించిందన్నారు. కొన్ని అసంబద్ధమైన కారణాలను చెబుతూ ఆ ప్రభుత్వం జిఒ 5ను పెండింగ్‌లో పెట్టిందని,అయితే ఆ జిఒను అమలు చేయాలని ఆ సమయంలో ఎంపిగా ఉన్న ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వానికి రాతపూర్వకంగా డిమాండ్ చేశారని యూసుఫ్ గుర్తుచేశారు. కనీస వేతనాల సలహా మండలి సలహాలను తు.చ. తప్పకుండా పాటించి,జిఒను విడుదల చేయాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు.




Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Baddam Yella Reddy Bhavan, Ganesh Nagar, KARIMNAGAR 505001 Telangana State. RNI TELTEL /2018/76746, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com